RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®
తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:31 హైదరాబాద్, ఆదివారం, 13 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00




హైదరాబాద్, జులై 12: సీఎం రేవంత్ రెడ్డిని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్ర దేవ్ ఇవాళ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో ఈ భేటీ జరిగింది. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లే అంశంపై ఇరువురి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతో పాటు సేవా రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా పాల్గొన్నారు.

# కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా?: మహేశ్‌కుమార్‌గౌడ్

%హైదరాబాద్: కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు.



"గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా?" అని ఎద్దేవా చేశారు.

# సీఎం రేవంత్ రాష్ట్రంలో ఉండేది తక్కువ.. ఢిల్లీలో ఎక్కువ: కవిత ఫైర్

%రంగారెడ్డి, జులై 12: జిల్లాలోని కేశంపేట మండలం కాకునూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి పథకాన్ని వెంటనే ప్రారంభించాలంటూ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉండేది తక్కువని.. ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటారని వ్యాఖ్యలు చేశారు. చదువుకునే విద్యార్థినులకు ఇస్తానన్న స్కూటీలు ఎక్కడ అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే ఆడపిల్ల పెళ్ళికి లక్ష నగదుతో పాటు తులం బంగారం అన్నారని.. ఈ 18 నెలల్లో ఎక్కడైనా ఇచ్చారా అని నిలదీశారు.



సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ జపం చేయడం తప్ప పాలన తెలీదంటూ విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలల్లో మొత్తం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఉన్నారని అని ఆరోపించారు. సీఎం సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌లో అంబులెన్సులలో కనీసం డీజిల్ పోసే పరిస్థితి లేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే రెండు లక్షల కోట్ల అప్పు చేసిందని తెలిపారు. రేషన్ షాప్‌ల్లో ఇస్తున్న సన్న బియ్యంలో 50 శాతం దొడ్డు బియ్యమే అని నిరూపిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. ఫ్రీ బస్సు పేరున గ్రామాలకు బస్సులు తగ్గించారని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం పని చేసే ప్రభుత్వం కాదని.. వెంటపడి పని చేయించుకోవాలని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు చేశారు.

# బీసీలకు రిజర్వేషన్.. కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదు: పాయల్ శంకర్

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదు. బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీం కోర్టు అంగీకరించవు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేసి.. బీసీ రిజర్వేషన్ ఏ విధంగా అమలుచేస్తారో చర్చించాలి. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా.. బీసీలకు అన్యాయం జరగకుండా.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి" అని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.



# కుర్చీ అంత ఈజీగా దొరకదు.. చిక్కితే వదలొద్దు: డీకే శివకుమార్

బెంగళూరు: కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై రాజకీయం రోజురోజుకీ వేడెక్కుతోంది. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని ఓవైపు సిద్ధరామయ్య నొక్కి చెబుతున్నారు. అటు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. తన చేతుల్లో ఏమీ లేదంటూనే 'ఆశ పడటంలో తప్పులేదు కదా' అనే సంకేతాలిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా డీకే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. కుర్చీ దొరికితే వదలొద్దంటూ అధికార పీఠంపై తనకున్న ఆసక్తి గురించి ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.

బెంగళూరు లో న్యాయవాదుల సంఘం ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ చాలామంది లాయర్లు సీట్లు ఖాళీగా ఉన్నా అందులో కూర్చోవట్లేదు. కానీ, మేమందరం మాత్రం ఓ కుర్చీ కోసం తీవ్ర పోరాటాలు చేస్తుంటాం. కుర్చీని సంపాదించడం అంత ఈజీ కాదు. ఒకవేళ దొరికితే మాత్రం ఆ అవకాశాన్ని వదులుకోవద్దు. అందులో కూర్చోవాలి. మీకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని కర్ణాటక డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు.

ఆయన వ్యాఖ్యలతో అక్కడున్నవారంతా నవ్వులు చిందించారు.

అయితే, ఇందులో ఆయన అధికారం అనే పదాన్ని ఉపయోగించనప్పటికీ.. రాష్ట్ర రాజకీయాలను ఉద్దేశించే డీకే ఇలా మాట్లాడారంటూ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ ) అధికారంలోకి వచ్చినప్పటినుంచే డీకే, సిద్ధరామయ్యల మధ్య కుర్చీలాట మొదలైన సంగతి తెలిసిందే.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపికపై హస్తం పార్టీ తీవ్ర కసరత్తు చేసింది. చివరకు సీనియార్టీ, ఇతరత్రా అంశాలను దృష్టిలోపెట్టుకొని సిద్ధరామయ్యను హైకమాండ్ ఎంచుకుంది. అయితే, రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని అప్పటినుంచే ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పలువురు ఎమ్మెల్యేలు, కార్యకర్తలు బహిరంగంగానే దీనిపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై డీకే, సిద్ధరామయ్య ఇద్దరూ స్పష్టతనిస్తూనే ఉన్నా.. రాజకీయం మాత్రం రసవత్తరంగా మారింది. అయితే, సిద్ధరామయ్యను గద్దె దించితే పార్టీ రెండుగా చీలిపోతుందని అధిష్ఠానం భయపడుతోంది. అందుకే.. ఆయనను కొనసాగించేందుకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

# రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు: మంత్రి ప్రభాకర్

నల్లగొండ: తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ ) వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఇవాళ(శనివారం) నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి పొన్నం ప్రభాకర్.



15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని అక్కడ ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# విమాన ప్రమాదంపై ఇప్పుడే ఏ నిర్ణయానికి రావొద్దు... కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ: అహ్మదాబాద్-లండన్ ఎయిర్ ఇండియా విమానం గత నెలలో కూలిపోవడంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ( ఇచ్చిన నివేదికపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు శనివారంనాడు స్పందించారు. ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకుని ఏఏఐబీ నివేదిక ఇచ్చిందని, దీనిని బట్టి విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రాకూడదని చెప్పారు. తుది నివేదిక వచ్చేంత వరకూ వేచిచూడాలని సూచించారు.

'విమాన ప్రమాదంపై అప్పుడే ఒక తుది నిర్ణయానికి రాకూడదు. ప్రపంచంలోనే అత్యంత సమర్థత కలిగిన పైలట్లు మనకు ఉన్నారు. పైలట్లు, సిబ్బంది కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. పౌర విమానయానానికి వారు వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆ దృష్ట్యా ఇప్పుడే నివేదకపై తుది నిర్ణయానికి రాకూడదు. తుది నివేదిక కోసం వేచిచూద్దాం. ఇందులో కొన్ని సాంకేతిక అంశాలు కూడా ముడపడి ఉన్నాయి' అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## మళ్లీ తెరపైకి త్రిభాష వివాదం

మహారాష్ట్రలో భాషా వివాదం దుమారం రేపుతోంది. ఇటీవల ఓ స్థానిక చిరు వ్యాపారి మరాఠీ మాట్లాడేందుకు నిరాకరించడంతో అతనిపై మహారాష్ట్ర నవ నిర్మాణ సేన కార్యకర్తలు దాడి చేసిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడి స్థానిక వ్యాపారులు ఆందోళనలు చేపట్టారు. దీనికి నిరసనగా రాజ్‌థాక్రే ఆధ్వర్యంలోని కార్యకర్తలు థానేలో నిరసన ప్రదర్శనలు చేపట్టగా.. వాళ్లని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కూడా దీనిపై స్పందించారు. ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. కార్యకర్తలు నిరసన చేసేందుకు పోలీసులు ఓ మార్గాన్ని కేటాయించారని చెప్పారు. కానీ వాళ్లు వినకుండా వేరే మార్గంలో వెళ్లడంతోనే పోలీసులు అడ్డుకున్నట్లు స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని మరాఠీ, ఇంగ్లీష్ మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో హిందీ మూడో బోధన భాషగా ఆ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రెండు ఉత్తర్వులను తిరిగి వెనక్కు తీసుకున్నప్పటికీ, భాషా వివాదం తీవ్రంగా కొనసాగుతూనే ఉంది. అయితే రాష్ట్రప్రభుత్వం త్రిభాషా విధానాన్ని అధ్యయనం చేయడానికి ప్రఖ్యాత ఆర్థికవేత్త డాక్టర్ నరేంద్ర జాదవ్ నేతృత్వంలో కమిటీని నియమించింది. ఈ పాఠశాలల్లో మూడో భాషగా హిందీని తప్పనిసరి చేస్తూ ఏప్రిల్ 16న మహారాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి) 2020 నిబంధనల ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించింది. 'ప్రస్తుతం రాష్ట్రంలో ఇంగ్లీష్, మరాఠీ మాధ్యమ పాఠశాలల్లో గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 4 వరకు రెండు భాషల విద్యావిధానం కొనసాగుతోంది. అయితే రాష్ట్ర విద్యా విధాన 2024 రూపకల్పన ప్రకారం అన్ని పాఠశాలల్లో హిందీని తప్పనిసరి మూడో బోధన భాషగా గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 4 వరకు అమలు చేస్తున్నాం' అని ఆ ఉత్తర్వు పేర్కొంది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఇంగ్లీష్, మరాఠీ మీడియం స్టేట్ బోర్డ్ స్కూళ్లలో గ్రేడ్ 5 లోనే మూడో భాష బోధన అమలవుతోంది. ఇతర మీడియం స్కూళ్లలో ప్రాథమిక విద్యలో త్రిభాష విద్యావిధానం ఇప్పటికే అమలవుతోంది. ఈ విధమైన ప్రభుత్వ నిర్ణయంలో రెండు కారణాలపై వ్యతిరేకత భారీ స్థాయిలో చెలరేగింది. మొదటిది ప్రాథమిక పాఠశాలల్లో గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకు మూడో భాషా బోధన రుద్ద కూడదు. రెండోది హిందీని విధింప చేయడం. ప్రాంతీయ భాషా సమాజాలు, విద్యావేత్తలు, పౌరసమాజ సభ్యులు, ప్రఖ్యాత సాహితీ వేత్తలు హిందీని బలవంతంగా రుద్దడంపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ఇది మహారాష్ట్ర సంస్కృతిపై పెత్తనం చెలాయించే ప్రయత్నమే అని ధ్వజమెత్తాయి. తక్షణం దీన్ని రద్దు చేయాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వ స్వంత భాషా కమిటీ ప్రభుత్వానికి లేఖరాసింది. ప్రాథమిక పాఠశాలల్లో త్రిభాష బోధన విధానాన్ని పిల్లలపై బలవంతంగా ఎందుకు రుద్దుతున్నారని, అలాగే హిందీని ఎందుకు విధిస్తున్నారని విద్యానిపుణులు ప్రశ్నిస్తున్నారు. హిందీ, హిందూ, హిందుస్థాన్ సిద్ధాంతాన్ని బలవంతంగా అమలు చేయడానికి ఆర్ఎస్ఎస్ ప్రణాళిక అని విమర్శిస్తున్నారు. మహారాష్ట్రలోని మరాఠీలు తమ భాష, సంస్కృతి ఉనికికి ఎక్కడా ఎలాంటి నష్టం రాకూడదని గట్టిగా ఎదిరిస్తున్నారు. భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్నిర్మాణం కోసం ఉద్యమం సాగిన తరువాత ఇప్పుడు మహారాష్ట్రలో జరుగుతున్న ఉద్యమం చారిత్రాత్మకమైనదని చెప్పవచ్చు. హిందీని బలవంతంగా రుద్దడంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా యావత్ రాష్ట్రం నిలబడిందని మరాఠీ అభ్యాస్ కేంద్ర అధినేత దీపక్ పన్వార్ పేర్కొన్నారు. తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ప్రభుత్వ తీర్మానాన్ని సవరిస్తామని, హిందీ తప్పనిసరి కాదని మహారాష్ట్ర విద్యామంత్రి దాదా భూసే ప్రకటించవలసి వచ్చింది. జూన్ 17న ప్రభుత్వం తీర్మానాన్ని సవరించింది. పాఠశాలల్లో హిందీ సాధారణ భాష అని పేర్కొంది. విద్యార్థులు తమ మూడో భాషగా దేశంలోని ఏ భాషనైనా నేర్చుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే కనీసం 20 మంది విద్యార్థులైనా కలిసి డిమాండ్ చేయడం తప్పనిసరి నిబంధనగా సూచించింది. హిందీ కాకుండా దేశంలో మరే భాషనైనా నేర్చుకుంటామని కనీసం 20 మంది విద్యార్థులైనా కలిసివస్తే వారికి ఆ భాషా ఉపాధ్యాయుడ్ని ప్రభుత్వం అందుబాటులో ఉంచుతుందని లేదా ఆన్‌లైన్ ద్వారా నేర్చుకునే నిబంధన అమలు చేస్తుందని సవరించిన ప్రభుత్వ తీర్మానం పేర్కొంది. ఈ హిందీ భాషా వివాదం రాజ్ థాకరే మహారాష్ట్ర నవనిర్మాణ సేనకు రాజకీయంగా ఒక ఊపునిచ్చింది. ఇది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతపరమైన భాషా దురభిమానంగా విమర్శించింది. 'మనమంతా హిందువులం. హిందీలం కాం' అని రాజ్ థాకరే వ్యాఖ్యానించారు. అంతేకాకుండా గత ఇరవై ఏళ్లుగా ఎడమొగం పెడమొగంగా దూరంగా ఉంటున్న థాకరే సోదరులు ఏకం కావడానికి దారిచూపించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించి ఆందోళన చేపట్టడానికి సోదరులిద్దరూ చేతులు కలిపారు. ఉమ్మడిగా ర్యాలీలు నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ కూడా ప్రభుత్వ నిర్ణయానికి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో గ్రేడ్ 4 వరకు హిందీని రుద్దకూడదని స్పష్టం చేశారు. ఇది మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటున్న మహాయుతి వర్గం ఏక్‌నాథ్ షిండేను ఇరకాటంలో పడేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేయడం షిండేకు ఇష్టపడడం లేదు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్న సమయంలో ఈ భాషా వివాదం రాజకీయ పరిణామాల్లో మార్పు తీసుకురావచ్చు. అయితే మహారాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 16, జూన్ 17న జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ కమిటీ కూడా మూడో భాష ఉండకూడదని ప్రభుత్వానికి సూచించింది. మరోవైపు దీనికి తీవ్ర వ్యతిరేకత రావడంతో చివరికీ ప్రభుత్వం ఈ త్రిభాష విధానం అమలును రద్దు చేసింది.

# రచ్చగా మారుతున్న మామిడి ధర

తిరుపతి, జూలై 12,

మామిడి ధర.. ఇప్పుడు రచ్చగా మారింది. ఏపీలో రాజకీయాన్ని రంజుగా మార్చింది. మద్దతు ధర అందకపోవడంతో రోడ్డెక్కిన రైతాంగం సమస్య రాజకీయ రంగు పులుముకుంది. ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది మామిడి ధర పతనానికి అసలు కారణమేంటి. మామిడి రైతుకు ఎందుకింత కష్టం వచ్చిందన్న దానికంటే మ్యాంగో ఫైట్ చేస్తున్న పొలిటికల్ పార్టీలదే పెద్ద సమస్యగా మారింది. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు ఉన్నట్లే? చిత్తూరు జిల్లాలో మామిడి రైతాంగం కష్టాలకు బోలెడన్ని కారణాలు ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా మామిడి ధరలు పతనం కావడంతో కంటతడి పెడుతున్న రైతాంగం పండిన పంటను అమ్ముకోవడానికి నానా అగచాట్లు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణంతో పాటు ఈ ఏడాది దిగుబడి అమాంతంగా పెరగడంతో మామిడి కొనేవారు కరువయ్యారు. దీంతో మద్దతు ధర కోసం రోడ్డెక్కిన రైతాంగం సమస్య రాజకీయ అస్త్రంగా మారింది. అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోగా రైతుకు మాత్రం తీపి పంట చేదుగానే మిగిలిపోయింది. అసలు ఈ ఏడాది ఎందుకు మామిడి రైత కు ఎప్పుడూ లేనంత కష్టం వచ్చిందన్న విషయాలను ఆరా తీస్తే అనేక కారణాలు వెలుగు చూస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం, దిగుబడిపై ఉద్యానవన శాఖ ఇస్తున్న లెక్కలను పరిశీలిస్తే కారణాలు అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో 56 వేల హెక్టార్లలో మామిడి సాగు జరగా ఈ ఏడాది దిగుబడి 8.40 లక్షల టన్నుల మామిడి దిగుబడి జరిగింది. గతేడాది 56 వేల హెక్టార్ల లోనే మామిడి సాగు ఉండగా దిగుబడి మాత్రం దాదాపు 3.35 లక్షల టన్నులు దిగుబడి వచ్చింది. అంటే గతేడాది హెక్టార్‌కు 6 టన్నుల మామిడి దిగుబడి రాగా, ఈ ఏడాది హెక్టారు కు 15 టన్నుల మామిడి దిగుబడి అయింది. రైతు ఊహించనంత దిగుబడి రావడానికి వాతావరణ పరిస్థితులు కూడా ఏడాది అనుకూలించాయి. మరోవైపు ఏప్రిల్ మే వరకు వర్షాలు రావడంతో మామిడి సైజు విపరీతంగా పెరిగింది. మామూలుగా 350 నుంచి 400 గ్రాముల బరువు తో దిగుబడి వచ్చే మామిడి ఈ ఏడాది 700 నుంచి 750 గ్రాముల వరకు కాయ సైజు పెరిగింది. దీంతో హెక్టారుకు రెండింతల నుంచి మూడింతల దాకా దిగుబడి పెరిగింది. ఇక మామిడి ధర విషయంలోనూ గతేడాదికి ఏడాది ధరకు ఎంతో వ్యత్యాసం ఉంది. గతేడాది టన్ను తోతాపూరి మామిడి రకం రూ. 22 నుంచి 26 వేల దాకా రైతులకు లభించింది. అయితే ఈ ఏడాది టన్ను ధర రూ. 10 వేలు కూడా అందరి పరిస్థితి నెలకొంది. పల్ప్ పరిశ్రమలు టన్నుకు రూ. 6 వేల దాకా ఇస్తుంటే ప్రభుత్వం ప్రోత్సాహక ధరగా టన్నుకు రూ.4 వేలు చెల్లిస్తోంది. ఈ లెక్కన టన్ను తోతాపూరి మామిడి కి రూ. 10 వేలు ధర దక్కుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే చిత్తూరు జిల్లాలో మార్కెట్ యార్డ్‌ల వద్ద ర్యాంప్‌లు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు టన్ను ధర రూ.3 వేలకు మించి ఇవ్వక పోవడంతో రైతుకు గిట్టుబాటు ధర అందడం లేదు. మరోవైపు పల్ప్ యాజమాన్యాలు టన్ను మామిడికి రూ. 8 వేలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. నష్టాలను సాకుగా చూపి టన్ను కు రూ.6 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. అయితే రేటు కూడా ఇచ్చి కొనుగోలు చేయని పల్ప్ యాజమాన్యాల తీరు రైతులకు సంకటంగా మారింది. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక ధర కూడా రైతుల ఖాతాలకు చేరకపోవడంతో రైతుకు మద్దతు ధర గాలిలో దీపంగా మారింది. ఇక మరో కారణం రాష్ట్రంలో అన్నిచోట్ల ఒకేసారి మామిడి సీజన్ ప్రారంభం కావడం. గతేడాది ముందుగా కృష్ణ ఆ తరువాత ఇతర జిల్లాల నుంచి మామిడి దిగుబడి రాగా ఈ ఏడాది అంతటా ఒకేసారి మామిడి రైతు చేతికి అందింది. ఇక ఈ ఏడాది మామిడి గుజ్జు తయారీ పరిశ్రమలపైనా అనేక విమర్శలు రాగా మామిడి రైతుకు సరైన ధర లభించక పోవడానికి పల్ప్ యూనిట్ యాజమాన్యాలు కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 44 పల్ప్ ప్రాసెస్ యూనిట్లు ఉండగా ఈ ఏడాది 39 యూనిట్లు మాత్రమే మామిడి గుజ్జు తయారీ చేశాయి. గతేడాది పల్ప్ పరిశ్రమల్లో తయారైన మామిడి గుజ్జు ఎక్స్పోర్ట్ కాకపోవడంతో పెద్ద ఎత్తున నిల్వలు ఉండడం కూడా ఒక కారణం అయ్యింది. రూ. కోట్ల విలువచేసే పల్ప్ పరిశ్రమంలోనే ఉండిపోవడంతో ఈ ఏడాది ప్రాసెస్ చేయడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతి ఏటా మే 20 తరువాత పల్ప్ యూనిట్లు ప్రాసెసింగ్ ప్రారంభిస్తుండగా ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా జూన్ 7 న గుజ్జు పరిశ్రమలు తెరుచుకున్నాయి. దీంతో ఒకేసారి మామిడి దిగుబడి రావడం, రైతులు పల్ప్ ఇండస్ట్రీస్ కు మామిడిని విక్రయించేందుకు ప్రయత్నం చేయడంతో గందరగోళం నెలకొంది. దిగుబడికి తగ్గట్టుగా డిమాండ్ లేకపోవడం కూడా సమస్యగా మారిపోయింది. చిత్తూరు జిల్లాలో ఇప్పటిదాకా 2.42 లక్షల టన్నుల మామిడి పల్ప్ యూనిట్లు కొనుగోలు చేయగా ఇంకా పొలాల్లోనే 1.48 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉండిపోయింది. జిల్లాలో ఈ ఏడాది 5 లక్షల టన్నుల తోతాపురి మామిడి దిగుబడి వచ్చినట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. మరో రెండు వారాల్లో మామిడి సీజన్ ముగుస్తుండగా.. ఇప్పటికీ పల్ప్ పరిశ్రమల వద్ద అమ్మకానికి మామిడి ట్రాక్టర్లు బారులు తీరిన పరిస్థితి నెలకొంది. మద్దతు ధర ఎందుకు ఇవ్వలేదు, మామిడి కొనుగోలులో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రతిపక్షం ప్రశ్నిస్తుంటే గతంలో ఎప్పుడూ లేనట్లు మామిడి రైతుకు ప్రోత్సాహక ధర కల్పించిన ప్రభుత్వం తమదని టిడిపి చెబుతోంది. అధికార విపక్షాల మధ్య మ్యాంగో వార్ పీక్స్ కు చేరుకుంటుండగా మద్దతు ధర విషయంలో మాత్రం మామిడి రైతులకు సమస్య గానే మిగిలింది.

## జరా భద్రం...నకిలీ విజిలెన్స్ ఆఫీసర్స్...

తిరుపతి, జూలై 12,

తిరుపతి జిల్లాలో నకిలీ ఆఫీసర్స్ ముఠా గుట్టు రట్టయింది. విజిలెన్స్ అధికారులమంటూ రంగంలోకి దిగిన ఫేక్ ఆఫీసర్స్.. కరప్షన్ ఆఫీసర్ టార్గెట్‌గా వ్యూహం పన్నారు. నలుగురు ముఠాగా ఏర్పడి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులను టార్గెట్ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఎంచుకొని కథ నడిపించే ప్రయత్నం చేశారు. ఏలూరుకు చెందిన కాశి విశ్వేశ్వరయ్య, తిరుపతికి చెందిన నరేంద్ర తోపాటు తెలంగాణకు చెందిన సంతోష్, సంశుద్దీన్‌లు ఫేక్ విజిలెన్స్ అధికారులమంటూ ముఠాగా ఏర్పడి దందా కొనసాగించారు. ఇందులో భాగంగానే గాజుల మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే భూపతి అనే వీఆర్‌ఓను టార్గెట్ చేశారు. వడమాలపేట మండలం ఎస్వీపురం వీఆర్వోగా పనిచేస్తున్న భూపతిని బ్లాక్ మెయిల్ చేశారు. గాజుల మండలంలోని బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్న భూపతి ఇంటికి వచ్చి హడావుడి చేసిన ముఠా రూ.5 లక్షలు డిమాండ్ చేసింది. అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఏసీబీకి రిపోర్టు పంపబోతున్నామని బెదిరించింది. ఆరెస్ట్ చేస్తున్నామంటూ తుపాకీతో బెదిరించారు. గత నెల 28న ఉదయం 6గంటలకే భూపతి ఇంటికి చేరుకున్న ముఠా.. అతడిపై బెదరింపులకు పాల్పడింది. వచ్చింది అధికారులని నమ్మిన వీఆర్వో భూపతి ఆరెస్ట్ చేస్తారని భయపడి అడిగినంత డబ్బు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఇందులో భాగంగానే రూ .5 లక్షలు డిమాండ్ చేసిన గ్యాంగ్‌కు రూ.1.50 లక్షల నగదు ఇచ్చి పంపించాడు. మిగిలిన డబ్బు ఇచ్చేందుకు కొంత సమయం కావాలని కోరాడు. ఆ తర్వాత డబ్బు కోసం ముఠా సభ్యులు పదేపదే ఫోన్లు చేయడంతో భూపతికి అనుమానం వచ్చింది. ఈ మేరకు ఈ నెల 5న గాజులమండ్యం పోలీసులను ఆశ్రయించాడు. భూపతి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ముఠాపై కన్నేశారు. కదలికలను కనిపెట్టారు. అసలు అధికారులు కాదని ఫేక్ టీంగా గుర్తించి.. తూకివాకం వద్ద నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ 1.26 లక్షల నగదు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## లారీని ఢీకొన్న బస్సు ముగ్గురికి గాయాలు

భీమడోలు ముందుగా వెళుతున్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుండి ఢీకొనడంతో బస్సు ముందు భాగం పూర్తిగా నృజ్జయింది. ఈ ఘటన భీమడోలు జాతీయ రహదారిలో గుండుగొలను తిరుమల డైరీ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంటకు చోటుచేసుకుంది. బస్సులో 57 మంది ప్రయాణికులు ఉండగా వారిలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీస్ హైవే సేఫ్టీ సిబ్బంది క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వాటర్ బాంబు..

ఇటానగర్, జూలై 12,

చైనా టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై భారీ జలవిద్యుత్ ఆనకట్టను నిర్మిస్తుండటం భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఈ ప్రాజెక్టును 'వాటర్ బాంబ్'గా అభివర్ణించారు. చైనా సైనిక ముప్పు కంటే ఈ ఆనకట్టే ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు భారత్–చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉందిటిబెట్‌లో యార్లంగ్ త్సాంగ్పోగా పిలువబడే బ్రహ్మపుత్ర నది, అరుణాచల్ ప్రదేశ్, అస్సాంల గుండా ప్రవహించి బంగ్లాదేశ్‌లోకి వెళుతుంది. చైనా ఈ ఆనకట్టతో నదీ ప్రవాహాన్ని నియంత్రించగలదు. వర్షాకాలంలో నదికి భారీ వరదలు వచ్చినప్పుడు, చైనా ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే దిగువన ఉన్న భారత ప్రాంతాలు, ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని సియాంగ్ బెల్ట్, అస్సాం తీవ్రంగా ముంపునకు గురవుతాయి. దీనివల్ల లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ఈ ఆనకట్ట వల్ల సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు ఎండిపోయే ప్రమాదం కూడా ఉందని ఖండూ ఆందోళన వ్యక్తం చేశారు. చైనా అంతర్జాతీయ జల ఒప్పందాలపై సంతకం చేయకపోవడం, ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పంచుకోకపోవడం భారత్ ఆందోళనకు ప్రధాన కారణం. భూకంపాలు సంభవించే అవకాశం ఉన్న భౌగోళికంగా సున్నితమైన ప్రాంతంలో ఈ డ్యామ్ నిర్మాణం మరింత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఈ ఆనకట్ట కూలిపోతే, దిగువనున్న ప్రాంతాలకు ఊహించని నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో, భారత్ కూడా తన నీటి అవసరాలు, వరద నియంత్రణ కోసం అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక ప్రాజెక్టును నిర్మించే ఆలోచనలో ఉంది. ఇండియా బార్డర్‌కు కేవలం 50 కి.మీ దూరంలో ఉన్న యార్లుంగ్ త్సాంగ్పోపై చైనా నిర్మించనున్న రహస్య మెగా ఆనకట్టను అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు "టిక్కింగ్ టైమ్ బాంబ్" అని అభివర్ణించారు. భారీ రిజర్వాయర్ సామర్థ్యం మరియు డేటాపై సున్నా పారదర్శకతతో, నిపుణులు దిగువన పర్యావరణ, వ్యూహాత్మక మరియు మానవతా ప్రమాదాల గురించి హెచ్చరిస్తున్నారు.

## మంగినపూడి ఫైరింగ్ రేంజ్ ప్రాక్టీసులో పాల్గొన్న జిల్లా ఎస్పీ శ్రీ ఆర్. గంగాధరరావు

## ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదించేలా తర్ఫీదు పొందాలి



మచిలీపట్నం

శనివారం మంగినపూడి లోని జిల్లా పోలీస్ ఫైరింగ్ రేంజ్ లో పోలీస్ అధికారులకు నిర్వహించిన ఫైరింగ్ సాధన ప్రక్రియలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, పాల్గొని ఫైరింగ్ ప్రక్రియ గూర్చి అధికారులకు పలు సూచనలు చేసారు.

ఫైరింగ్ సాధన ప్రక్రియలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని ఫైరింగ్ ప్రాక్టీస్ చేసే అధికారులలో ఉత్సాహాన్ని, మనోధైర్యాన్ని నింపారు. ఈ ఫైరింగ్ లో ప్రతి అధికారి పాల్గొని మంచి మెళకువలు నేర్చుకొని, ఫైరింగ్ నందు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫైరింగ్ రేంజ్ లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యం వహిస్తుంది. ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు ఫైరింగ్ జాగ్రత్తగా, ఏకాగ్రతతో చెయ్యాలి. ప్రతి ఒక్క బుల్లెట్ టార్గెట్ బుల్స్ ఐ పడే విధంగా తర్ఫీదు పొందాలన్నారు. కొత్తగా వచ్చిన ఆయుధాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని అత్యవసర సమయాలలో ప్రజల, ప్రభుత్వ, ధన,ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమని, అదేవిధంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జిల్లా పోలీసు శాఖ యొక్క ఉన్నతి కోసం ముందడుగు వేయాలని సూచించారు.

## 15న ఇండియాకు టెస్లా....

ముంబై, జూలై 12, (న్యూస్ పల్స్)

మొత్తానికి భారత్ లో ఎలాన్ మస్క్...అతని టెస్లా కంపెనీ అడుగుపెడుతోంది దీనికి సంబంధించి మొత్తం రంగం సిద్ధమైంది. ఈ జులై 15న భారత్‌లో ఫస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ లాంచ్ చేయబోతున్నట్లుగా టెస్లా ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ కొత్త పోస్టర్ ను కూడా లాంఛ్ చేసింది. ముంబై బీకేసీలో తన మొదటి షోరూమ్ ప్రారంభిస్తున్నట్లు ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ, ముంబాయ్ లలో తమ సంస్థలలో పనిచేసేందుకు లింక్&ఢ ఇన్ వేదికగా టెస్లా నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో తొలి షోరూమ్ ను ఈ నెల ముంబైలో ప్రారంభించబోతుంది. టెస్లా ఎంట్రీతో భారతీయ ఈవీ రంగం మరింత వేగవంతమవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ముంబైలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కోసం టెస్లా 4,000 చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని లీజుకు తీసుకుంది. ముంబైలోని కుర్లా వెస్ట్ లో ఇది ఉంది. దీనిని కార్ల సర్వీస్ సెంటర్ కింద ఉపయోగించనున్నారు. పుణెలో ఇంజనీరింగ్ హబ్, బెంగళూరులో రిజిస్టర్డ్ కార్యాలయం, బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) సమీపంలో తాత్కాలిక కార్యాలయంతో సహా ప్రస్తుతం భారతదేశంలో నాలుగు టెస్లా ఆఫీసులున్నాయి. షోరూం ప్రారంభానికి ముందు కంపెనీ దాదాపు 1 మిలియన్ డాలర్ల (రూ.8.58 కోట్లు) ఎలక్ట్రిక్ వాహనాలు, సంబంధిత వస్తువులను దిగుమతి చేసుకుంది. ఇందులో ప్రధానంగా చైనా, అమెరికాల నుండి దిగుమతి చేసుకున్న ఆరు కార్లలో మోడల్ వై కార్లు ఉన్నాయి. విదేశీ ఎలక్ట్రిక్ వాహనాలపై భారత్ సుమారు 70% దిగుమతి సుంకం విధిస్తున్నప్పటికీ టెస్లా ఈ వాహనాలను తీసుకువస్తోంది. వీటితో పాటూ త్వరలోనే టెస్లా ప్లాంట్ ఇండియా ఏర్పాటు చేసే దిశగా కంపెనీ యోచిస్తోంది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయం సమర్థిస్తూ 30 బిసి సంఘాలు ముఖ్యమంత్రిని అభినందించారు. ముఖ్యమంత్రితో బీసీ సంఘాలు దాదాపు గంటన్నర సేపు చర్చలు జరిపారు భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చలు విస్తృతంగా జరిపారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ. ఎవరైనా కేసులు వెయ్యకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా హైకోర్టులో సుప్రీంకోర్టులో కెవిఎట్, వేయాలని కోరారు అలాగే బీసీ సంఘాలు కూడా జాగ్రత్తలు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ. బీసీల రిజర్వేషన్ కేసు గెలవడానికి బలమైన అవకాశాలు ఉన్నాయ. చట్టపరమైన న్యాయపరమైన రాజ్యాంగపరంగా బలమైన ఆధారాలు ఉన్నాయని అన్నారు. అసెంబ్లీలో బీసీలు బిల్లు పాస్ అయింది జనాభా లెక్కలు ఉన్నాయి రాజ్యాంగంలోని 263 డి6 ప్రకారం రాజ్యాంగం రాష్ట్రాలకు బీసీ రిజర్వేషన్ పెంచే అధికారం ఇచ్చింది అలాగే సుప్రీంకోర్టులు అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టిన సందర్భంగా 50% సీలింగ్ లు తొలగించింది ఈ ఆధారాలతో కేసు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, నీలం వెంకటేష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు, జి అంజి, అనంతయ్య, రాజేందర్, యాస్. రవికుమార్ యాదవ్, ప్రభువు గౌడ్, లింగయ్య యాదవ్, భాస్కర్, ప్రజాపతి,అశోక్ ఆశీస్సుగౌడ్, స్వామి గౌడ్, శివకుమార్ అర్జున్ సింగ్, రాములు భాస్కర్, నిఖిల్ పటేల్, కౌశిక్ శివ, బలరాం,తదితరులు పాల్గొన్నారు.

# వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న సినీ హీరో సంపూర్ణేష్ బాబు.

బ్రహ్మంగారిమఠం

భూత భవిష్యత్తు వర్ధమాన కాలజ్ఞానం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని సినిమా హీరో సంపూర్ణేష్ బాబు శనివారం దర్శించుకున్నారు. బ్రహ్మంగారిమఠం వచ్చిన ఆయన స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి రాగా దేవాలయ పిట్ పర్సన్ శంకర్ బాలాజీ ,మేనేజర్ ఈశ్వరయ్య చారి లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం చేపించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు బ్రహ్మంగారి పుస్తకాలతో పాటు బ్రహ్మంగారి శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం దివంగత పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వాముల వారి ప్రథమ పుత్రుడు వెంకటాద్రి స్వామిని మఠాధిపతి నివాసంలో కలిశారు . ఈ సందర్భంగా సినిమా హీరో సంపూర్ణేష్ బాబుకు బ్రహ్మంగారి చరిత్ర గూర్చి ఆయన వివరించారు. ఆ తర్వాత దృశ్యాలతో సన్మానించి స్వామి వారి పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బందితోపాటు సినిమా హీరోతోపాటు వచ్చిన సినీ నటులు తదితరులు పాల్గొన్నారు. సంపూర్ణేష్ బాబును చూడటానికి స్థానికంగా ఉన్న ప్రజలు భక్తులు ఎగ బడ్డారు

# నా స్వంత ఇంటి కన్నా ఎక్కువ శ్రద్ధ చూపి పేదింటి కల నెరవేర్చిన మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట

దేశం లోనే ఆదర్శం సిద్దిపేట కెసిఆర్ నగర్ప్రతి ఇంటి ముందు పరిశుభ్రత పచ్చధనంగా ఉంచుకోవాలి. బంగారు మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు మన అందరి పై ఉండాలి. సిద్దిపేట కెసిఆర్ నగర్ రెండు పడకల గదుల వద్ద బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. బంగారు మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు మన అందరి పై ఉండాలని, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట కెసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూం ఇల్ల వద్ద బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సిద్దిపేట డబుల్ బెడ్ రూం ఇళ్లు దేశానికే ఆదర్శమని, నా స్వంత ఇల్లు కట్టుకుంటే ఎంత శ్రద్ధ తో కట్టిస్తానొ అలానే కెసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూం ఇల్ల నిర్మాణం కు అంతే శ్రద్ధ తో ఉన్నానని, దాదాపు 100కు పైగా ఇక్కడి వచ్చి ప్రతి ఇఌ ్ల ఎలా ఉండాలో చెప్పి పేదింటి కల నెరవేర్చన్నారు. సకల హంగులతో నిర్మాణం చేపట్టపని చెప్పారు ప్రతి ఇంటికి పండ్ల మొక్కలు ఇచ్చామని. ప్రతి ఇంటి ముందు చెత్త ఉండొద్దని, ప్లాస్టిక్ వాడొద్దని సూచించారు.. బంగారు మైసమ్మ బోనాల ఘనంగా అద్భుతం గా నిర్వహించారని నిర్వహకులను అభినందించారు.

# ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్డ్ సర్వేయర్ల నియమకం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఈ నెల 27న శిక్షణ పొందిన లైసెన్స్డ్ సర్వేయర్లకు తుది పరీక్ష నిర్వహిస్తామని.. ఆ తర్వాత 28, 29 తేదీల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 12న ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. సీఎం రేవంత్రెడ్డి సూచనల మేరకు సర్వేయర్లతోపాటు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవోను నియమించనున్నట్లు తెలిపారు. నక్షా లేని 413 గ్రామాలు రాష్ట్రంలోఉన్నాయన్నారు. నక్షా కోసం 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీసర్వే చేశామని, వీటి ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

# రైళ్లు రాకుండా అడ్డుపడుతున్న ట్రావెల్స్... వృధాగా మారిన కోచింగ్ డిపో...

విజయవాడ, జూలై 12,

స్వప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాలను ఫణంగా పెట్టడం విజయవాడ రాజకీయానికే చెల్లుతుంది. అన్నీ సిద్ధంగా ఉన్నా వందే భారత్ రైలును మంజూరు చేయకుండా స్థానిక రాజకీయం అడ్డు పడుతోంది. ఏడాదిన్నర క్రితమే వందే భారత్ ర్యాక్ మెయింటెయినెన్స్ డిపో సిద్ధమైనా, సాంకేతిక సమస్యలు, రైళ్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. స్వప్రయోజనాల ముందు ప్రజల సమస్యలు, అవసరాలు పట్టవని విజయవాడ రాజకీయం రుజువు చేసింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాలు తమకు వందే భారత్ రైళ్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తుంటే విజయవాడ కేంద్రంగా నడిచే రాజకీయం మాత్రం రైళ్లు రాకుండా అడ్డు పడుతున్నాయి. ఎప్పుడో రావాల్సిన వందే భారత్‌కు ఆటంకాలు సృష్టిస్తున్నాయి. విజయవాడ నుంచి బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్స్ లేవు. పైనుంచి వచ్చే రైళ్లలో విజయవాడ కోటా పెద్దగా ఉండదు. దీంతో టిక్కెట్లు దక్కడం దాదాపు అసాధ్యం. దీంతో విజయవాడ బెంగుళూరు మధ్య ట్రావెల్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. నిత్యం పెద్ద సంఖ్యలో ట్రావెల్స్ బస్సులు బెంగుళూరుకు నడుస్తుంటాయి. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 9 గంటల మధ్యలో విజయవాడ వారధి నుంచి పెద్ద సంఖ్యలో బెంగుళూరుకు ట్రావెల్స్ బస్సులు నడుస్తుంటాయి. 12 -13 గంటల ప్రయాణ సమయమైనా ఈ బస్సుల్లో టిక్కెట్లకు ఎప్పుడు డిమాండ్ ఉంటుంది. విజయవాడ నుంచి బెంగుళూరుకు వందే భారత్ రైలు వస్తే ట్రావెల్స్ వ్యాపారానికి గండి పడుతుంది. ప్రస్తుతం ఉన్న 13-14 గంటల ప్రయాణం 9 గంటలకు తగ్గిపోతుంది. ఇప్పటికే రైళ్ల రాకపోకల షెడ్యూల్‌ను కూడా ఖరారు చేశారు. గత మేలోనే వందే భారత్‌కు పాలనాపరమైన అనుమతులు లభించగా, ట్రైన్ సర్వీస్ జూన్‌లో మొదలు కావాల్సిఉంది. విజయవాడ నుంచి తిరుపతి మీదుగా 9గంటల్లోనే బెంగుళూరు చేరుకునేలా ప్రయాణ సమయాన్ని ఖరారు చేశారు. వందే భారత్‌కు రైల్వే బోర్డు అనుమతించగానే ట్రావెల్స్ వ్యాపారులు రాజకీయ నేతల్ని ఆశ్రయించారు. తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఒత్తిడి చేయడంతో వందే భారత్‌కు అనుమతి రాలేదు. ప్రస్తుతం హైదరాబాద్-విశాఖపట్నం మధ్య విజయవాడ మీదుగా రెండు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. త్వరలోనే విజయవాడ నుంచి బెంగుళూరుకు మరో సర్వీసును ప్రారంభించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను విజయవాడలో చేశారు. విజయవాడ నుంచి బెంగుళూరు వందే భారత్ జాప్యం కావడంపై రైల్వే వర్గాల నుంచి విశ్వసనీయ సమాచారం ప్రకారం స్థానిక రాజకీయాలే కారణంగా తెలుస్తోంది. ఈ ఏడాది రైల్వే బడ్జెట్ రూపకల్పన సమయంలో జీఎంతో ఏపీకి చెందిన ఎంపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ల వారీగా అందరి నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. ఈ క్రమంలో బెంగుళూరుకు డైరెక్ట్ రైళ్ల ఏర్పాటు అంశం కూడా ప్రస్తావనకు రావడంతో దానిని పక్కన పెట్టాల్సిందిగా ప్రజా ప్రతినిధులు సూచించడంతో రైల్వే అధికారులు విస్తుబోయారు. విజయవాడ నుంచి బెంగుళూరు వైపు పరిమిత సంఖ్యలో రైళ్లు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ నుంచి ప్రస్తుతం యశ్వంతపూర్ రైలు మాత్రమే బెంగుళూరుకు ఉంది. విజయవాడ మీదుగా ప్రయాణించే ఇతర జోన్ల రైళ్లలో డివిజన్ కోటా సీట్లు ఉండవు. దీంతో విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్లాలనుకునే సగటు ప్రయాణికులకు సీట్లు దక్కే పరిస్థితి లేదు. దశాబ్దాలుగా విజయవాడ నుంచి బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్ వేయకపోవడానికి ట్రావెల్స్ రాజకీయమే కారణమని రైల్వే వర్గాలు స్పష్టం చేశారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సుల వ్యాపారాన్ని కాపాడేందుకే ప్రజా ప్రతినిధులు కొత్త రైళ్లను రాకుండా అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. సుదీర్ఘ ప్రయత్నాలు, రైల్వే అధికారుల చొరవతో కొత్త రైలును తిరుపతి మీదగా బెంగుళూరుకు నడిపేందుకు రైల్వే శాఖ అనుమతించినా మళ్లీ రాజకీయం అడ్డుపడింది.

వందేభారత్ సిరీస్ రైళ్లు మొదలైన తర్వాత విజయవాడ-బెంగుళూరు మధ్య కొత్త రైలును ప్రారంభించాలని స్థానిక ప్రజల నుంచి డిమాండ్ వచ్చింది. తొలి దశలో సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య మొదటి రైలు ప్రారంభమైంది. ఆ తర్వాత విశాఖ నుంచి హైదరాబాద్‌కు మరో వందే భారత్ ప్రారంభించారు. రెండు రైళ్లు ఏకకాలంలో విశాఖపట్నం, సికింద్రాబాద్ నుంచి గమ్య స్థానాలకు బయల్దేరుతున్నాయి. బెంగుళూరుకు వందే భారత్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులు కొద్దినెలల క్రితమే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజయవాడ నుంచి బెంగుళూరుకు ప్రస్తుతం ప్రయాణ సమయం 12-14 గంటలకు పైగా పడుతోంది. వందే భారత్ రైలు అందుబాటులోకి వస్తే తొమ్మిది గంటల్లోనే గమ్య స్థానాన్ని చేరుకోవచ్చు. దాదాపు మూడు నుంచి ఐదు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది.

వందే భారత్ రైలుతో బెంగళూరు వెళ్లే వారితో పాటు తిరుపతి వెళ్లే భక్తులకు కూడా అనువుగా ఉంటుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ చైర్ కార్ బోగీలు, ఒక ఎగ్జిక్యూటివ్ చైర్ కార్‌తో ఈ సర్వీస్ నడుపుతారు. వారంలో మంగ ళవారం మినహా ఆరు రోజులు నడిచేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ట్రైన్ నంబర్ 20711 విజయవాడ- బెంగుళూరు వందే భారత్ విజయవాడలో ఉదయం 5.15 బయలుదేరి తెనాలి 5.39కు చేరుతుంది. ఒంగోలు 6.28, నెల్లూరు 7.43, తిరుపతి, 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరు మధ్యాహ్నం 14.15 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజు ట్రైన్ నంబర్ 20712 బెంగ ళూరులో మధ్యాహ్నం 14.45 గంటలకు ప్రారంభం అవుతుంది. కృష్ణరాజపురం మధ్యాహ్నం 2.58,కాట్పాడి 5.23, చిత్తూరు సాయంత్రం 5.49, తిరుపతి 6.55, నెల్లూరుకు రాత్రి 8.18, ఒంగోలుకు రాత్రి 9.29, తెనాలి రాత్రి 10.42, విజయవాడ 11.45కు చేరుతుంది. ఇప్పటికే వందే భారత్ రైలు రాకపోకలు మొదలు పెట్టాల్సి ఉన్నా స్థానిక నాయకుల ఒత్తిళ్లతో ర్యాక్స్ విజయవాడ చేరుకోలేదని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. విజయవాడ నుంచి ప్రధాన నగరాలకు నేరుగా వందే భారత్ రైళ్లను నడపాలనే ఉద్దేశంతో మూడేళ్ల క్రితమే రైల్వే శాఖ ఏర్పాట్లు ప్రారంభించింది. ఇందులో భాగంగా అప్‌యార్డ్ కాలనీ సమీపంలో పాలఫ్యాక్టరీ వెనుక భాగంలో రూ. 140కోట్ల రుపాయల వ్యయంతో వందే భారత్ కోచింగ్ డిపో, ర్యాక్ మెయింటెయినెన్స్ సెంటర్ నిర్మించారు. ఇందులో ఏకకాలంలో మూడు ర్యాక్స్ ( మూడు పూర్తి స్థాయి రైళ్లు) మెయింటెయిన్ చేసేలా డిపోను నిర్మించారు. ఈ డిపో నిర్మాణ సమయంలో సాంకేతిక అంశాలను విజయవాడ డివిజన్ రైల్వే ఉన్నతాధికారులు విస్మరించినట్టు తెలుస్తోంది. మరోవైపు బెంగుళూరుకు రైళ్లను నడపడంలో జాప్యానికి గుంతకల్లు-ధర్మవరం-బెంగుళూరు మార్గంలో రైల్వే విద్యుదీకరణ పనుల్లో జాప్యం జరగడం కారణమని అధికారులు చెబుతున్నారు. గుంతకల్లు, ధర్మవరం సెక్షన్ పనులు ఇప్పటికే పూర్తైనా, ధర్మవరం-బెంగుళూరు సెక్షన్ పనులు పూర్తి కాలేదు. ధర్మవరం-పెనుకొండ మధ్య పనులు సాగుతున్నాయి. 43 కిలోమీటర్ల మార్గాన్ని విద్యుదీకరించడానికి టెండర్లు పూర్తైనా పనులు పూర్తికాలేదు. ఏపీ - కర్ణాటక మధ్య రాకపోకలు వేగంగా జరగడంతో పాటు రాయలసీమ ప్రాంతాలకు ఏపీ రాజధానితో అనుసంధానించవచ్చని చెబుతున్నారు,. విజయవాడ రైల్వే స్టేషన్ పది ప్లాట్‌ఫామ్‌ల నుంచి అప్‌యార్డ్‌లో నిర్మించిన కొత్త కోచింగ్ డిపోకు రైళ్లు చేరుకునేలా కనెక్టివిటీ ఇవ్వడం అధికారులు మరిచారు. ప్రస్తుతం పదో నంబర ప్లాట్‌ఫాంకు వచ్చిన రైళ్లు మాత్రమే కొత్త కోచింగ్ డిపోకు వెళ్లే అవకాశం ఉంది. మిగిలిన తొమ్మిది ప్లాట్‌ఫామ్‌లతో ఈ డిపోకు కనెక్టివిటీ లేనట్టు చెబుతున్నారు. ఇటీవల రైల్వే బోర్డు అధికారుల తనిఖీల్లో ఈ అంశం వెలుగు చూసింది. రూ. 140 కోట్లు ఖర్చుతో నిర్మించిన డిపోకు ఇంటర్ లాకింగ్ కనెక్టివిటీ లేకపోవడంపై బాధ్యులైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మరోవైపు విజయవాడ నుంచి బెంగుళూరుకు డైలీ సర్వీస్ నడపడానికి రెండు వైపులా ప్రయాణించే రెండు ర్యాక్స్ మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

# తాడిపత్రిలో అరటి టిష్యూ కల్చర్ రిసెర్చ్ సెంటర్

అనంతపురం, జూలై 12

అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం తలారి చెరువు సమీపంలో అరటి టిష్యూ కల్చర్ రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఇందుకోసం అధికారులు భూములను పరిశీలిస్తున్నారు. అనంతపురం జిల్లాలో అరటి ఉత్పత్తి నాణ్యతను పెంచడానికి, తాడిపత్రి ప్రాంతంలో అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, సారవంతమైన నేల, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుని అరటి టిష్యూ కల్చర్ రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అరటి పరిశోధన కేంద్రాన్ని స్థాపించడానికి అనువైన భూమిని గుర్తించడానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి తాడిపత్రి మండలం తలారి చెరువు గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆయనతో పాటు ఃబీూఒ (భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్)ప్రతినిధి పరేష్ దేశాయ్, ఆర్అండ్‌డీ ప్రతినిధి జయప్రకాష్‌తోపాటుగా పలువురు అధికారులు ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ ప్రాంతంలో పంట ఉత్పత్తికి అవసరమైన సారవంతమైన నేల, నీటి వనరులు, రవాణా సౌకర్యాల గురించి కలెక్టర్ వినోద్ కుమార్ చెప్పారు. భారతదేశం అంతటా పంట విత్తనాల అభివృద్ధికి తోడ్పడటానికి, అరటి టిష్యూ కల్చర్ పరిశోధనపై ప్రత్యేక దృష్టి సారించడానికి, కేంద్ర ప్రభుత్వం కింద పనిచేసే ఃబీూఒ ఆధ్వర్యంలో అరటి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. అనంతపురం జిల్లాలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఫార్సు చేస్తూ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు దీని కోసం ప్రతిపాదన పంపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి, కేంద్ర సంస్థ అవసరాలకు అనుగుణంగా అత్యంత అనుకూలమైన ప్రదేశాన్ని గుర్తించడానికి అనంతపురం జిల్లా కలెక్టర్ అనేక ప్రదేశాలను సందర్శించారు. 50 ఎకరాలు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నట్టుగా కలెక్టర్చెప్పారు. భూమిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కొన్ని ప్రదేశాల్లో నీరు, విద్యుత్, రోడ్డు అనుసంధానం, నేల, వాతావరణ అనుకూలత వంటి పరిస్థితులను బృందం అంచనా వేసింది. ఈ ప్రాంతంలో అరటిపరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల రైతులకు అధిక నాణ్యత గల, పరిశోధన ఆధారిత మొక్కల రకాలను ఉత్పత్తి చేయె?చ్చని అధికారులు అన్నారు.

# కరెంటు ట్రాన్స్ఫార్మర్ లలోని కాపర్ వైర్ దొంగలించిన అంతర్ రాష్ట్ర నేరస్తులు అరెస్టు

గజ్వేల్

కరెంటు ట్రాన్స్ఫార్మర్ లలోని కాపర్ వైర్ దొంగలించిన అంతర్ రాష్ట్ర నేరస్తులని పోలీసులు అరెస్టు చేసారు.

సిద్దిపేట జిల్లా పోలీసు కమిషనర్ డా అనురాధ మాట్లాడుతూ గత మే నెలో కొండపాక మండల కేంద్రంలో ఉన్న కరెంటు ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్ దొంగలించి రైతులను బాగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఈ దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించామని అన్నారు.

సిద్దిపేట జిల్లాలో మరికొన్ని గ్రామాలలో కూడా కరెంటు ట్రాన్స్ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైర్ దొంగలించిన నేరస్తులను పట్టుకోవాలని ఉద్దేశంతో గజ్వేల్ ఎసిపి నరసింహులు ఆధ్వర్యంలో తొగుట సిఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, బేగంపేట ఎస్ఐ మైపాల్ రెడ్డి, సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, రమణ, కానిస్టేబుళ్లు రమేష్, శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి, నరేష్, తిరుపతి, సతీష్, మజీద్, రత్నాకర్, చంద్రం, స్వప్న, వనిత, ఐటీ కోర్ సిబ్బంది శ్రీకాంత్, రమేష్ సిబ్బందితో కలిసి స్పెషల్ టీమ్స్ ను ఏర్పాటు చేశామన్నారు. నిందితులు మహమ్మద్ అజారుద్దీన్ రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవాడు. నాలుగు సంవత్సరాల క్రితం ట్రాన్స్ఫారం కరెంటు ట్రాన్స్ఫారం పగలగొట్టి కాపర్ వైర్ దొంగదించిన కేసులో శామీర్ పేట పోలీసులు అరెస్టు చేసారు.

మహమ్మద్ షాకీర్ లను అరెస్టు చేసి జ్యుడిషియల్ డిమాండ్ కు పంపించడం జరిగింది. తెలీమ్ ఖాన్, సలీమ్ అలియాస్ సోహెల్, అక్రమ్ అను పరారీలో వున్నారని ఆమె వెల్లడించారు.

# ఓర్వకల్లు కారిడార్ కు గ్రీన్ సిగ్నల్

కర్నూలు, జూలై 12

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని ఓర్వకల్ నోడ్ కోసం తుది మాస్టర్ ప్లాన్‌ను ప్రకటించింది. ఈ మాస్టర్ ప్లాన్ 9,719 ఎకరాల భూమిని కవర్ చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని ఓర్వకల్ నోడ్ కోసం తుది మాస్టర్ ప్లాన్‌ను సోమవారం ప్రకటించింది. ఈ మాస్టర్ ప్లాన్ 9,719 ఎకరాల భూమిని కవర్ చేస్తుంది. ప్రభుత్వ కార్యదర్శి ఎన్. యువరాజ్ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం, మొత్తం భూమిలో 52 శాతం పారిశ్రామిక అవసరాలకు కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక కారిడార్ అథారిటీ ఈ తుది మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం తెలిపింది."ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక కారిడార్ అథారిటీ ఆమోదించిన విధంగా, లోని ఓర్వకల్ నోడ్‌కు సంబంధించిన 9,718.84 ఎకరాలతుది మాస్టర్ ప్లాన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఉత్తర్వు ద్వారా ప్రచురిస్తోంది" అని యువరాజ్ జీవోలో పేర్కొన్నారు. ఓర్వకల్ నోడ్‌లో పారిశ్రామిక అవసరాల కోసం మొదటి దశలో 1,424 ఎకరాలు, రెండో దశలో 3,594 ఎకరాలు, మూడో దశలో 5,017 ఎకరాలను వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన భూమిని రవాణా, నివాస, వాణిజ్య, ప్రభుత్వ, సెమీ-పబ్లిక్ ప్రాంతాలు, పబ్లిక్ యుటిలిటీలు, రోడ్లు, గ్రీన్ ఏరియాలు, వాటర్‌బాడీలు వంటి మౌలిక సదుపాయాల కోసం దాదాపు సమాన దశల్లో ఉపయోగించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మూడు రాష్ట్రాలలో విస్తరించి ఉంటుంది. ఇది దేశంలోని మధ్య ప్రాంతాలను దక్షిణ ప్రాంతాలతో కలుపుతుంది.

# నేడు ఎర్రగుడి గ్రామానికి ఎమ్మెల్యే శ్యాంబాబు రాక

.తుగ్గలి: తుగ్గలి మండల పరిధిలోని గల ఎర్రగుడి గ్రామానికి ఆదివారం రోజు సాయంత్రం నాలుగు గంటలకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి పత్తికొండ శాసనసభ్యులు కేఈ శాంబాబు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు వెంకట రాముడు చౌదరిలు తెలియజేశారు. శనివారం రోజున విలేకరుల సమావేశంలో వారుమాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని,ఏడాది పాలనలలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించడం ద్వారా మండల వ్యాప్తంగా గ్రామాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు విశేష స్పందన వస్తుందని వారు తెలియజేశారు. రాంపల్లి గ్రామం నందు ఆదివారం రోజు జరగవలసిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఈనెల 20వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని, ఆదివారం రోజున గుత్తి ఎర్రగుడి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఆదివారం సాయంత్రం నిర్వహించు ఈ కార్యక్రమానికి పత్తికొండ శాసనసభ్యులు హాజరవుతారని,కావున మండల పరిధిలోని గల తెలుగుదేశం పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్ నాయుడు,వెంకట్రాముడు చౌదరిలు పిలుపునిచ్చారు

# వైయస్సార్ సిపీ నేత ఇరగం రెడ్డి రామకృష్ణారెడ్డిని పరామర్శించిన రెడ్యనీ సోదరులు.

బ్రహ్మంగారిమఠం దువ్వూరు మండలం, చిన్నశింగన పల్లెగ్రామానికి చెందిన వైయస్సార్ సిపీ దువ్వూరు మండల అధ్యక్షుడు ఇరగం రెడ్డి శంకర్ రెడ్డి సోదరుడు వైయస్సార్ సిపి నేత ఇరగంరెడ్డి రామకృష్ణారెడ్డి కర్నూలులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకొని తన స్వగ్రామం ఐన చిన్న శింగనపల్లెలోని వారి స్వగృహానికి రావడం తెలుసుకున్నవైయస్సార్ సిపి నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యనీ వెంకటసుబ్బారెడ్డి, వైయస్సార్ సిపి నేత,కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యనీ చంద్రశేఖర్ రెడ్డిలు శనివారం ఇరగం రెడ్డి రామకృష్ణారెడ్డిని పరామర్శించి,జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణారెడ్డి త్వరిత గతిన కోలుకోవాలని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు రెడ్యనీ సోదరులు తెలిపారు.

# కంచిలి, సోంపేట పోలీసు స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

శ్రీకాకుళం జూలై 12, '

కంచిలి, సోంపేట పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ కేవి. మహేశ్వర రెడ్డి ఐపిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ పరిశీలనాక్రమంలో ముందుగా స్టేషన్ రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు పరిష్కార తదితర అంశాలను పరిశీలించి మహిళ సమస్యలకు ప్రాధాన్యత, ఇస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి సూచించారు. అలాగే పెండింగ్ లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి దర్యాప్తు, పురోగతి పై, కేసుల వివరాలు పై ఆరా తీసారు.

# బావమరిది ని హతమార్చిన బావ

ఉదయగిరి జూలై 12, '

ఉదయగిరి లో బావ మరిది హమీద్ ను బావలు హనీఫ్,మరో వ్యక్తి హతమార్చారు. ఘటన తాలుకు వీడియో ఒళ్ళు గగుర్పాటు గురిచేసింది. నిముషాల్లోనే హత్య, ఓ వ్యక్తి రాడ్డుతో దాడి చేస్తుంటే మరో వ్యక్తి క్షణాల్లో వళ్ళు తూట్లు పడేలా కత్తి పోట్లు తగిలాయి. క్షణాల్లో నేలకొరిగిన హమీద్,కడుపులో పేగులు బయట వచ్చి,అధిక రక్తస్రావం తో ఘటనా స్థలం లోనే మృతి చెందాడు. ఫంక్షన్ హాల్ ఆస్తి వ్యవహారం లోనే హత్య చేసినట్టు ప్రాథమిక సమాచారం.

# 16చింతలాయ పల్లి గ్రామంలో పోలీసుల రాత్రి బస, పల్లె నిద్ర

నంద్యాల

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాలలో రాత్రి బస , పల్లె నిద్ర ,కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలం చింతలాయ పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కొలిమిగుండ్ల ఎస్సై గోపాల్ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పరిస్థితులను పై ఆరాదీశారు. ప్రస్తుత పరిస్థితులపై గ్రామ ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాలు, బాలబాలికల పై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు, సైబర్ మోసాల బారిన పడకూడదని, గంజాయి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనార్థాల గురించి తెలియజేశారు. అపరిచితుల కాల్స్ మరియు లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్పకూడదని మోసపూరిత ంఖఇ ఫైల్ పై ప్రజలకు అవగాహన చేసారు.

# ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ప్రాథమిక నివేదిక విడుదల

## పక్షి ఢీ కొనలేదు.. కుట్ర కోణం లేదు.. ప్రాథమిక నివేదికలో వెల్లడి

న్యూ డిల్లీ జూలై 12

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది.ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోంది' అని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది.కాగా, జూన్ 12న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 270 మంది మరణించారు. దుర్ఘటన జరిగి శనివారానికి సరిగ్గా నెల రోజులైంది. దీంతో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొం

# శ్రీశైలంలో గస్తీ తిరుగుటకు పోలీస్ సిబ్బందికి రెండు మోటార్ సైకిల్

శ్రీశైలం జులై 12 ప్రముఖ పుణ్యక్షేత్ర శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాముల వారి శ్రీశైల దేవస్థానం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు శ్రీశైలం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మరియు శ్రీశైలం దేవాలయం పరిసరాలలో పోలీస్ సిబ్బంది రాత్రి, పగలు గస్తీ తిరగుటకు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా రెండు కొత్త మోటార్ సైకిల్స్ ను శ్రీశైలం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు పంపించారు.

# వలంటీర్ల వ్యవస్థపై కేడర్ గుర్రు

గుంటూరు, జూలై 12, '

వైసీపీ అధినేత వైఎస్ జగన్ గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకుంటానని ముందు చెప్పాల్సి ఉంటుంది. అప్పుడే నేతల్లో కాస్త ధైర్యం కలుగుతుంది. 2019 ఎన్నికల్లో తొలి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఆయన ఓటమికి కారణాలయ్యాయి. అందుకే గతంలో తీసుకున్న నిర్ణయాలు మళ్లీ అధికారంలోకి వస్తే అమలుచేయబోనన్నహామీ జగన్ నుంచి స్పష్టంగా రావాల్సి ఉంటుంది. అప్పటి వరకూ కార్యకర్తలు, లీడర్లు వచ్చినప్పటికీ ఇంకా రెట్టించిన ఉత్సాహంతో మాత్రం పనిచేయరు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు పార్టీ నేతలతో పాటు కార్యకర్తలను కూడా ఐదేళ్ల పాటు ఇబ్బంది పెట్టాయి. ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశాడు. అసలు ఎమ్మెల్యేలకు, ప్రజలకు మధ్య సంబంధం లేకుండా జగన్ తానే ఒంటిచేత్తో రాష్ట్రాన్ని నడిపించాలన్న బిల్డప్ ఇచ్చేశాడు. బటన్ నొక్కుతున్నాను కదా? ఈవీఎంలో కూడా ఫ్యాన్ పై నొక్కుతారని భ్రమించి అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పుడువైసీపీ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. కేవలం వారు మనసులో దాచుకోవడం లేదు. వచ్చే ఎన్నికల తర్వాత జగన్ తన తీరును మార్చుకోవాలని కూడా నేతలు సూచిస్తున్నారంటే నేతలు ఏ మాత్రం హర్ట్ అయ్యారో వేరే చెప్పాల్సిన పనిలేదు. తాజాగా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. జగన్ వాలంటీర్ల వ్యవస్థను దూరం పెట్టాలని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. తాను కూడా ఈ విషయాన్ని జగన్ కు ఎప్పుడో చెప్పానంటూ ఆయన అన్నారు. అంటే వాలంటీర్ల వ్యవస్థ పార్టీని ఎంత డ్యామేజీ చేసిందో జగన్ కు ఈ పాటికి అర్థమయి ఉండాలి. కార్యకర్తలకు పనులు అప్పజెప్పాల్సిన జగన్ వాలంటీర్లను తీసుకుని వారి నెత్తిపై పెట్టడంతో ఇటు కార్యకర్తలు, అటు ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ పెరిగిపోయింది. ప్రజలకు కూడా అసలు వైసీపీ నేతలను సంప్రదించాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో స్థానిక నాయకత్వానికి, ప్రజలకు మధ్య కనెక్షన్ కట్ అయింది. ఈ కారణంగానే గత ఎన్నికల్లో ప్రజల వద్దకు వాలంటీర్లు వెళ్లలేదు. కార్యకర్తలు వెళ్లలేదు. ఫలితంగా పదకొండు సీట్లకే పరిమితమవ్వాల్సి వచ్చింది. మద్యం దుకాణాల విషయంలోనూ... ఇక మద్యం దుకాణాల విషయంలోనూ జగన్ ది తప్పుడు నిర్ణయమేనని వైసీపీనేతలు బాహాటంగా చెబుతున్నారు. ఎప్పుడూ లేనిది చరిత్రలో తొలిసారి ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహించడమేంటని, ఆ దుకాణాలు ఉంటే వేలంలో తాము సాధించుకుని పదో పరకో సంపాదించుకునే అవకాశాన్ని కూడా జగన్ పోగొట్టారని ద్వితీయ శ్రేణి నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ అధికారంలోకి రావడానికి తమ జేబు నుంచి డబ్బులు తీసి ఖర్చు పెట్టుకున్నా తర్వాత ఐదేళ్ల పాటు సంపాదించుకునే మార్గం లేక ఆర్థికంగా నష్టపోయామన్న ఆవేదన అందరిలోనూ ఉంది. అందుకే జగన్ తొలుత వాలంటీర్లు, మద్యం దుకాణాలపై తన విధానాన్ని చెప్పాలని వైసీపీ నేతలే ప్రశ్నించడం ఇప్పుడు పార్టీ నాయకత్వానికి మింగుడుపడటం లేదు.

# మళ్లీ సీనియర్లకు కాల్....

కాకినాడ, జూలై 12,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుత మంత్రి వర్గంలో దాదాపు పది మందిపై అసంతృప్తిలో ఉన్నారని తెలిసి సీనియర్ నేతలలో ఆశలు పెరిగాయి. మార్పులు తప్పవని మొన్న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు, వార్నింగ్ ల తర్వాత మళ్లీ పెద్దోళ్లలో ఆశలుపెరుగుతు?న్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియారిటీ అని పక్కన పెట్టారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎప్పుడు బాధ్యతలను స్వీకరించినా ఖచ్చితంగా కొందరు కేబినెట్ లో ఉంటారు. గత మూడు సార్లు అదే జరిగింది. 1995, 1999, 2014 లో చంద్రబాబు కాబినెట్ ఆ ఫేస్ లే ఎక్కువగా కనిపిస్తాయి. కానీ 2024 ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ కూర్పులో కొత్త ముఖాలకు చోటు కల్పించారు. సీఎం అంటే అదేనంటూ... చంద్రబాబు మంత్రివర్గం సమావేశంలో మరొక మాట కూడా అన్న విషయాన్ని సీనియర్ నేతలు గుర్తు చేస్తున్నారు. 1995 నాటి ముఖ్యమంత్రిని తనలో చూస్తారని చంద్రబాబు చెప్పడాన్ని బట్టి చూస్తే నాటి నుంచి అనేక మంది మంత్రులు యాక్టివ్ గా ఉండేవారు. మీడియా సమావేశాలు ఎప్పటికప్పుడు పెడుతూ అప్పటి ప్రతిపక్షాలపై విమర్శలు తీవ్ర స్థాయిలో చేసేవారు. సబ్జెక్ట్ పై అవగాహన ఉండటంతో అనర్గళంగా మీడియా అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పేవారు. నీటిపారుదల శాఖ కాని, హోంశాఖ కానీ, విద్యుత్తు శాఖ కానీ, వ్యవసాయ శాఖ, ఆర్థిక శాఖ ఇలా అన్ని శాఖలపై అందరూ పట్టున్న వారే కావడంతో విపక్షాల విమర్శలకు దీటైన సమాధానం గణాంకాలతో చెప్పేవారు. అయితే ఇప్పుడున్న కొత్త మంత్రుల్లో కొందరు, సీనియర్ నేతలుగా ఉన్న మరికొందరు ఎందుకో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సీనియర్ నేతలకు ప్రాధాన్యత కలిగిన శాఖలను ఇచ్చినప్పటికీ వారు సరైన టైంలో సరైన రీతిలో స్పందించలేదన్న కొరవ చంద్రబాబు లో స్పష్టంగా కనపడుతుంది. అది ప్రతిపక్షానికి అడ్వాంటేజీగా మారుతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. భయమా? లేక అవగాహన లోపమో? తెలియదు కానీ గత ఏడాది కాలంలో మంత్రివర్గంలో చాలా మంది మౌనంగానే ఉంటుండటం విపక్షానికి వరంగా మారింది. సవాల్ కు ప్రతి సవాళ్లు లేవు. అలాగే విపక్షం చేసే కౌంటర్లకు తిరిగి కౌంటర్ ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో చంద్రబాబు మార్చేయాలన్న యోచనకు వచ్చినట్లు చెబుతున్నారు.మార్పు ఎప్పుడన్నది తెలియకపోయినా .. మార్పు గ్యారంటీ అన్న సంకేతాలు మాత్రం బలంగా నేతల్లోకి వెళ్లాయి. చంద్రబాబు హెచ్చరికల తర్వాత కుర్ర మంత్రులు కొంత కలవరపడి స్పందిస్తున్నా అప్పటికే ఇచ్చిన సమయం దాటి పోవడంతో పాటు ఈ బ్యాచ్ తో ముందుకు వెళితే వచ్చే ఎన్నికల్లో నెగ్గుకు రావడం కష్టమేనని చంద్రబాబు అంచనాకు వచ్చారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. అందుకే సీనియర్లను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకుని విపక్షాలకు ధీటుగా సమాధానం చెప్పడంతో పాటు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. దీంతో పెద్దోళ్లు మళ్లీ పంచెలు బిగించి పసుపు పార్టీలో యాక్టివ్ అవుతున్నట్లే కనిపిస్తుంది.

# ఈసీకి తలనొప్పిగా బీహార్ రాజకీయాలు

పాట్నా జూలై 12

భారత రాజకీయ వ్యవస్థలో ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ. ప్రజాస్వామ్య ప్రక్రియలను నిర్వహించే కీలక బాధ్యతను కలిగి ఉంది. అయితే, ఇటీవలి కాలంలో ఈసీ పై విమర్శలు తీవ్రమవుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గతంలో ఈసీపై పలు ఆరోపణలు చేశారు. తాజాగా సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, ఈసీ మోడీ పాలనను కాపాడే సంస్థగా దిగజారిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, ఈసీ పాత్ర, ఓటర్ల జాబితా నిర్వహణలో అవకతవకలు, స్వతంత్రతపై ఉత్పన్నమవుతున్న సందేహాలు వ్యక్తమవుతోంది.ఎన్నికల సంఘం భారత రాజ్యాంగం కింద స్వతంత్ర సంస్థగా రూపొందించబడింది. దాని ప్రధాన లక్ష్యం ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతం, పారదర్శకతను నిర్ధారించడం. అయితే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎం.ఎ.బేబీ లాంటి రాజకీయ నాయకులు ఈసీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈసీని హిట్లర్ శకంతో పోల్చడం ద్వారా, బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య హక్కులు క్రమంగా క్షీణిస్తున్నాయని సూచించారు. ఈ విమర్శలు ఈసీ నిర్ణయాలు, ముఖ్యంగా ఓటర్ల జాబితా నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలు, ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం లోపించిందనే ఆందోళనలను బలపరుస్తున్నాయి.ఓటర్ల జాబితా నిర్వహణ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన అంశం. ఎస్ఐఆర్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) వంటి కార్యక్రమాలు పేదలు, వెనుకబడిన వర్గాల ఓటింగ్ హక్కులను దెబ్బతీస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఓటర్ల జాబితా నుంచి నిర్దిష్ట వర్గాల పేర్లు తొలగించబడుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్ల, ఈసీ నిష్పక్షతపై సందేహాలు తలెత్తుతున్నాయి. బీహార్ వంటి రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని, ఇది నిర్దిష్ట రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శలు వస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, ఇది ప్రజాస్వామ్య ప్రక్రియకు తీవ్రమైన ఆటంకం కలిగిస్తుంది.ఈసీ స్వతంత్రతను నిరూపించుకోవడానికి, ఓటర్ల జాబితా నిర్వహణలో పారదర్శకతను పెంపొందించాలి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో స్థానిక సంస్థలు, రాజకీయ పార్టీలతో సమన్వయం, సామాజిక కార్యకర్తల పర్యవేక్షణ అవసరం. అలాగే, ఈసీ నిర్ణయాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడం, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం వంటి చర్యలు విశ్వాసాన్ని పెంచుతాయి. అదే సమయంలో, రాజకీయ పార్టీలు ఈసీపై ఆరోపణలు చేస్తూ, వాటిని రుజువు చేసే ఆధారాలను సమర్పించాలి. ఆరోపణలు కేవలం రాజకీయ లబ్ధి కోసం ఉంటే, అవి సంస్థలపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈసీ, రాజకీయ పార్టీలు, పౌర సమాజం కలిసి పనిచేస్తేనే ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చేయగలం.

# కాకునూరులో పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభించిన ఎమ్మెల్సీ కవిత

రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండలం కాకునూర్ గ్రామంలో గృహలక్ష్మి పథకాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మహిళల తో కలిసి కార్డు లను ఢిల్లీ లోని సోనియా గాంధీ అడ్రెస్ కి పోస్ట్ చేసారు అనంతరం కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక అసమర్థత పాలన కొనసాగుతుందని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు 18 నెలలు గడిచిన అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల కోట్ల అప్పు చేసిందని అయినా ప్రజలకు సరైన సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో తక్కువ ఢిల్లీలో ఎక్కువ ఉంటారని ఎద్దేవా చేశారు, ఫ్రీ బస్ పేరుతో గ్రామాలకు వచ్చే బస్సుల సంఖ్యను తగ్గించడంతో మహిళలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు, రానున్న సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ కి వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు సూచించారు, బీసీ లకు ఎన్నికలలో 42% రిజర్వేషన్ కల్పిస్తూ క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవడం ముమ్మాటికీ తెలంగాణ జాగృతి విజయమే అని కవిత అన్నారు.

# తుంగతుర్తిలో అడుగుపెట్టే అర్హత రేవంత్ రెడ్డికి లేదు

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్

సూర్యాపేట

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 14న తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉండటంతో ఆయనపై ఘాటు విమర్శలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖబర్దార్.... రేవంత్ రెడ్డి ముందు గోదావరి కాళేశ్వరం జలాలు ఇచ్చి తుంగతుర్తిలో అడుగు పెట్టు, ఏ ముఖం పెట్టుకొని వస్తున్నావని ప్రశ్నించారు.

నీళ్లు లేక తుంగతుర్తి రైతులు విలపిస్తున్నారు, రైతుల గోడు కనబడటం లేదా! తుంగతుర్తి చైతన్యవంతమైన గడ్డ నీకు గుణపాఠం చెప్తారు అసలు తుంగతుర్తిలో అడుగుపెట్టే అర్హత రేవంత్ రెడ్డికి లేదు ఎన్నికల ప్రచారంలో తుంగతుర్తి కి వచ్చి ఫేక్ బాండ్లు ఇచ్చి హామీలు ఇచ్చి అందర్నీ పచ్చి మోసం చేశాడు.

ముందు వాటికి సమాధానం చెప్పు ఇక్కడ స్థానిక ఎమ్మెల్యేకు సోయలేదు. తుంగతుర్తి లో అడుగడుగున అవినీతి రౌడీ రాజ్యం నడుస్తుంది. నియోజకవర్గం 1200 కోట్లతో అభివృద్ధి చేసిన అని గప్పాలు కొడుతుండు దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయి.. మిస్టర్ సామెల్!

తుంగతుర్తిలో నేను తెచ్చిన నిధులకు పనులకు కొబ్బరికాయలు కొడుతూ, పబ్బం గడుపుతున్నాడు. ఈ అసమర్థ నాయకులతో తెలంగాణ ఆగం అయిందని ఆయన ఘాటు విమర్శలు చేశారు.

# సెల్ఫీ పేరుతో భర్తను నదిలోకి తోసేసిన భార్య..

రాయచూర్ సెల్ఫీ దిగుదామని నమ్మించి భర్తను భార్య నదిలోకి తోసేసిన ఘటన కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో జరిగింది. రాయచూర్ జిల్లాకు చెందిన తాతప్పను అతడి భార్య కృష్ణానది వద్దకు తీసుకెళ్లింది. సెల్ఫీ దిగుతామని చెప్పి ఒక్కసారిగా నదిలోకి తోసేసింది.అతడు కొంతదూరం కొట్టుకుపోయి బండరాళ్ల వద్ద ఆగాడు. స్థానికులు గమనించి తాడుతో బయటకు లాగారు. అయితే భర్తే ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడని భార్య చెబుతుండటం గమనార్హం..!!

# ప్రపంచ పోలీసు క్రీడలు విజేతలను అభినందించిన టీటీడీ చైర్మన్

తిరుమల ప్రపంచ పోలీస్ క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన విజివోలు రాంకుమార్, సురేంద్రలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అభినందించారు. విజేతలు అయనకు క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ ను గౌరవపూర్వకంగా కలిసి, పతకాలు చూపెట్టారు. విజేతలకు పతకాలను వేసి టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా ఈ విజయం తోడ్పడిందని చైర్మన్ అభినందించారు.

# ఫ్యూయల్ సప్లై ఆగడం వల్లే ప్రమాదం

గాంధీనగర్, జూలై 12, (న్యూస్ పల్స్)

జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తు నివేదిక విడుదలైంది. ఈ ఘోర విమాన ప్రమాదానికి కారణం ఇంజన్లు ఆగిపోవడమేనని, ఇందులో కుట్ర కోణం ఏదీ లేదని తెలుస్తోంది. సకాలంలో రెండు ఇంజిన్లూ పనిచేయకపోవడంతోనే విమానం కూలిపోయింది అని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఘటనపై దర్యాప్తునకు సంబంధించి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో-ంంఏః 15 పేజీల ప్రాథమిక నివేదిక సమర్పించింది. విమానం ప్రమాదం జరిగి సరిగ్గా నెలరోజులకు ంంఏః రిపోర్ట్ సమర్పించింది. ఘటన జరగడానికి ముందు ఏమైంది.. ఇంజన్ స్వభావం ఎలా ఉంది..? వాతావరణ పరిస్థితులు.. ఇలా అనేక అంశాల్ని లోతుగా పరీక్షించి ఈ నివేదికను రూపొందించింది ంంఏః.టేకాఫైన కొద్ది క్షణాలకే ఫ్యూయల్ సప్లయ్ ఆగిపోవడంతో రెండు ఇంజన్లూ పనిచేయడం మానేశాయి. ఎందుకు ఫ్యూయల్ కటాఫ్ చేశావ్ అని ఒక పైలట్ అడగ్గానే.. నేను కటాఫ్ చెయ్యలేదు అని రెండో పైలట్ చెప్పాడు. కాక్‌పిట్ ఆడియో రికార్డుల్లో ఈ వాయిస్ ఉంది. ఇంజిన్లు పవర్‌ను కోల్పోగానే.. ఆటోమేటిక్‌గా హైడ్రాలిక్ పవర్ వచ్చేలా ర్యామ్ ఎయిర్ టర్బైన్ కనెక్ట్ అయ్యింది. దీనికి సంబంధించిన ఫుటేజ్ కూడా ంంఏః దగ్గర ఉంది. వెంటనే ఇంజన్లను రీస్టార్ట్ చెయ్యడానికి పైలట్లు ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఇంజన్1 రికవర్ అయినా ఇంజన్2 మొరాయించడంతో 32 సెకన్లలోనే విమానం కూలిపోయిందని నివేదిక తెలిపింది.విమానంలో ఫ్యూయల్ క్లీన్‌గానే ఉందని, ఎటువంటి కలుషిత పదార్థాలు లేవని రిఫ్యూయలింగ్ అథారిటీస్ ద్వారా తేలింది. సమీపంలో ఏదైనా పక్షి ఎగిరిన దాఖలా లేదని, పక్షి విమానాన్ని ఢీకొట్టినట్లు కనిపించలేదని తెలిపింది. పైగా ఆకాశం క్లియర్‌గా ఉంది. వాతావరణ సమస్యలు కూడా ఏమీ లేవు. రెక్కలు, గేర్ల ఏర్పాటు కూడా సురక్షితమైన టేకాఫ్‌కి అనువుగానే ఉన్నాయి. విమానంలో మోతాదుకు మించిన బరువులు కూడా ఏవీ లేవు. పైలట్లు ఇద్దరూ మంచి అనుభవజ్ఞులు. ప్రయాణ సమయానికి ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని ంంఏః చెబుతోంది.కుట్ర కోణానికి సంబంధించిన ఆధారం ఏదీ లభించలేదని కూడా తేల్చేసింది ంంఏః రిపోర్ట్. నివేదికపై స్పందించిన ఎయిరిండియా.. ప్రస్తుతానికి ఏమీ చెప్పలేమని పూర్తిస్థాయి దర్యాప్తు దాకా ఆగాల్సిందేనని చెబుతోంది

# రాజాసింగ్ ఫ్యూచర్ ప్లాన్ ఏంటీ

హైదరాబాద్,, జూలై 12,

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. దీంతో రాజాసింగ్ భవిష్యత్ నిర్ణయం ఎలా ఉంటుందన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే రాజాసింగ్ రాజీనామా చేసినప్పుడు ఆల్టర్నేటివ్ ప్లాన్ సిద్ధం చేసిపెట్టుకున్నట్లు సమాచారం. ఇటీవల బీజేపీ అధ్యక్ష పదవి కోసం రాజాసింగ్ తాను కూడా పోటీ చేసేందుకు పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చినప్పుడు నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారంటూ ఆయన పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా లేఖ సమర్పించారు. దీంతో పాటు పార్టీ అధ్యక్షుడిగా రామచందర్ రావు ఎంపికపై కూడా పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ అధినాయకత్వం సీరియస్ గా తీసుకుంది. తన రాజీనామా లేఖను కిషన్ రెడ్డికి ఇచ్చారు. రాజాసింగ్ రాజీనామాను ఆమోదించింది. .. అయితే రాజాసింగ్ పదకొండేళ్ల క్రితం బీజేపీలో చేరారు. వరసగా మూడు సార్లు రాజాసింగ్ కు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. దీంతో గోషామహల్ నుంచి మూడు సార్లు 2014, 2018, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే వరస వివాదాలు ఆయన కొని తెచ్చుకున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ఆయనపై కేసులు నమోదయ్యాయి. జైలుకు కూడా వెళ్లి వచ్చారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంలోనూ, ఎంఐఎంపై విరుచుకుపడటంలోనూ బీజేపీ నేతల కంటే రాజాసింగ్ ముందుటారు. హిందుత్వం కోసమే తాను పనిచేస్తున్నట్లు రాజాసింగ్ చెబుతారు. అయితే మొన్న రాజీనామా చేసిన సమయంలోనూ తాను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరబోనని, తనకు, ఆ పార్టీ సిద్ధాంతాలు పడవని తెలిపారు. బీజేపీలో చేరినా ఆయనకు తనకు పదవుల విషయంలో అన్యాయం జరిగిందని భావించారు. శాసనసభపక్ష పదవి కూడా ఆయనకు దక్కలేదు. అందుకు కారణం ఆయన ఎవరి మాటవినరు. తాను తప్ప మరెవ్వరూ హిందుత్వం కోసం పనిచేయరన్న భావనతో ఆయన ఉంటారు. తనకు మించిన హిందుత్వ వాది మరొకరు ఉండరని తనకు తానే అనుకుంటారు. అందుకే బీజేపీలో ఉన్న నేతలను కూడా లెక్కచేయరు. శాసనసభ పక్ష నేతగా పదవి దక్కకపోవడానికి కూడా రాజాసింగ్ వ్యవహార శైలి కారణమని, బీజేపీలో 90 శాతం మంది రాజాసింగ్ ను వ్యతిరేకిస్తారు కాబట్టి ఇటు ఆపదవితో పాటు అటు పార్టీలోనూ మూడు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికయినా ఎలాంటి పదవులు దక్కలేదు. ఇది వాస్తవం.... కానీ రాజాసింగ్ మాత్రం రాజకీయాల నుంచి దూరం జరిగే అవకాశం లేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన రాజీనామాను పార్టీ ఆమోదించడంతో ఇక తదుపరి ఎమ్మెల్యేపదవికి రాజీనామా చేస్తారంటున్నారు. ప్రస్తుతం రాజాసింగ్ అమర్ నాథ్ యాత్రలో ఉన్నారు. యాత్ర నుంచి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారంటున్నారు. అందుకు కారణం ఆయన శివసేనలో చేరతారంటున్నారు. శివసేనలో చేరి ఇక్కడ పార్టీ అభ్యర్థిగా ఉప ఎన్నికలో గెలిచి తన సత్తా ఏంటో గోషామహల్ లో చూపాలని రాజాసింగ్ సిద్ధమవుతున్నారని తెలిసింది. అందుకే ఆయన తన రాజీనామా ఆమోదించిందని తెలిసిన వెంటనే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న కలతో పగలనక, రాత్రనక పనిచేస్తున్న లక్షలాది మంది బీజేపీ కార్యకర్తల బాధను తాను ఢిల్లీకి తెలియచేయలేకపోయినా, తాను హిందుత్వం కోసమే పనిచేస్తుంటానని, హిందూ సమాజ హక్కులకసం తన గొంతుక వినిపిస్తుంటానని ట్వీట్ చేయడం దీనికి బలం చేకూరుస్తుంది. అదేజరిగితే ఉపఎన్నికలు జరిగితే గోషా మహల్ లో బీజేపీకి కష్టకాలమేనని చెప్పాలి.

## అరుణాచలంలో హత్యకు గురైన మోత్కూరు యువకుడు

యాదాద్రి

అరుణాచలంలో దైవ దర్శనానికి వెళ్లి అక్కడ దొంగల చేతిలో హతమైన సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణం లోని ఇందిరా నగర్ కు చెందిన చిప్పలపల్లి రవీందర్ ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ గా అసెంబ్లీ ప్రాంగణం లో విధులు నిర్వహిస్తూ హైదరాబాద్ లో ఉంటున్నాడు. అతని కుమారుడు విద్యాసాగర్ (28) మెడికల్ రిప్రజెంటేటివ్ గా పనిచేస్తూ కంపెనీ క్వార్టర్స్ లో ఉంటున్నాడు. విద్యాసాగర్ గతం లో రెండు సార్లు స్నేహితులతో కలిసి అరుణాచలం వెళ్లి వచ్చాడు. ఈ సారి కూడా వెల్దామంటే స్నేహితులు రామని చెప్పడంతో అతడు ఒక్కడే వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.



ఈ నెల 4న మోత్కూరు వచ్చి తాతను చూసి వెళ్లాడు. ఈ నెల 6న బయలుదేరి వెళ్లి 7న అరుణాచలం చేరుకున్నాడు. పగలు గిరిప్రదక్షణ చేస్తే ఎండకు కాళ్లు కాలుతాయని ఈ నెల 8న రాత్రి గిరిప్రదక్షణ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి గొంతు కోశారని, రాత్రంతా కొన ఊపిరితో కొట్టుకుంటూ రోడ్డుపైనే పడి ఉన్నాడని, 9న ఉదయం అక్కడి పోలీసులు చూసి ఆస్పత్రికి తరలించారని చెబుతున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో 9న వారు వెళ్లే సరికి విద్యాసాగర్ ఆస్పత్రిలో మృతి చెంది ఉన్నాడు. ఈ నెల 10న పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు భౌతికకాయాన్ని తలిదండ్రులకు అప్పగించగా స్వగ్రామానికి తీసుకవచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రవీందర్ కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా ఇద్దరు కుమార్తెల వివాహాలు జరిగాయి. కుమారుడు కూడా ప్రయోజకుడై ఉద్యోగం చేస్తుండటంతో త్వరలోనే వివాహం చేయాలనుకున్నారు. ఇంతలోనే దొంగల చేతిలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, తోబుట్టువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యాసాగర్ మృతితో ఇందిరానగర్ కాలనీలో విషాదఛాయలు అములుకున్నాయి.

## అనురాగ్ యూనివర్సిటీలో సెంట్రింగ్ డబ్బా కూలి నలుగురికి తీవ్ర గాయాలు ఇద్దరి పరిస్థితి విషమం

మేడ్చల్ పోచారం పోలీస్ స్టేషన్ పరిధి వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో స్లాబ్ కూలి నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. వారందరూ ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నారు. జనగాం ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి కి చెందిన అనురాగ్ యూనివర్సిటీ లో ఎఫ్ టి ఎల్ లో నూతనంగా నిర్మాణాలు చేపడుతున్నారని గతంలో పలువురు ఫిర్యాదు చేశారు. శనివారం జరిగిన ఘటనతో మీడియాను లోనికి యూనివర్సిటీ సిబ్బంది అనుమతించతేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 31 బస్టాప్ లో ప్రయాణికులను పరుగులు పెట్టించిన ఆర్టీసీ బస్సు

సికింద్రాబాద్

సికింద్రాబాద్ స్టేషన్ సమీపంలోని 31 బస్ స్టాప్ లో ఆర్టీసీ బస్సు ప్రయాణికులను పరుగులు పెట్టింది. బస్సులో డ్రైవర్ లేకుండా బస్సు వెళ్ళడంతో పాదచారులు,వాహనదారులు అవాక్కైయారు. బస్సు నుంచి దూరంగా వెళ్ళిపోవడానికి పాదచారులు పరుగులు పెట్టారు. రెండు వాహనలు డీ కోట్టి ,షాపు షట్టర్ ను డీకోట్టి బస్సు నిలిచిపోయింది..హ్యాండ్ బ్రెక్ వెయకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్ స్టాప్ లో వదిలి వెళ్ళడంతో ఘటన జరిగింది. బస్సు డీకోట్టడంతో ఇద్దరికి గాయలు,ఒక వాహనం ద్వంసం అయ్యాయి. రాత్రి సమయంలో ఘటన జరిగింది.

## తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్శనివారం నాడు హైదరాబాద్లోని లక్డికపుల్ లోని వాసవి క్లబ్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, పరిశ్రమలు, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మాల సంఘాల ప్రముఖులు, రాష్ట్రస్థాయి నేతలు, విద్యార్థి, యువజన ప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోంది. మాల సంఘాలు సుదీర్ఘకాలంగా సాధికారత కోసం పోరాడుతున్నాయి. ప్రభుత్వ విధానాలు అందరికీ సమానంగా ప్రయోజనం కలిగించేలా ఉండాలని కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మాల మహానాడు ద్వారా వచ్చిన ప్రతిపాదనలు, సమస్యలు పై స్వయంగా సమీక్షిస్తానని మంత్రి అన్నారు.

# కొండా అంశాన్ని ఏం చేద్దాం...

వరంగల్, జూలై 12,

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్య తీసుకోవాల్సిందేనని వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. లేకుంటే తాము ఇలాంటి అవమానాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని, ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈరోజు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాట అనిపించుకుంది తామని, తిరిగి తమనే క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవడమేంటని వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే వాస్తవాలు తెలుసుకోవాలంటే ఇరు పక్షాల వాదనలను ఎవరైనా వినాల్సి ఉంటుందని, సమస్యకు పరిష్కారం కనుగొనాలంటే అందరి వాదనలను వినాల్సిన బాధ్యత కమిటీ మీద ఉంటుందని చెప్పారు... అయితే వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం తాము ఇక ఎక్కువ సమయం ఉపేక్షించలేమని, కొండా మురళి తన ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. తాము ఆ నిర్ణయం తీసుకోక ముందే కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము హైకమాండ్ వరకూ వెళ్లి తమ నిరసనను తెలియజేస్తామని క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పినట్లు తెలిసింది. తమను బహిరంగంగానే దూషించిన కొండా మురళిని అలా వదిలేస్తే ఇక తమను ఎవరు జిల్లాలో లెక్క పెడతారని, తమకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తాము కూడా బహిరంగంగానే కొండా కుటుంబం పై విమర్శలు చేయడానికి రెడీ గా ఉన్నామని కూడా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవికి చెప్పినట్లు తెలిసింది. తమను దూషించిన వారిని వదిలేసి... అందుకు మల్లు రవి తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారని, కమిటీ సమావేశంలో జరిగిన విషయాలు మీడియాకు చెప్పవద్దని కూడా ఎమ్మెల్యేలకు మల్లు రవి సూచించారు. కాగా వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లబ కొండా మురళిగా మారిపోయింది. ఈ వివాదం తెగదు తెల్లారేటట్లు లేదని ఎమ్మెల్యేలే కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమను దూషించిన వ్యక్తి నేరుగా కమిటీని కలసి, చివరకు వినతి పత్రంలోనూ తమను తప్పుపడుతూ ఇచ్చినప్పటికీ కమిటీ ఏం చేయకుండా మీన మేషాలు లెక్క పెడితే ఎలా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము కూడా బహిరంగ వేదికలపై విమర్శలు చేసుకుంటూ పోతే పార్టీ పరువు బజారున పడుతుందని కూడా ఒక రకంగా హెచ్చరించినట్లు తెలిసింది. క్రమశిక్షణ కమిటీ సంఘం కమిటీ ఛైర్మన్ మల్లు రవి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అందరినీ భోజనాలకు పిలవగా, అందుకు వారు సున్నితంగా నిరాకరించి వెళ్లడం కూడా కమిటీపై అసంతృప్తిని వెళ్లగక్కినట్లయిందని అంటున్నారు. మరొక వైపు క్రమశిక్షణ కమిటీ కొండా మురళిపై చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఎమ్మెల్యేల ఒత్తిడి, మరొక వైపు జిల్లాలో బలమైన నాయకుడు మధ్య జరిగిన వివాదం కావడంతో సున్నితంగా దీన్ని పరిష్కరించడానికి క్రమశిక్షణ కమిటీ ప్రయత్నిస్తుందని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఇద్దరినీ పిలిచి కూర్చోబెట్టి మాట్లాడితే తప్ప సమస్యకు పరిష్కారం లభించదన్న అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతుంది. తెలంగాణ కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అంటే పెద్దగా ఎవరికీ భయం ఉండదు. ఎందుకంటే ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ. ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటారన్నది మాత్రం అత్యాశే అవుతుంది.

# ఫోర్త్ సిటీటూ అమరావతి... కొత్త జాతీయ రహదారి...

హైదరాబాద్,జూలై 12,

తెలంగాణ నుంచి ఎగుమతులు, దిగుమతులు సులభతరం చేసేందుకు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంటోంది. అందులో భాగంగా హైదరాబాద్ ఫోర్త్సిటీ నుంచి ఏపీలోని అమరావతి వరకు గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే, హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు నిర్మాణం, అక్కడి నుండి మచిలీపట్నం పోర్టుకు రైలు మార్గం నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టులు రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్యం, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని తెలంగాణ అధికారులు ఏపీకి వివరించారు. వీటికి కేంద్రం గ్రీన్సిగ్నల్ ఇవ్వగా.. ఏపీ స్పందన కోసం తెలంగాణ ఎదురుచూస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవాణా ఆధారిత అభివృద్ధి దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఎగుమతులు, దిగుమతులను సులభతరం చేయడానికి కొత్త ఎక్స్ప్రెస్ హైవే, డ్రైపోర్ట్-పోర్ట్ రైలు మార్గాల నిర్మాణాన్ని ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనలు తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడంతో పాటు, ఏపీతో మెరుగైన అనుసంధానానికి మార్గం సుగమం చేయనున్నాయి. హైదరాబాద్ సమీపంలోని ఫోర్త్సిటీ నుంచి ఏపీలోని అమరావతి వరకు గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవేను నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవల కేంద్ర హోంశాఖ నిర్వహించిన ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై జరిగిన సమావేశంలో ఈ గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవేకి గ్రీన్సిగ్నల్ లభించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖకు సూచించింది. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మధ్య 65వ నంబరు జాతీయ రహదారి ఉంది. అయితే, కొత్త ఎక్స్ప్రెస్ హైవేను హైదరాబాద్ నుంచి కాకుండా హైదరాబాద్కు భవిష్యత్ నగరంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్న ఫోర్త్సిటీ నుంచి నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆలోచనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్అండ్బీ స్పెషల్ సీఎస్లతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చర్చించారు. అమరావతి-ఫోర్త్సిటీని కలుపుతూ గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే వస్తే ఇది విజయవాడ-హైదరాబాద్ ప్రస్తుత జాతీయ రహదారికి సమాంతర రోడ్డు అవుతుందని తెలంగాణ అధికారులు ఏపీ అధికారులకు వివరించారు. ప్రస్తుత జాతీయ రహదారికి అటూఇటూగా 10 కి.మీ. దూరంలో దీన్ని నిర్మిస్తే ప్రత్యేక బెల్ట్లా తయారవుతుందని చెప్పారు. మధ్యలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ ఎలైన్మెంట్పై ఆంధ్రప్రదేశ్ స్పందన కోసం తెలంగాణ సర్కార్ ఎదురుచూస్తోంది. తీరప్రాంతం లేకపోవడంతో ఓడరేవులు లేవు. దీంతో బియ్యం, చమురు, ఎరువులు, సిమెంటు వంటి వస్తువుల ఎగుమతులు, దిగుమతులకు వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి, తెలంగాణ ప్రభుత్వం అమరావతి నుంచి వచ్చే ఎక్స్ప్రెస్ హైవేకు హైదరాబాద్ శివారులో ఏర్పాటుచేసే జంక్షన్ వద్ద డ్రైపోర్టు నిర్మించాలని భావిస్తోంది. ఈ డ్రైపోర్టు నుంచి మచిలీపట్నం నౌకాశ్రయం వరకు కొత్త రైలు మార్గం నిర్మించేలా కసరత్తు జరుగుతోంది. నౌకాశ్రయం తరహాలో డ్రైపోర్టులో కంటైనర్ యార్డులు, కార్గో నిర్వహణ వంటి కార్యకలాపాలు జరుగుతాయి. కొత్త ఎక్స్ప్రెస్ హైవేకి సమీపంలోనే డ్రైపోర్టు-మచిలీపట్నం నూతన రైలు మార్గం ఉండేలా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ ప్రతిపాదనలు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వాణిజ్యాన్ని, రవాణాను మెరుగుపరచడమే కాకుండా, పారిశ్రామిక అభివృద్ధికి కూడా దోహదపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తే ఈ ప్రాజెక్టులు వేగవంతమయ్యే ఛాన్స్ ఉంది

## జమ్మికుంటలో వరుస దొంగతనాలు

కరీంనగర్

జమ్మికుంట పట్టణం లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం ఇదే మున్సిపల్ పరిధిలోని సైదాబాద్ లో పట్టపగలే ఓ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డ దొంగలు తాజాగా పట్టణం నడిబొడ్డున దానాల కాంప్లెక్స్ లోని బ్రాండ్ కల్యాణ్ జ్యూవెలర్స్ లో షట్టర్లు పగులగొట్టి ఏడు లక్షల విలువైన బంగారు , వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు దొంగలు. ఉదయం షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని గమనించిన చుట్టు పక్కన వారు షాపు యజమానికి తెలుపగా షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడం తో సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు విచారిస్తున్నారు. షాప్ లో ఉన్న సీసీ కెమెరాలు పని చేయపోవడం కొసమెరుపు.

## యువతే దేశానికి బలం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

సికింద్రాబాద్

యువతే మన భారతదేశానికి బలం అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు... సికింద్రాబాద్ లోని రైల్ కళారంగ్ లో జరిగిన రోజ్ గారి మేళా లో కిషన్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు... మోడీ కలలు కంటున్న వికసిత భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడం లో యువత పాత్ర కీలకం అన్నారు... ఇప్పటివరకు 15 విడతలలో దేశ వ్యాప్తంగా సుమారు 10లక్షల 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ఈరోజు మరో 51 వేల మందికి కేంద్ర విభాగాలలో నియామక పత్రాలు అందచేయడం సంతోషముగా ఉందన్నారు.. ఉద్యోగాల కోసం వేచి చూడటం కన్నా ఉద్యోగాలను సృష్టించేలా యువతను ప్రోత్సహించాలి అనేది మోడీ గారి ఆలోచన అని కిషన్ రెడ్డి అన్నారు

## పశ్చిమ నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి డా.స్వామి

విశాఖపట్నం

విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి శనివారం నాడు విశాఖా పశ్చిమ నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గణబాబుతో కలసి ఇంటింటికి వెళ్లి ఏడాది కూటమి పాలన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఏ ఎన్నిక జరిగినా విశాఖ నగర ప్రజలెప్పుడు టీడీపీ వైపే వుంటారు. గత 5 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం ఏడాదిలోనే చేశాం. పింఛన్లు పెంచాం, ఇంట్లో ఎంత మంది ఉన్నా తల్లికి వందనం ఇచ్చాం. త్వరలో ఉచిత బస్సు,అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి ఇచ్చాం. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

## అమలాపురం గ్రామంలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటన ఘనంగా స్వాగతం పలికిన అమలాపురం గ్రామస్తులు

అనకాపల్లి

హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం నాడు నక్కపల్లి మండలం అమలాపురం గ్రామంలో? పర్యటించారు. మంత్రికి మహిళలు అడుగడుగున హారతులతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో కనకమహాలక్ష్మి అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. అమలాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

ఆర్ అండ్ బి (10 లక్షల నిధులతో) కల్వర్టుకు శంకుస్థాపన చేసారు. గ్రామస్తులతో ముఖా-ముఖీలో పాల్గొన్నారు. ప్రజల యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారు. నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు. గత ప్రభుత్వంలో ఫించను 1000 రూపాయలు పెంచడానికి ఐదు సంవత్సరాలు సమయం పెట్టింది. ఇప్పుడు ఎన్డియే ప్రభుత్వంలో ఒకసారే 1000 రూపాయలు పెంచాము ఎంతమంది పిల్లలు ఉన్నా,తల్లికి వందనం ఇచ్చాం. ఇప్పటికే రెండు గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. అమలాపురం గ్రామంలో రోడ్లు,డ్రైనేజీలు మేము వేసినవేనని అన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోండి. ఇల్లు లేని వారికి 3 సెంట్లు స్థలం ఇచ్చి,ఇల్లు కట్టిస్తాం. రైతులు అందరికి న్యాయం చేస్తాం. ఎలాంటి అపోలు వద్దు. అమలాపురం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు.

## సింహగిరిలో నేత్రపర్వంగా సహస్రనామార్చన

సింహాచలంవరాహలక్ష్మి నృసింహ స్వామి వారి సహస్రనామార్చన నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపం లో అధిష్టింపజేశారు. సహస్రనామార్చనలో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# ఒక్కడుగా గెలిచి... ఒంటరి వాడై....

హైదరాబాద్, జూలై 12

తెలంగాణ రాజకీయాల్లో ఖట్టర్ హిందూగా పేరు తెచ్చుకున్న రాజాసింగ్.. హిందుత్వ పార్టీ అయిన బీజేపీ నుంచి దూరం అయ్యారు. ఇటీవలె కాషాయ పార్టీకి రాజాసింగ్ రాజీనామా చేయగా.. తాజాగా పార్టీ హైకమాండ్ ఆమోదం తెలపడంతో బంధం తెగిపోయింది. దీంతో దశాబ్ద కాలంగా తెలంగాణ బీజేపీలో తన వంతు పాత్ర పోషించిన రాజాసింగ్ .. ఇప్పుడు ఒంటరిగా పార్టీని వీడారు. ఒకానొక దశలో బీజేపీ అభ్యర్థులంతా ఓడిపోయిన సమయంలో ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్.. పార్టీ పీకల్లోతు కష్టాల్లో ఉన్న సమయంలో అండగా నిలిచారు. ఓసారి పార్టీ నుంచి సస్పెండ్ చేసినా.. మళ్లీ తనకు ఉన్న పర్సనల్ ఇమేజ్ కారణంగా నిషేధం ఎత్తేసే పరిస్థితిని కల్పించి.. మళ్లీ పార్టీలో చేరారు. ఇక తాను పార్టీలో చేరినప్పటి నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్‌కు పార్టీలో అంతటి గౌరవం దక్కలేదనే వాదనలు సొంత పార్టీ శ్రేణుల్లోనే నెలకొన్నాయి.దూకుడైన వైఖరి, వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం పార్టీని ఇరుకున పెట్టేలా చేయడ వల్లే రాజాసింగ్‌కు.. మరిన్ని బాధ్యతలు అప్పగించేందుకు అధిష్ఠానం మొగ్గుచూపలేదనే వాదనలూ ఉన్నాయి. ఒంటరిగా ఎదిగి, ఒకే ఒక్కడిగా నిలిచి, చివరికి పార్టీలో ఒంటరై తన ప్రస్థానాన్ని ముగించిన రాజాసింగ్ నేపథ్యాన్ని ఒకసారి గమనిస్తే..తెలంగాణలో ఒక సాధారణ కార్పొరేటర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు టి. రాజాసింగ్. అనతి కాలంలోనే సక్సెస్‌ఫుల్ నేతగా ఎదిగారు. తెలుగుదేశం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చిన రాజాసింగ్.. 2009లో కార్పొరేటర్‌గా గెలిచారు. 2014 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కమలం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గం నుంచి వరుసగా గెలిచి.. హ్యాట్రిక్ విజయాలు నమోదు చేశారు.2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 5 సీట్లను గెలుచుకోగా.. అందులో రాజాసింగ్ ఒకరు. ఇక 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో పోటీ చేయగా.. ఘోర పరాభవం చవిచూసింది. గోషామహల్ నుంచి పోటీ చేసిన రాజాసింగ్ ఒక్కరే విజయం సాధించి.. కమలం పార్టీ తరఫున అసెంబ్లీలో అడుగుపెట్టారు. అలాంటి రాజాసింగ్ ఇప్పుడు పార్టీని వీడటంతో బీజేపీ కార్యకర్తలు, హిందుత్వ వాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రాజాసింగ్ బీజేపీ నుంచి వెళ్లిపోవడం పార్టీకి తీరని నష్టమని పేర్కొంటున్నారు.2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఘోర అవమానం ఎదురైనా.. రాజాసింగ్ ఒంటరిగా గెలిచి.. కమలం పార్టీ పరువును కాపాడిన నేతగా నిలిచారు. అయితే, 2022లో ఇస్లాం మత పెద్ద మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి నుపూర్ శర్మ.. చేసిన వ్యాఖ్యలు దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాయి. అయితే, నుపూర్ శర్మను బీజేపీ నుంచి సస్పెండ్ చేయగా.. ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు మద్దతు ప్రకటించిన రాజాసింగ్.. ఆమెను సమర్థిస్తూ వీడియో విడుదల చేయడం తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలోనే 2022 ఆగస్ట్ 23వ తేదీన రాజాసింగ్‌ను బీజేపీ సస్పెండ్ చేసింది.అనంతరం 2024 అక్టోబర్ 22న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు సస్పెన్షన్ ఎత్తివేయడంతో రాజాసింగ్‌కు తిరిగి బీజేపీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కింది. రాజాసింగ్‌ను పార్టీలోకి తీసుకున్నా.. అధిష్టానంతో గ్యాప్ మాత్రం కొనసాగుతూనే వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చినా.. ఆ సభలకు రాజాసింగ్ హాజరు కాకపోవడం గమనార్హం.2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఒక్కడే గెలవడంతో రాజాసింగ్‌కు శాసనసభా పక్షనేతగా అవకాశం వచ్చింది. అయితే, ఆ తర్వాత జరిగిన 2023 ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు రాగా.. మళ్లీ అవకాశం వస్తుందని ఆయన భావించారు. కానీ.. ఆ పదవిని బీజేపీ హైకమాండ్ ఏలేటి మహేశ్వర్ రెడ్డికి అప్పగించింది. అప్పటి నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న రాజాసింగ్.. పార్టీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తరచూ విమర్శలు కొనసాగిస్తూ వచ్చారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే వారితో కొందరు కీలక నేతలు టచ్‌లో ఉంటారని పరోక్షంగా కిషన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. మేకప్ మెన్, రబ్బర్ స్టాంప్ అంటూ సెటైర్లు వేశారు.మరోవైపు.. శాసనసభా పక్ష నేతగా అవకాశం రాకపోవడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి కోసం రాజాసింగ్ ప్రయత్నాలు చేశారు. కానీ, పార్టీ మరోసారి రాజాసింగ్‌కు మొండిచేయి చూపించింది. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావును పార్టీ కొత్త అధ్యక్షుడిగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో రాజాసింగ్ తీవ్రంగా కలత చెంది.. పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జూన్ 30వ తేదీన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన రాజాసింగ్.. తనను ఎమ్మెల్యేగా కూడా డిస్ క్వాలిఫై చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేగా కూడా తన రాజీనామా లేఖను స్పీకర్‌కు పంపించాలని విజ్ఞప్తి చేశారుబీజేపీ అధ్యక్ష పదవి రాకపోవడంతో రాజాసింగ్ తీవ్ర అసంతృప్తితో రాజీనామా చేస్తూ.. సంచలన ఆరోపణలు చేశారు. చాలా రోజుల తర్వాత బీజేపీ కార్యాలయానికి వెళ్లిన రాజాసింగ్.. రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నానని.. కానీ తన మద్దతుదారుల్ని బెదిరించారని.. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడామని.. కానీ పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారని రాజాసింగ్ సంచలన ఆరోపనలు చేశారు. కొత్తగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్ రావుకు రాజాసింగ్ సవాల్ విసిరారు. ఫాతిమా కాలేజీ కూల్చివేతపై పోరాడి.. ఆయన డమ్మీ కాదని నిరూపించుకోవాలని రాజాసింగ్ అన్నారుకరుడు గట్టిన హిందువుగా పేరుగాంచిన రాజాసింగ్.. చాలాసార్లు గోవధకు తీసుకెళ్తున్న మూగజీవాలకు సంబంధించిన వాహనాలను అడ్డుకున్నారు. వ్యాన్లు, లారీల్లో తరలిస్తున్న గోవులను.. తన మద్దతుదారులతో అడ్డగించి.. వాటిని కబేళాలకు తరలించకుండా ఆపడంలో చాలాసార్లు సఫలం అయ్యారు. అంతేకాకుండా ఏటా హనుమాన్ శోభాయాత్రను సొంతంగా నిర్వహించి.. తన హిందుత్వాన్ని చాటుకుంటూ ఉన్నారు రాజాసింగ్.హిందుత్వం కోసం రాజాసింగ్ చేసే పోరాటాలకు బీజేపీలోనే కాకుండా.. ఇతర పార్టీలు, సాధారణ హిందువుల్లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. అలాంటి ఖట్టర్ హిందువును పార్టీ నుంచి పంపించడం.. బీజేపీకి నష్టమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారుపార్టీకి గుడ్‌బై చెప్పిన రాజాసింగ్.. బీజేపీకి రాజీనామా చేసినందున ఎమ్మెల్యేగా కూడా కొనసాగనని చెప్పారు. కానీ ఇందులో ఒక మెలిక పెట్టారు. తన రాజీనామా లేఖను కిషన్ రెడ్డి.. స్పీకర్‌కు పంపించాలని చెప్పారు. అయితే పార్టీ మాత్రం.. రాజాసింగ్‌నే ఆ రాజీనామా లేఖను స్పీకర్‌కు పంపించాలని సూచించింది. ఇప్పుడు బీజేపీ హైకమాండ్.. రాజాసింగ్ రాజీనామాను ఆమోదించడంతో.. ఇక ఆయన ఏం చేయనున్నారు అనేది ఆసక్తికరంగా మారింది. ఆయన రాజీనామా లేఖను స్పీకర్‌కు పంపిస్తారా లేక ఎమ్మెల్యేగా కొనసాగుతారా అనే చర్చ జరుగుతోంది.

# ఆదివారం..మద్యం , మాంసం బంద్

## సూర్యభగవానుడికి అంకితం అంటున్న గ్రామస్తులు

కరీంనగర్, జూలై 12, (

ఆదివారం అంటే చాలు.. కచ్చితంగా ఆరోజు ఇంట్లో ముక్క ఉండాల్సిందే. ఇక సండేను ఫన్ డేగా జరుపుకోవాలంటే ముక్కతోపాటు చుక్క కూడా కావాల్సిందే. అందుకే ఆదివారం వచ్చిందంటే చాలు.. పల్లె, పట్నం అని తేడా లేకుండా మాంసం, మద్యం లేకుండా పూట గడవదు అంటే అతిశయోక్తి ఏమీ కాదు. వారంలో ఎన్నిసార్లు మాంసం వండుకున్నా, మద్యం సేవించినా.. ఆదివారం రోజున మాత్రం తప్పనిసరిగా ఉండాల్సిందే. మాంసం, మద్యం ప్రియులకు ఈ రెండు లేనిదే వారికి ఆదివారం పరిసమాప్తం కాదు అనేది ఒప్పుకోవాల్సిందే. ఇంట్లో కాకపోయినా.. బయటి నుంచైనా తెచ్చుకుని తినాల్సిందే, తాగాల్సిందే. ఇక వెజ్ ప్రియులు కూడా తమకు ఇష్టమైన వంటకాలను ఆదివారం రోజున చేసుకుని.. హ్యాపీగా ఉంటారు. మరీ ముఖ్యంగా ఆంధ్రాతో పోల్చితే.. ఇది తెలంగాణలో మరింత ఎక్కువగానే ఉంటుంది. తెలంగాణ అంటేనే మటన్ ప్రియులు ఎక్కువగా ఉంటారు. ఊర్లల్లో అయితే ఆదివారం రోజున ఓ మేకను కోసి.. మాంసాన్ని పంచుకుని తింటారు. కానీ.. ఒక్క గ్రామం మాత్రం వీటన్నింటికీ దూరంగా ఉంటోంది.అది కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం గర్షకుర్తి గ్రామం . అక్కడ అన్నీ సాధారణంగానే ఉన్నా.. ఆదివారం వచ్చిందంటే చాలు.. మిగిలిన గ్రామాల కంటే భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే.. ఎక్కడైనా ఆదివారం వచ్చిందంటే.. పిల్లలకు స్కూళ్లు, కాలేజీలకు సెలవు ఉంటుంది. ఉద్యోగులు, బిజినెస్ చేసేవాళ్లు కూడా ఇళ్లల్లోనే ఉంటారు. చాలా కొద్దిమంది మాత్రమే.. తమ పనుల్లో ఉంటారు. మిగిలిన వారంతా ఆరోజు తమ పనులకు సెలవు పెట్టి ఇంట్లో ఉంటారు. ఇక ఆ రోజు.. మాంసం తెచ్చుకుని.. కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేసి సంతోషంగా గడుపుతారు. కానీ గర్షకుర్తి గ్రామంలో మాత్రం ఇలాంటివేవీ ఉండదు. ఆదివారం అంటే గర్షకుర్తి గ్రామ ప్రజలకు.. ఒక పవిత్రమైన రోజు. ఆరోజున గర్షకుర్తి గ్రామంలో ఎవరు కూడా మద్యం తాగడం గానీ, మాంసం తినడం లాంటివి గానీ చేయరు. ఆరోజున మాంసం, మద్యానికి దూరంగా ఉంటారు.అయితే ఇందుకు ఒక ప్రధాన కారణం ఉంది. ప్రవచనకర్త భూపతి శ్రీనివాస్.. ఈ ఏడాది మార్చి 2వ తేదీ నుంచి గర్షకుర్తి గ్రామంలో మహాభారతం, రామాయణంపై ప్రవచనాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అసలు మన పురాణాల్లో ఆదివారం రోజుకు ఉన్న ప్రాముఖ్యత, విశిష్ఠతను గర్షకుర్తి గ్రామ ప్రజలకు పూర్తిగా అర్థమయ్యేలా వివరించారు. ఆదివారం అనేది.. ఆదిదేవుడు సూర్యభగవానుడి రోజు అని ఆరోజు మద్యం తాగరాదని.. మాంసం తినవద్దని వారికి బోధించారు. భూపతి శ్రీనివాస్ ప్రవచనాలతో.. గర్షకుర్తి గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసుకుని.. ఒక గొప్ప మార్పుకు తెరలేపారు. ఇక నుంచి ఆదివారం రోజున గర్షకుర్తి గ్రామంలోని ఏ ఇంట్లో కూడా మద్యం సేవించడం గానీ, మాంసం వండటం, తినడం లాంటివి చేయకూడదని తీర్మానం చేసుకున్నారు.ఇక ఇదే విషయాన్ని గ్రామంలోని ప్రతీ ఇంటికీ వెళ్లి వివరించారు. ఇక ఆదివారం రోజున గ్రామస్తులు ఎవరూ.. మద్యం తాగడం, మాంసం తినడంపై నిషేధం విధిస్తున్నట్లుగా.. గ్రామంలోని కూడళ్లలో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో అప్పటినుంచి గర్షకుర్తి గ్రామంలో ఆదివారం వచ్చిందంటే చాలు.. చిన్నా, పెద్ద, ముసలి, ముతక అందరూ మాంసం, మద్యానికి దూరంగా ఉంటున్నారు. ఈ నియమాన్ని గ్రామస్తులంతా తప్పకుండా పాటించాలని.. గ్రామ పెద్దలు గట్టిగా హెచ్చరికలు చేశారు. అయితే ఈ విషయం తెలుసుకుని.. చుట్టుపక్కల గ్రామాలు కూడా.. ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని చర్చించుకుంటున్నట్లు.. గర్షకుర్తి గ్రామస్తులు వెల్లడించారు.ఈ ఏడాది ఉగాది సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన పంచాంగం శ్రవణంలో పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి.. ఆదివారం రోజున మాంసం, మద్యం ముట్టుకోకూడదని చెప్పారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆదివారం వచ్చిందని.. రాజు సూర్యుడు అయ్యాడని పేర్కొన్నారు. సూర్యుడు బాగుండాలంటే.. ఆదివారం రోజున తెలంగాణలో సుక్కా ముక్కా ముట్టుకోవద్దని సూచించారు. అలా చేస్తే రాజ్యం బ్రహ్మాండంగా ఉంటుందని తెలిపారు. ఆదివారం రోజున మాంసం, మద్యానికి దూరంగా ఉంటే అధికారులు, నాయకులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆరోగ్యం, రాష్ట్రం బాగుంటుందని వెల్లడించారు. భగవంతుడు అనుగ్రహిస్తాడని.. ఇది శాస్త్రంలో చెప్పిన మాట అని వివరించారు. ఆదివారం రోజున మాంసాహారాలు మానేసి.. సూర్యుడిని పూజించే వారు అత్యంత శక్తివంతులు అవుతారని సంతోష్ కుమార్ శాస్త్రి తెలిపారు.ఆదివారం రోజున మద్యం, మాంసం ముట్టకూడదని



హిందూ సంప్రదాయంలో ఉంది. కేవలం ఆచారాల ప్రకారమే కాకుండా.. వీటికి మరిన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ఆదివారం రోజున మాంసాహారం, మద్యం సేవించడం మంచిది కాదని ధర్మశాస్త్రాలు, పురాణాల్లో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఒక శ్లోకం కూడా ఉంది.మద్యం సేవించడం, మాంసం తినడం, స్త్రీతో సాంగత్యం, క్షవరం చేసుకోవడం, తలకు నూనె పెట్టుకోవడం వంటివి ఆదివారం నాడు చేసేవారు ఏడు జన్మల పాటు రోగులుగా, దరిద్రులుగా పుడతారు. అదేవిధంగా ఆదివారం రోజున వీటన్నింటికీ దూరం పెట్టిన వారికి వ్యాధులు, దుఃఖం, దరిద్రం ఉండవు. వారు సూర్యలోకాన్ని చేరుకుంటారుహిందూ ఆచారాల ప్రకారం.. ఆదివారం సూర్య భగవానుడికి అంకితం చేయబడింది. శక్తికి, ఆరోగ్యానికి, తేజస్సుకి ప్రతీకగా సూర్యుడిని హిందువులు కొలుస్తారు. ఆదివారం రోజున సూర్య నమస్కారాలు చేయడం, సూర్యుడిని పూజించడం వల్ల మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కలుగుతాయని హిందువులు విశ్వసిస్తారు. గ్రహాలకు అధిపతి సూర్యుడు కాబట్టి.. ఆయన అనుగ్రహం పొందడానికి ఆదివారం రోజున కొన్ని నియమాలు పాటించడం మంచిదని చెబుతారు.మాంసాహారం తినడం వల్ల మనిషి శరీరంలో వేడి పెరుగుతుందని.. అయితే అది ఆరోగ్యానికి అంత మంచిది కాదని కొన్ని సంప్రదాయాల్లో పేర్కొన్నారు. సూర్యుని శక్తిని స్వీకరించే ఆదివారం రోజున శరీరాన్ని తేలికగా, స్వచ్ఛంగా ఉంచుకోవడం ఉత్తమమని విశ్వసిస్తారు. సాధారణంగా శాఖాహారంతో పోల్చితే.. మాంసాహారం జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. ఇక ఆదివారం రోజున పని లేకుండా.. విశ్రాంతి తీసుకోవాల్సిన రోజు కాబట్టి.. ఆ రోజున లైట్ ఫుడ్ తీసుకోవడం మంచిదని ఆయుర్వేదం కూడా చెబుతోందిజ్యోతిష్య శాస్త్రం ప్రకారం కూడా ఆదివారం చాలా పవిత్రమైన రోజు. ఈ ఆదివారం రోజున పవిత్రమైన ఆహారం తీసుకోవడం వల్ల శరీరం శుద్ధిగా ఉండటమే కాకుండా.. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. మద్యం, మాంసం వంటివి మనుషుల మనసును ప్రభావితం చేసి.. అశాంతికి దారితీస్తాయని భావిస్తారుభారతదేశాన్ని బ్రిటీష్ పాలకులు 200 ఏళ్ల పాటు పాలించిన సంగతి తెలిసిందే. బ్రిటీషర్లు ప్రవేశపెట్టిన కొన్ని ఆచారాలు ఇప్పటికీ మన దేశంలో కొనసాగుతూనే ఉన్నాయి. బ్రిటీషర్ల కాలంలో ఆదివారం సెలవు దినం కావడంతో అదే ఇప్పటికీ కొనసాగుతోంది. ఉద్యోగ సంస్కృతి పెరిగాక ఆదివారం రోజు మాంసం తెచ్చుకొని తినే అలవాటు మరింత పెరిగింది. అయితే బ్రిటిషర్ల పాలనకు ముందు మన దేశంలో పరిస్థితి ఇలా ఉండేది కాదని చెప్పొచ్చు.ఆదివారం రోజున మద్యం, మాంసానికి దూరంగా ఉండేది ఒక్క గర్షకుర్తి గ్రామమే కాదు.. మరి కొన్ని గ్రామాలు కూడా ఉన్నాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోనూ ఆదివారం రోజున మాంసంతోపాటు మద్యం దుకాణాలు కూడా బంద్ చేస్తారు. ఆదిలాబాద్ జిల్లాలోని రాంపూర్ గ్రామంలోనూ ఆదివారం రోజున నో ఆల్కహాల్, నో నాన్ వెజిటేరియన్ డేగా పాటిస్తారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా ఎస్. కొత్తూరు గ్రామంలో వందల ఏళ్లుగా ఆదివారం రోజున మద్యం, మాంసం ముట్టుకోరు. ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రీతికరమైన రోజుగా ఆ గ్రామ ప్రజలు భావిస్తారు. అదే విధంగా అనంతపురం జిల్లాలోని అడిగుప్ప గ్రామంలో 500 ఏళ్లుగా ఈ నియమాన్ని పాటిస్తున్నారు. దేవుడి దయ వల్ల తమ గ్రామం రక్షించబడిందని.. అందుకు కృతజ్ఞతగా ఆదివారం రోజున మాంసం, మద్యం సేవించడం మానేసినట్లు స్థానికులు చరిత్ర గురించి వివరిస్తున్నారు. నంద్యాల జిల్లాలోని పాణ్యం మండలం కొత్తూరు గ్రామంలోనూ ఆదివారం పూట మటన్, చికెన్ దుకాణాలు మూసి ఉంచుతారు. ఆదివారం రోజును అక్కడ వెజిటేరియన్ డేగా భావిస్తారు.

# ఇందిరమ్మ క్యాంటీన్లు...

# అన్న క్యాంటీన్ తరహాలోనే ప్లాన్

హైదరాబాద్, జూలై 12, (

తెలంగాణలోని రేవంత్ సర్కార్.. ఇందిరమ్మ క్యాంటీన్లను తెచ్చేందుకు రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నగరం అంతటా ఇందిరమ్మ క్యాంటీన్లు తెరిచి.. వాటి ద్వారా పేద వారికి అతి తక్కువ ధరకే అనగా కేవలం 5 రూపాయలకు రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం అందించేందుకు ప్రణాళికలు రెడీ చేస్తోంది. త్వరలోనే నగర వ్యాప్తంగా ఇందిరమ్మ క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం నగరవ్యాప్తంగా మధ్యాహ్నం వేళ రూ.5కే భోజనం పెడుతూ.. పేద వారి కడుపు నింపుతున్న అన్నపూర్ణ క్యాంటీన్లనే.. ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చనున్నారు. ఇకపై వీటిల్లో మధ్యాహ్న భోజనంతో పాటుగా ఉదయం పూట టిఫిన్ కూడా అత్యంత తక్కువ ధరకే అందించేందుకు రేవంత్ సర్కార్ ముందుకు వచ్చింది.దీనిలో భాగంగా ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా అందించబోయే టిఫిన్లకు సంబంధించి.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) మెనూ సిద్ధం చేసింది. వీటిల్లో ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్‌తో పాటుగా మిల్లెట్ టిఫిన్లు కూడా అందించనున్నారు. జీహెచ్ఎంసీ నిర్ణయం మేరకు.. ప్రజల నుంచి ఒక్కో టిఫిన్‌కు కేవలం రూ.5 మాత్రమే వసూలు చేయనుంది. జీహెచ్ఎంసీలో వడ్డించే టిఫిన్‌కు సాధారణంగా రూ.19 ఖర్చవుతుండగా.. జనాల నుంచి రూ.5.. మిగతా రూ.14 ఖర్చును ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమవుతుంది.హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ రూపొందించిన టిఫిన్ మెనూను అమలు చేయనున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మిల్లెట్ ఆహారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రోజుకో రకమైన అల్పాహారాన్ని.. అత్యంత తక్కువ ధరకే సామాన్యులకు అందించనున్నారు. ఈ మెనూలో భాగంగా 6 రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో రకం టిఫిన్ వడ్డించనున్నారు. మెనూలో ఉన్న టిఫిన్ లిస్ట్ రోజు వారిగా ఇలా ఉండబోతుంది.

1వ రోజు: మిల్లెట్ ఇడ్లీ (3), సాంబార్, చట్నీ/పొడి

2వ రోజు: మిల్లెట్ ఉప్మా, సాంబార్, మిక్స్ చట్నీ

3వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ

4వ రోజు: ఇడ్లీ (3), సాంబార్, చట్నీ

5వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ

6వ రోజు: పూరీ (3), ఆలూ కూర్మా

ఇందిరమ్మ క్యాంటీన్లలో వడ్డించే ప్రతి టిఫిన్‌కు సరిపోయేలా ఖచ్చితమైన గ్రాముల వారీగా పదార్థ పరిమాణాలూ నిర్ణయించారు. ఉదాహరణకి మిల్లెట్ ఇడ్లీ తీసుకుంటే.. ఒక్కో ఇడ్లీ 45 గ్రాములు, సాంబార్ 150 గ్రాములు, చట్నీ 15 గ్రాములుగా ఉండనుంది. ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం జీహెచ్ఎంసీ 139 ప్రాంతాల్లో కొత్త కంటైనర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.11.43 కోట్ల ఖర్చు చేయనున్నారు. ఈ క్యాంటీన్‌లలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యం. పేద, మధ్య తరగతి ప్రజల కోసం రూపొందించిన ఈ పథకం.. వారికి తక్కువ ధరకే ఆరోగ్యకరమైన అల్పాహారాన్ని అందించడంలో మైలురాయిగా నిలవనుంది అంటున్నారు అధికారులు.

## యాద్రాద్రి థర్మల్ ప్లాంట్ పనులను పరిశీలించిన ఉన్నతాధికారులు

నల్గొండనల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులను రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ విట్టల్ జెన్ కో సిఎండి డాక్టర్ ఎస్ హరీష్ లు పరిశీలించారు. పవర్ ప్లాంట్ లోని పలు విభాగాలను సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్లాంట్ ఆవరణలో మొక్కలు నాటి. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం జరిపారు. ముఖ్యమైన పనులపై అధికారులు దృష్టి సారించి యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేయాలని మొత్తం మీద వచ్చే సంవత్సరం జనవరి నాటికి ఐదవ యూనిట్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు

# విశ్వనగరం అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదు.. అడ్డగుట్టలను కూడా పట్టించుకోవాలి

# పాలకులు సంకుచితంగా ఉండవద్దు

### నాకు క్లబ్బుకు పోయే అలవాటు లేదు ప్రజల చుట్టూ తిరగడమే నా అలవాటు

### మౌత్ పబ్లిసిటీ అన్నింటికంటే గొప్పది.. నేను మనిషిని నమ్ముకున్న వాడిని ఈటల రాజేందర్

హైదరాబాద్ఎంపి ఈటల రాజేందర్ శనివారం ఉదయం నాగోల్ రాక్ టౌన్ పార్క్ లో మార్నింగ్ వాకర్స్ తో కలిసి నడిచారు. ఈటల మాట్లాడుతూ ఎన్నికల ముందు వచ్చి ఉపన్యాసాలు ఇచ్చాను. ఇప్పుడు మాటలు కాదు చేతల సమయం. ప్రజా సమస్యల పరిష్కారంలో "నాట్ పాసిబుల్" అనేది నా డిక్షనరీలో ఉండదు. కళ్ళ ముందు కనిపిస్తున్న సమస్యను తీర్చడానికి నిబంధనలు, జీవోలు అడ్డు రాకూడదు.. ఆ జీవోలు ఇచ్చేది మనమే. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేలాడుతున్న కరెంటు తీగలు మార్చమంటే రూల్స్ పేరుతో చేయలేదు. కానీ ఆర్థిక మంత్రి కాగానే కరీంనగర్ జిల్లాలో ఉన్న కరెంటు తీగల లైన్లను ఒక్క సంతకంతో మార్పించగలిగానని అన్నారు.ఎప్పుడు ఏ పాత్ర నిర్వహించాలో ఆ పాత్ర సమర్థవంతంగా నిర్వహించగలిగిన వాడే నిజమైన రాజకీయ నాయకుడు. అప్పుడు మంత్రిని సమస్యలు పరిష్కరించాను.. ఇప్పుడు ప్రతిపక్ష ఎంపీని సమస్యల కోసం కొట్లాడుతున్నాను. అందుకే అవసరమైన ధర్నాకు సైతం కూర్చుంటున్ననని అన్నారు.పాలకులు కొన్ని సమయాల్లో ప్రజల మీద ప్రేమతో కంటే వారి ఓటు మీద ప్రేమతో పనులు చేస్తుంటారు. అందులో భాగమే 118 జీఓ. మునుగోడు ఎన్నికల కుట్రలో భాగం ఈ జీవో. విశ్వనగరం అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదు.. అడ్డగుట్టలను కూడా పట్టించుకోవాలి. స్లమ్స్ సమస్యలు కూడా పరిష్కారం చేయాలి. మౌత్ పబ్లిసిటీ అన్నింటికంటే గొప్పది.. నేను మనిషిని నమ్ముకున్న వాడిని. ఫ్లెక్సీలు మీద ఉన్న ఫోటోలు, గోడల మీద ఉన్న రాతలు పోతుండవచ్చు. కానీ ప్రజల గుండెల్లో ఉన్న ఫోటో శాశ్వతం. పనే గీటురాయి. ప్రజలు కులాన్ని మతాన్ని చూడరు. మానవత్వాన్ని చూస్తారు. హైడ్రాకు నేను వ్యతిరేకం కాదు.. సమాజం పురోగమనంలో ఉండాలని కోరుకునేవాడిని. కానీ పేదల ఇల్లు కూల్చడానికి వ్యతిరేకం. అనుమతి ఇచ్చిన మీరే ఇల్లీగల్ అంటే ఎలా ? ప్రజల సమస్యలు అర్థం చేసుకొని పరిష్కరించగలిగిన వాడే లీడర్ మాటలు చెప్పి పోయేవాడు కాదు. ఎల్బీనగర్లో పోలైన ఓట్లలో 60 శాతం ఓట్లు నాకు వేశారు. అందుకే నేను కాదు నా పని మాట్లాడుతుంది. నేను పైసలు, మద్యం నమ్ముకున్న వాడిని కాదు..

# చౌడూరి కి జాతీయ ఉత్తమ కవి పురస్కారంతో అపూర్వ గౌరవం



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూలై 12:అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన, భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ ఆమోదం పొందిన, మానవసేవయే మాధవసేవగా నమ్మిన, ప్రతిష్టాత్మకమైన సంస్థ మనం ఫౌండేషన్ తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాద్ త్యాగరాజ గాన సభ కళా వెంకట దీక్షితులు ఆడిటోరియంలో శుక్రవారం నాడు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జరిగిన సాహిత్య సభలో ప్రముఖ కవి, పత్రికా రచయిత, విశ్లేషకులు, బహు గ్రంథ కర్త చౌడూరి నరసింహారావు ను మనం ఫౌండేషన్ 2025 సంవత్సరానికి "జాతీయ ఉత్తమ కవి" పురస్కారంతో సత్కరించారు.పాలమూరు ముద్దుబిడ్డ చౌడూరి గత 40 ఏళ్లుగా తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన ఎనలేని సేవలను గుర్తిస్తూ, వారిని ఈ పురస్కారంతో సత్కరిస్తున్నామని సభకు అధ్యక్షత వహించిన ప్రఖ్యాత కవి, రచయిత, విమర్శకులు, బహు గ్రంధకర్త శ్రీ ఎన్.వి. రఘువీర్ ప్రతాప్ తెలిపారు. అంతకుముందు జరిగిన కవి సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి విచ్చేసిన సుమారు 60 మంది కవులు పాల్గొన్నారు. కవి సమ్మేళనం లో చౌడూరి వినిపించిన "ఎవరు గురువు..?" అనే కవితకు అతిథుల నుండి చక్కటి ప్రశంసలను అందుకున్నారు.ఇదే రోజు రఘువీర్ ప్రతాప్ పుట్టినరోజు కావడం వలన ఆయన జన్మదిన వేడుకలు కూడా జరిగాయి. ఈ సందర్భంగా చౌడూరి నరసింహారావు తాను రచించిన "సౌజన్య మూర్తికి అక్షర సుమ మాలిక" అనే కవితను ఫ్రేం కట్టించి, సభకు చదివి వినిపించి, రఘువీర్ ప్రతాప్ కు శాలువాతో సన్మానించి అందించారు.జాబిలి సాహిత్య పత్రిక సంపాదకులు, ప్రముఖ సాహితీ వేత్త జాబిలి చాంద్ పాషా సభకు ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఒరిస్సాకు చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ ప్రసన్నకుమార్ దలై విశిష్ట అతిథిగా, కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జింకా సుబ్రహ్మణ్యం ఆత్మీయ అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమం మనం ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ కె చక్రవర్తి పర్యవేక్షణలో జరిగింది. కవులందరికి నిర్వాహకులు చక్కటి భోజనాలు ఏర్పాటు చేశారు. తనను జాతీయ ఉత్తమ కవిగా పురస్కారాన్ని ఇచ్చి గౌరవించినందుకు మనం ఫౌండేషన్ వారికి, రఘువీర్ ప్రతాప్ కు చౌడూరి కృతజ్ఞతలు తెలిపారు. తమ వ్యవస్థాపక అధ్యక్షుడికి ఇంతటి అపూర్వ గౌరవం లభించడం పట్ల చౌడూరి కళాపీఠం సభ్యులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ తీర్మానాన్ని స్వాగతిస్తున్నా%శీ%:బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్ల కొండ వేణుగోపాల్ గౌడ్



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై12:ఇటీవల రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో బీసీల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని, 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. క్యాబినెట్ నిర్ణయానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, ఇతర క్యాబినెట్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.హన్మకొండ బాలసముద్రం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సంఘాల నేతలతో కలిసి వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని గత 18 నెలలుగా అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని గల్లీ నుండి ఢిల్లీ వరకు నిర్వహించిన పోరాట ఫలితమే ఈ 42 శాతం రిజర్వేషన్ల ప్రకటన, ఇది ముమ్మాటికి బీసీల విజయంగా భావిస్తున్నామన్నారు, కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం మొదటగా తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగనన చేపట్టాలని, ఆ తర్వాత బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశామని తమ డిమాండ్ ను గౌరవించి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును రాష్ట్ర గవర్నర్ ద్వారా గత ఏప్రిల్ 11న రాష్ట్రపతికి పంపించడం జరిగిందని, రాష్ట్రం ప్రభుత్వం పంపించిన బిల్లు నేటి వరకు మూడు నెలలు పూర్తయిందని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో కనీసం స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు ముగించాలని కోర్టు తీర్పులు ఇంకొక వైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బీసీ బిల్లును కనీసం పరిగణలోకి తీసుకోకపోవడంతో ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తనకున్నటువంటి సర్వ అధికారాలు ఉపయోగించి గత ప్రభుత్వం చేసిన పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి ప్రత్యేక పరిస్థితుల దృశ్య బీసీ రిజర్వేషన్ల 42 శాతం పెంచడానికి ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చి గవర్నర్ ద్వారా ఆమోదించుకొని బీసీ రిజర్వేషన్లు కచ్చితంగా 42 శాతం అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని ఇలాంటి సమయంలో రాజకీయ పార్టీలు బీసీల రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బీసీ రిజర్వేషన్లను రాజకీయంగా బలిపీఠం ఎక్కించకుండా బీసీ రిజర్వేషన్ల పెంపుకు అన్ని పార్టీలు సహకరించాలని వేణుగోపాల్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లను ఆట కేక్కించాలని చూస్తే ఎవరిని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని న్యాయస్థానాలను అడ్డుపెట్టుకొని కొంతమంది కోవర్టుల ద్వారా లేనిపోని న్యాయపరమైన చికాకులు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తే కచ్చితంగా వారికి తగిన బుద్ధి చెప్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అగ్రకుల సమాజం సంపూర్ణంగా మద్దతు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, గత ప్రభుత్వంలో బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడానికి కోర్టులను వేదికలుగా చేసుకొని అగ్రకులాలు 34% అమలు కాకుండా అడ్డుకున్నారని ఇప్పుడు కూడా అదే వైఖరితో వ్యవహరిస్తే బీసీలు కూడా అగ్రవర్ణాలకు కల్పిస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయించాలని రోడ్లపైకి రావలసి వస్తుందని రద్దు చేసే వరకు కచ్చితంగా సమరశీలమైన పోరాటాలు చేయాల్సి వస్తుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బీసీ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ డా. చిర్ర రాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కాసగాని అశోక్, పెరుమాండ్ల అనిల్ గౌడ్, పంజల మధు గౌడ్, తెల్ల సుగుణ బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు మాదం పద్మజ దేవి, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మేలా శోభరాణి, బీసీ మహిళా జిల్లా నాయకురాలు, తెల్ల సుగుణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధులు దొడ్డ నారాయణరావు మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు: పోకల వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 12:కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు స్వాతంత్ర సమరయోధులు కామ్రేడ్ దొడ్డ నారాయణరావు మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు పేద ప్రజలకు తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు.అనారోగ్య కారణాలతో శనివారం అమరులైన కామ్రేడ్ దొడ్డా నారాయణరావు భౌతిక కాయాన్ని గరిడేపల్లి మండల సిపిఐ పార్టీ నాయకులు సందర్శించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా ఉద్యమాలలోతుపాకీ చేత పట్టుకొని పేద ప్రజల పక్షాన పోరాటం చేసి,అజ్ఞాత జీవితం గడటమే కాకుండా జైలు జీవితాన్ని కూడా గడిపిన చరిత్ర ఆయనదని అన్నారు.పేద ప్రజలకు ఈ ప్రాంతంలో వేలాది ఎకరాల భూములను పంచి పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.ప్రత్యక్ష ఎన్నికలలో పాల్గొని చిలుకూరు గ్రామ సర్పంచ్ గా,ఎంపీపీగా, ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ గా,జిల్లా కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ గా అనేక పదవులను అలంకరించి పేద ప్రజలకు సేవ చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, మండల సిపిఐ కార్యవర్గ సభ్యులు త్రిపురం సుధాకర్ రెడ్డి,ఎడ్ల అంజి రెడ్డి, ప్రతాని సైదులు, తిరగమల్ల కిరణ్,కట్ట అశోక్, పగడాల శీను, కుందూరు వెంకట్ రెడ్డి, పోకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో చేగొమ్మ

### -పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి

### -ఇబ్బంది పడుతున్న ప్రజలు.






కూసుమంచి,భారత శక్తి, జూలై 12:ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని చేగొమ్మ గ్రామం సమస్యల వలయంలో చిక్కుకొందని గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామంలో ఏ రాజకీయ పార్టీ కూడా స్పందించకుండా మాకేంటి అన్న చందంగా వ్యవహారిస్తున్నారని సిపిఎం గ్రామ కార్యదర్శి ఉన్నం హరినాధ బాబు విమర్శించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాత్రం స్థానికంగా నిధులు లేవనే పేరుతో ఉత్సవ విగ్రహంగా రావడం, వెళ్లడం తప్పితే ఏ ప్రజా సమస్యలను పరిష్కరించిన దాఖలాలు లేనే లేవని ఆగ్రహించారు.గ్రామంలో వేలాది రూ. వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అవి పని చేయక చాలా కాలం అయిందని గ్రామంలో చిల్లర దొంగతనాలు చాలానే జరుగుతున్నాయని, ఏకంగా పీర్ల చావిడిలో ఉన్న పీర్లు ఎవరో గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని, దేవాలయంలో గుడి గంటలు కూడా మాయామయ్యాయని ఆవేదన చెందారు.ఈ విషయంపై అనేక మంది గ్రామస్థులు గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం ఫలితం లేకుండా పోయిందని, కొద్ది మంది గ్రామస్థులు స్థానిక వాట్సాప్ గ్రూపులో ఈ విషయాన్ని ప్రస్థావిస్తే నిధులు లేవని, సీసీ కెమెరా రిపేర్లకు 50 వేలకు పైగా ఖర్చు అవుతాయని, మీరిస్తారా...? అంటూ తన స్థాయిని కూడా మరిచిపోయి గ్రామ పంచాయితీలో పని చేస్తున్న సామాన్య సిబ్బంది వారు ప్రశ్నలు సంధించడం గమనార్హమని పేర్కొన్నారు.అనేక రోజుల తరబడి మంచి నీటి సరఫరా కావడం లేదని,ఒక వేళ అడపాదడప సరఫరా చేసిన నాలుగు బిందెలకు మించి రాని పరిస్థితి ఉందని,పారిశుధ్య సమస్య గ్రామంలో ఉందని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ వీధుల్లో తిప్పడం ఎప్పుడో బంద్ అయిందని ప్రజలు వాపోతున్నారు.అదే విధంగా అనేక వీధులలో విద్యుత్ దీపాలు వెలగడం లేదన్నారు. పంచాయతీ సిబ్బంది కూడా నిధులు లేమి సాకు చూపెట్టి విధులలో నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని ప్రజలు చర్చించుకొంటున్నట్లు చెప్పారు.చావుకు, పెండ్లికి ఒకటే మంత్రం అన్నట్టుగా అన్నింటికీ నిధులు లేవు, మేము ఏమి చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని,విధులు నిర్వహించేందుకు గ్రామంలో పారిశుధ్య కార్మికులు ఉన్నారనే సంగతే గ్రామస్థులు మరిచి పోయినట్లుందని ఎద్దేవా చేశారు.గత మార్చి నెల నుండి సర్పంచ్ లేక పోవడం,ప్రత్యేక అధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శి చేతుల్లో స్థానిక పరిపాలన సాగడం, పైగా నిధులలో కోత పడటంతో కార్యదర్శి కి కలిసి వచ్చిన అవకాశంగా ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొందని,ఇప్పటికైనా చేగొమ్మ గ్రామంలో ప్రజా సమస్యలు గుర్తించి, వాటిని పరిష్కరించి, కనీస అవసరాలు తీర్చాలని గ్రామస్థులు కోరుకోరుతున్నారని ఉన్నం హరినాథ్ బాబు మీడియా ముఖంగా తెలిపారు.

# పెద్దిరెడ్డి గణేష్ పౌర సన్మాన సభను విజయవంతం చేయండి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 12:సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ నందు జూలై 13 ఆదివారం జరిగే సుధా బ్యాంక్ ఎండి పెద్దిరెడ్డి గణేష్ పౌర సన్మానం అభినందన సభ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణంలోని ప్రముఖులు, మేధావులు సంగీత అభిమానులు, కళాకారులు సామాజిక స్వచ్ఛంద సేవ సంస్థల సభ్యులు, వ్యాపార, వాణిజ్య వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సుధాకర్ పివిసి ఎండి, సుధాబ్యాంకు చైర్మన్, ఆహ్వాన కమిటీ అధ్యక్షులు మీలా మహాదేవ్ అన్నారు. శనివారం సుధా బ్యాంకు నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దిరెడ్డి గణేష్ గత 20 సంవత్సరాలుగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కళామతల్లికి అనేక రకాలుగా సేవ చేస్తున్నారని, అనేకమంది కళాకారులను సూర్యాపేటకు తీసుకొని వచ్చి వారి ద్వారా త్యాగరాయ ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారని అటువంటి కళామతల్లి ముద్దుబిడ్డను సన్మానించుకోవడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. పెద్దిరెడ్డి గణేష్ కు ఎన్టీఆర్ స్మారక అవార్డు రావడం చాలా గర్వించదగ్గ విషయమని స్వర్గీయ నందమూరి తారక రామారావు గొప్ప నటుడు అని కళామతల్లికి ఎనలేని సేవ చేశారని తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా తెలియజేశారని అన్నారు. అటువంటి మహానుభావుని అవార్డు గణేష్ కి రావడం నిజంగా సంతోషకరమని వారు తెలిపారు. పెద్దిరెడ్డి గణేష్ సన్మానం అంటే అది సూర్యాపేటకు చేసుకున్న సన్మానంగా భావించాలని ఈ సన్మాన కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత వాగ్దాటి అనంత శ్రీరామ్ రావడం మన అదృష్టంగా భావించాలని, అనంత శ్రీరామ్ సందేశం కూడా వినడానికి పెద్ద సంఖ్యలో రావాలని అన్నారు.గతంలో పెద్దిరెడ్డి గణేష్ సూర్యాపేట పట్టణానికి సుద్దాల అశోక్ తేజ, ఎస్పీ బాలసుబ్రమణ్యం, గొల్లపూడి మారుతీ రావు ,తనికెళ్ల భరణి వంటి ప్రముఖులను తీసుకొని వచ్చి సాంస్కృతి కార్యక్రమాలునిర్వహించారని గత 20 ఏళ్లుగా సుధా బ్యాంకు ద్వారా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి రాజా,కక్కిరేణి చంద్రశేఖర్,తోట శ్యాం ప్రసాద్,అప్పం శ్రీనివాసరావు,మిన్న శివరామకృష్ణ తికుళ్ళ సాయి రెడ్డి ఇరిగి కోటేశ్వరి బొలిశెట్టి మధు,తోట సత్యనారాయణ, గాలి శ్రీనివాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మన అగ్రిటెక్ సేవలు భేష్.

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై12:వరంగల్ ఎనమాముల మార్కెట్ లో ఆధునిక వ్యవసాయ పరికరాలతో నెలకొల్పబడిన మన అగ్రిటెక్ సంస్థను శనివారం వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారిని అనురాధ సందర్శించారు. ఈ సందర్భంగా మన అగ్రిటెక్ లో ఏర్పాటు చేసిన ఒక్కో స్టాల్స్ ను జిల్లా వ్యవసాయ అధికారులు అనురాధ,వారి బృందం వీక్షించారు.ఈ సందర్భంగా సంస్థ అధినేత పాషికంటి రమేష్ స్టాల్స్ లో ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ పరికరాలను వాటి పనితీరును క్లుప్తంగా వారికి వివరించారు.ఆధునిక వ్యవసాయంలో మన అగ్రిటెక్ ద్వారా గత 8 సంవత్సరాలుగా రైతులకు అందిస్తున్న సేవలను ఛాయాచిత్రాల ద్వారా వారికి వివరించారు.రైతుల కోసం మన అగ్రిటెక్ ద్వారా ఎన్నో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఆధునిక వ్యవసాయం పట్ల పూర్తి అవగాహన కల్పిస్తూ వారికి కావాల్సిన పరికరాలను




ఎలాంటి లాభాపేక్ష లేకుండా దళారుల దరిచేరకుండా నేరుగా రైతులకు అందించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామన్నారు .మునుముందు తాము అందిస్తున్న ఆధునిక వ్యవసాయ పరికరాలకు రైతులకు కావాల్సిన సబ్సిడీ కల్పించి తోడ్పాటునందించాలని మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్ కోరారు.ఈ సందర్భంగా జిల్లా అధికారి అనురాధ సానుకూలంగా స్పందించారు. సంస్థలో ఉన్న ఉద్యోగులు అందరూ చూసిన జిల్లా అధికారి రైతులకు కావాల్సిన అన్ని రకాల పరికరాల పట్ల పూర్తి అవగాహన కల్పిస్తూ రైతులకు తోడ్పాటు నందించాలని కోరారు.అగ్రిటెక్ ద్వారా అందిస్తున్న సేవల పట్ల అధికారులు అధినేత పాషికంటి రమేష్ ను అభినందించారు.

# ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి జగదీష్ రెడ్డే

## -తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ,సమన్వయ కర్త వట్టె జానయ్య యాదవ్



సూర్యపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై12:ఫోన్ టాపింగ్ సూత్రధారి జగదీశ్వర్ రెడ్డి నని తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ సమన్వయ వట్టె ఒట్టే జాన యాదవ్ శనివారం ఆయన నివాసంలో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ మీద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఈ నెల 14 వ తేదీన వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని సమాచారం ఇచ్చిందని,ఆ రోజు అన్ని ఆధారాలు సిట్ కు ఇస్తానని అయన అన్నారు.

బీసీ నాయకుల ఎదుగుదలను జగదీష్ రెడ్డి జీర్ణించుకోలేదని అందుకే తనని అణచివేయడానికి అక్రమ కేసులు పెట్టి,నా అనుచరుల ఫోన్లన్నీ జగదీష్ రెడ్డి ట్యాప్ చేయించి పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికల ముందు తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడని జానయ్య అన్నారు.జగదీష్ రెడ్డికి శిక్ష పడేంత వరకు పోరాటం చేస్తానని,ఉమ్మడి నల్గొండ జిల్లాలో అభివృద్ధి పేరుతో అడ్డగోలు దోపిడీకి జగదీష్ రెడ్డి పాల్పడ్డాడని జానయ్య యాదవ్ ఆరోపించారు.ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, కుంభం నాగరాజు,వల్లాల సైదులు యాదవ్, కుంభం వెంకన్న, మీర్ అక్బర్,సుంకర బోయిన రాజు,బొల్లె సైదులు, పెద్దబోయిన జానకిరాములు,ఆవుల అంజయ్య,సూపర్ సైదులు,ఉప్పల మల్లయ్య కడంపెర్ల చంద్రయ్య,లింగాల సైదులు ,ముక్కాల లింగయ్య, వట్యాల శేఖర్, ఉపేందర్,చింతకాయల జానయ్య,వల్లాల బుచ్చయ్య యాదవ్,ఆవుదొడ్డి శ్రీకాంత్,చింత సైదులు, గుంటూరు విజయ్,వట్టె లింగరాజు యాదవ్, ఉప్పునూతల కోటేష్, ఉప్పల మల్లయ్య,దాసరి కిరణ్, బంగారి అనిల్,మంద లింగరాజు, ఒరే కవిత,దాసరి నగేష్,పవన్, గణేష్ఏర్పుల రాజు, మహేష్,సుమన్,జడల నాగరాజ్, ధరావత్ రాజు,మాలోత్ నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ను ఆమోదించిన క్యాబినెట్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 12: బీసీలకు 42% రిజర్వేషన్ ను క్యాబినెట్ ఆమోదించినందుకు సీఎం గౌ. శ్రీ రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు గౌ. శ్రీ షబ్బీర్ అలీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాచారెడ్డి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం దగ్గర టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.సబ్బండవర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ధ్యేయం: మాచారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలోత్ నౌశిలాల్ నాయక్ మాట్లాడుతూ,సబ్బండ వర్ణాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం పని చేస్తుందని ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రివర్గంతో పాటు, పార్టీ అధ్యక్షున్ని బీసీ వర్గానికి కేటాయించి కాంగ్రెస్ చిత్తశుద్ధిని నిరూపించుకుందని పేర్కొన్నారు. పేద బడుగు బలహీన వర్గాల సొంతింటి కలను నెరవేరుస్తూ పేదల గుండెల్లో నిలిచిపోయిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొని ఆడారు. గత ప్రభుత్వ హయాంలో మహిళలను కించపరుస్తూ మంత్రివర్గంలో ఒక పదవి కూడా ఇవ్వని నియంత ప్రభుత్వం కేసీఆర్ అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే స్వేచ్ఛకు మారుపేరని అన్నారు. దొరల పాలనలో సబ్బండ వర్ణాలు అణిగిపోయాయని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రక్రియను కామారెడ్డి లోని గౌరవ షబ్బీర్ అలీ ఇంట్లో ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికల హామీలో భాగంగా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. అమలును జీర్ణించుకోలేకనే ప్రతిపక్షాలు దయ్యాలు వేదాలను వల్లించినట్లు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పిన బి.ఆర్.ఎస్ కు బుద్ధి రావడం లేదని ఎదవ చేశారు. ఇకనైనా ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వానికి సూచనలు ఇస్తూ ప్రతిపక్ష హెూదాను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సునావత్ గణేష్ నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, బన్సీ లాల్ నాయక్, రావుల ప్రభాకర్, సదర్ నాయక్ ,ఎన్ ఎస్ యు అధ్యక్షులు బద్రి సతీష్, సంజీవ్ కుమార్,తిరుపతి, రవి, రవీందర్, ప్రకాష్,బన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఘన సన్మానం




సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 12:లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ఇటీవల జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షలో అద్భుత విజయాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఐటీ ఖరగ్పూర్లో సిఎస్ఇ సీటు పొందిన బట్టు ఆశ్రితవల్లి, ఐఐటీ మద్రాస్లో మెకానికల్ ఇంజినీరింగ్ సీటు పొందిన రమావతి సుకుమార్, త్రిబుల్ ఐటీ బాసర సీటు పొందిన జడ్పీహెచ్ఎస్ పెంచిపెంచికల్దిన్న పాఠశాలకు చెందిన సద్దల గీతిక లను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన గీతికకు లయన్స్ క్లబ్ తరఫున రూ.8000/- ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది క్లబ్ అధ్యక్షులు లయన్ గుండ్రెడ్డి సైదిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "లయన్స్ క్లబ్ ఎప్పుడూ సేవాధోరణితో ముందుంటుంది ముఖ్యంగా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మద్దతుగా నిలవడమే మా లక్ష్యంమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా చైర్పర్సన్ మధు,ప్రభాకర్ రెడ్డి, జడ్పీహెచ్ఎస్ పెంచికల్ దీన్నే ప్రధానోపాధ్యాయులు ఎల్ శ్రీనివాసరావు క్లబ్ కార్యదర్శి షేక్ యూసుఫ్,కోశాధికారి నాగేశ్వరరావు నరికొప్పుల,సీనియర్ సభ్యులు శ్రీరామ్ రెడ్డి,కందిబండ శ్రీనివాస్ రావు,గుండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మెడిసిటీ హాస్పిటల్, ఘనపూర్, మేడ్చల్ లయన్స్ క్లబ్ ఆఫ్ రామాయంపేట స్నేహబందు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిభిరం

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 12: శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బతుకమ్మ కుంట ఉర్దూ భవన్ ఫంక్షన్ హాల్ దగ్గర ఉదయం 09 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.










ఈ వైద్య శిభిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు చెవి,ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనథులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు,చర్మ సమస్యలు,మోకాళ్ళ నొప్పులు,నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలపై శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో దాదాపు 387 మంది పాల్గొన్నారు. 80 వేల రూపాయల విలువ గల మందులు ఉచితంగా పంపిణీ చేయటం జరిగింది. 65 మంది కంటి శాస్త్ర చికిత్స (ఆపరేషన్) త్వరలోనే ఉచితంగా చేస్తామని ఆసుపత్రి వారు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్నేహ బంధు హెల్త్ క్యాంపు చైర్ పర్సన్ దామోదర్ రావు, సభ్యులు హనుమంతురావు, బాలరాజు, శ్రీకాంత్, సాయి, సందీప్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను సన్మానించిన నేరేడుచర్ల బిజెపి నాయకులు



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 12:రాష్ట్ర బిజెపి ఆదేశాల మేరకు గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల బిజెపి కార్యాలయంలో పట్టణ మరియు మండల బిజెపి అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్ రెడ్డి ల అధ్యక్షతన జరిగిన గురుపూజోత్సవ సన్మాన కార్యక్రమంలో వివిధ రంగాలు అయిన వ్యవసాయం పోలిశెట్టి లక్ష్మీ, విద్యారంగం పోరెడ్డి శ్రీరాంరెడ్డి, క్రీడారంగం నామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పత్రికారంగం తడకమల్ల స్వామి, యోగ గురువు గన్నా నర్సయ్య, అర్చకత్వం ఇరువంటి శ్రీనివాస శర్మ, చిత్రలేఖనం ఇంజమూరి చందు, ఆరోగ్యశాఖ ఆశావర్కర్ నకెరకంటి యశోద, సన్నాయి మేళ్ళం కామల్లి ఎంకులు, గానకళ దొంతగాని వెంకటేశ్వర్లు, కోలాటం తాళ్ల ఇంద్రారెడ్డి, చోదక వృత్తి రువ్వ నరసయ్య , కార్మికరంగం వట్టె దేవమ్మ, రంగస్థల రంగం గొట్టె వెంకటేశ్వర్లు లకు బిజెపి కుటుంబ సభ్యులు గౌరవంగా శాలువాతో సన్మానించి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు మాట్లాడుతూ సన్మానం చేసింది కేవలం ఇక్కడికి వచ్చిన వ్యక్తులకు మాత్రమే కాదని,వారి రంగాలకు చెందిన ప్రతి ఒక్కరికి అని,ఇకనుంచి మీరు మీ రంగాలలో మరింత మందిని ప్రతిభావంతులను చేస్తూ సమాజానికి మీ వంతుగా తోడ్పాటు అందించి దేశ అభివృద్ధికి, ఐక్యత కు పాటుపడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు పల్లెపంగు వీరబాబు, కాలం నాగయ్య, ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు జూలూరి అశోక్, గంధం శావయ్య, సీనియర్ నాయకులు బాల వెంకటేశ్వర్లు, ఉరిమళ్ళ రామ్మూర్తి, కార్యదర్శి బుస్సా విమల, మండల శక్తి కేంద్ర ఇన్చార్జులు ఆకుల జగతయ్య, నందిపాటి హిందూజా, పుల్లెంల సతీష్, బూత్ అధ్యక్షులు చెంచల కిరణ్, పట్టణ, మండల నాయకులు నారద మోహన్ రెడ్డి,కార్యకర్త వినయ్, కృష్ణవేణి,ఆఫీస్ ఇన్చార్జి దేవిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లు పెంచేంతవరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై తమ పోరాటం ఆగదు

## -భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 12:సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి సూర్యాపేట జిల్లా ఇన్చార్జి గడ్డం ఖాసిం ఆధ్వర్యంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షులు పేర్ల సోమయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన చేయూత పెన్షన్దారుల సమావేశంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పిసిసి అధ్యక్షుని హెూదాలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అదే నెల నుంచే వికలాంగుల పింఛను 6000/- వృద్ధులు వితంతువులు బీడీ కార్మికులు గీతా కార్మికులు ఒంటరి మహిళల పింఛన్లను 4వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పాలన పూర్తయిన పింఛన్దారులకు ఇచ్చిన హామీ మేరకు, నేటికీ పింఛన్లు పెంచకుండా కాలయాపన చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న తీరు దురదృష్టకరమని అన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అడుగడుగున వికలాంగుల సమాజంపై వివక్ష ప్రదర్శిస్తూ వికలాంగుల సమాజాన్ని చిన్నచూపు చూస్తున్న తీరు తమ వికలాంగుల సమాజాన్ని ఎంతో ఆవేదనకు గురి చేస్తుందని అన్నారు.ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్ 6000 పెంచడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని, వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి ప్రత్యేక శాఖగా కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.అనేక హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేటికీ వికలాంగుల సమాజానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని తీరు నిరసిస్తూ ముఖ్యంగా చేయూత పింఛన్దారులకు ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛలను అన్నింటిని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే పోరాటానికి భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ పక్షాన సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ మద్దతులో భాగంగానే ఈ నెల 14న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే చేయూత పెన్షన్ దారుల జిల్లా సదస్సుకు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు,కార్యకర్తలు మరియు చేయూత పెన్షన్ దారులైన వృద్ధులు, వితంతువులు,వికలాంగులు బీడీ కార్మికులు, గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విహెచ్పిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చింత సతీష్, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి పెన్పహాడ్ మండల ఉపాధ్యక్షులు గుండు శ్రీనివాస్, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి సంఘం పెన్పహాడ్ మండల ప్రధాన కార్యదర్శి గార్లపాటి వెంకట్ రెడ్డి, మహిళ నాయకురాలు హుస్సేన్ బి తదితరులు పాల్గొన్నారు.

# కేసులు పెట్టి బెదిరించి పార్టీ మారమని చెప్పడం ఎక్కడి న్యాయం,ఎక్కడి ప్రజా పాలన: ఒంటెద్దు నరసింహారెడ్డి

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 12:కృష్ణ బేసిన్ లో నీళ్ల వాటా పై సీఎం రేవంత్ కు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కి అసలు అవగాహనే లేదని, ముఖ్యమంత్రికి బేసిన్లు, నీళ్ల మంత్రికి బేసిక్ తెలవదని హుజూర్ నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి ఎద్దేవా చేశారు. ఖరీఫ్ మొదలై నెల గడుస్తున్నా ఎడమ కాలువకు నీరు ఇంతవరకు విడుదల చేయలేదని,త్వరితగతిన ఎడమ కాలువకు నీటిని విడుదల



చేయాలని సూచించారు. నీటి వాటాల విషయంలో చంద్రబాబుకు మేలు జరిగే విధంగా నీటిని వదులుతూ తెలంగాణకి అన్యాయం చేస్తున్నారన్నారు. మిర్యాలగూడ, హుజూర్ నగర్, కోదాడ రైతులకు నీరు ఇవ్వకుండా ఎండగట్టి, పోలీసులను పెట్టి ఖమ్మం, నూజివీడు ప్రాంతాలకు నీటిని తరలించుకుపోవడం దారుణం అన్నారు. తెలంగాణకు ఉమ్మడి రాష్ట్రంలోనే 960 టీఎంసీల నీరు కేటాయించారని వరద జలాలు 3 వేల టీఎంసీల నీరుంటే 1950 టీఎంసీల నీరు తెలంగాణకి కావాలని ఆనాడే కె ఆర్ ఎం బి కి లేఖ రాసి కెసిఆర్ కొట్లాడటం జరిగిందన్నారు. రేవంత్ ఏమో 1000 టీఎంసీలుచాలంటున్నాడు. ఎవరు తెలంగాణ ప్రజల కోసం కొట్లాడుతున్నారో తెలంగాణ ప్రజలకు అర్థమవుతుందన్నారు. హుజూర్ నగర్ లోని అన్ని మండలాల్లో బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారనిఅన్నారు. అందుకే కెసిఆర్ వరంగల్ మీటింగ్ లో మళ్ల మేము వచ్చాక ఒక్కొక్కరి అంతు చూస్తామని చెప్పారని, స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుంటే కేసులు పెట్టి బెదిరించి పార్టీ మారమని చెప్పడం ఎక్కడి న్యాయం, ఎక్కడి ప్రజా పాలన అని బీసీ రిజర్వేషన్ల పేరుతో బీసీలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సర్పంచి, ఎంపిటిసిల పదవి కాలం ముగిసి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటి, కాంగ్రెస్ ప్రజల చేత పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలోబిఆర్ఎస్ పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గ నాయకులు మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి , సీనియర్ నాయకులు డాక్టర్ కె ఎల్ ఎన్ రెడ్డి, గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్, మాజీ ఎంపీటీసీ చికూరి రాజారావు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గువ్వల వీరన్న, మాజీ పిఎసిఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంబి రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు మల్లెపల్లి నరసింహారావు, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు మాశెట్టి శ్రీహరి, గ్రామ పార్టీ అధ్యక్షులు హుస్సేన్ మియా, మండల యూత్ అధ్యక్షులు వీరమల్ల సుందరయ్య, మాజీ సర్పంచులు కీత జయమ్మ, ధన మూర్తి, అద్దంకి సైదేశ్వర రావు, బొలిశెట్టి సుధీర్, మాజీ ఎంపీటీసీలు కడియం వెంకట్ రెడ్డి, పిడమర్తి అంజి, శోభన్, మండల అధికార ప్రతినిధి రామ్ సైదులు, చికూరి నారాయణ, నగరికంటి కోటయ్య, వీరబాబు, మౌలానా, రాఘవయ్య, ప్రభాకర్, సత్యనారాయణ, దస్తగిరి, పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బాసర ఐఐఐటి ని అభివృద్ధి చేస్తాం మంత్రి కొండా సురేఖ.

భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 12: నిర్మల్ జిల్లా బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జీ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ)ని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం ఆమె బాసర పర్యటన సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధిపై ఆర్జీయూకేటీలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంలో ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. బాసర ఐఐఐటీలో విద్యార్థులకు ఉత్తమ వసతులు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన విద్యా విధానాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. దేశంలోని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు ఈ యూనివర్సిటీ ప్రతిష్ఠను పెంచుతున్నారని తెలిపారు. యూనివర్సిటీలో ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, బోధన, బోధనేతర అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. త్వరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.3.20 లక్షల వ్యయంతో 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్' ప్రారంభం



కానుందని పేర్కొన్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్జీయూకేటీ ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్, ఆర్డీఓ రత్న కళ్యాణి, ఇతర అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో ఫొరెన్సిక్ వైద్యుల పాత్ర ప్రధానం



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై12:నేర నిరోధం లోగాని, విచారణలో గాని ఫోరెన్సిక్ నిపుణులు సమాజానికి ఎంతో సహాయకారిగా ఉండి వారి సేవలను అందిస్తారని తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ జనరల్ సెక్రెటరీ మరియు కాకతీయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ లక్ష్మణరావు అన్నారు. కాకతీయ వైద్య కళా శాల ఎన్ఆర్ ఐ భవన్లో రెండు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సు ముగింపు శనివారం జరిగింది. ముగింపు ఉపన్యాసం చేస్తూ డాక్టర్ లక్ష్మణ్ రావు... నేరం జరిగిన ప్రదేశం లో ఆధారాల సేకరణ, నేర సంబదీకుల భౌతిక ఆధారాల సేకరణ, కోర్టుల్లో జరిగే విచారణ ప్రక్రియలో సహాయం అందించడం ద్వారా ఫోరెన్సిక్ వైద్యులు తమ సేవలను సమాజానికి అందిస్తారన్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో నేరాలను నిరోధించే ప్రక్రియలో కూడా ఈ నిపుణులు తమ సేవలను అందిస్తారని కొనియాడారు. రెండు రోజులపాటు జరిగిన చర్చ సమావేశాల ద్వారా నైపుణ్యాలను పెంచుకున్న వైద్యులు తమ సేవలను మరింతగా అందించాలని పిలుపునిచ్చారు. సదస్సుల్లో కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య, ఫోరెన్సిక్ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అభిజిత్ సుబేదా, ఉస్మానియా ఆస్పత్రి ఫోరెన్సిక్ వైద్యవిభాగాధిపతి డాక్టర్ శ్రీధరరాచారి, గాంధీ ఆస్పత్రి వైద్య విభాగాధిపతి డాక్టర్ కృపాసింగ్, మేజర్ డాక్టర్ నవీన్, కాకతీయ మెడికల్ కళాశాలతో సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన ఫోరెన్సిక్ డాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం ఫోరెన్సిక్ డాక్టర్ల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

# మందులు మరింత వేగంగా ఆవిష్కరిద్దాం


మానవ శరీరంలో ప్రోటీన్లు ఎలా ప్రవర్తిస్తాయో కనుగొనే ప్రక్రియను వేగవంతం చేసే కృత్రిమ మేధ (ఏఐ) వ్యవస్థ 'బయోఇము'ను మైక్రోసాఫ్ట్ ఆవిష్కరించింది. సాధారణ పద్ధతుల్లో ఈ అధ్యయనానికి ఏళ్ల కొద్దీ సమయం పడుతుంది. ఏఐతో కొన్ని గంటల్లోనే అధ్యయనం చేయొచ్చని.. తద్వారా ఔషధాలను త్వరగా ఆవిష్కరించొచ్చని మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల శుక్రవారం 'ఎక్స్'లో ప్రకటించారు. 'జీవ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రోటీన్ల కదలికలనూ అర్థం చేసుకోవాలి. ఇందు కోసం బయోఇము అనే ఏఐ వ్యవస్థను మేం తీసుకొచ్చాం. ఏళ్లకొద్దీ పట్టే అధ్యయన ప్రక్రియలను, గంటల్లో ఇది పూర్తి చేస్తుంది. ఈ రంగంలో ఇదొక గొప్ప పురోగతి' అని ఆయన పేర్కొన్నారు.

ఏం చేస్తుందీ బయోఇము: ప్రోటీన్లలో ఉండే వివిధ పరిమాణాలు, వాటి కదలికల (కన్ఫర్మేషనల్ ఛేంజెస్)ను అంచనా వేసే సామర్థ్యం ఈ ఏఐ వ్యవస్థకు ఉంటుంది. మానవ శరీరం లోపలి భాగాల్లో ప్రోటీన్లు ఎలా పనిచేస్తున్నాయన్నది అర్థం చేసుకుంటే రోగం ఎలా ఉంది, అందుకు కారణమైన నిర్దిష్ట, లక్షిత ప్రోటీన్ల కోసం కొత్త ఔషధాలను ఎలా తయారు చేయాలి అన్నది అర్థమవుతుంది.

భారీ సమాచారం ఆధారంగా పనిచేస్తుంది..

# 'అదానీ హెల్త్‌కేర్ టెంపుల్స్' వస్తున్నాయ్

ముంబయి: అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ, ఆరోగ్య సంరక్షణ రంగంలోకీ విస్తరిస్తున్నారు. తొలుత




ముంబయి, అహ్మదాబాద్‌లలో 1000 పడకల ఆసుపత్రులను నిర్మించనున్నారు. 'అదానీ హెల్త్‌కేర్ టెంపుల్స్' కింద రానున్న ఈ ఆసుపత్రులు కృత్రిమ మేధ(ఏఐ)తో, ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలతో, అందుబాటు ధరల్లో సేవలందిస్తాయని శుక్రవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో గౌతమ్ అదానీ వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధికి తన కుటుంబం రూ.60,000 కోట్లు వెచ్చించనుందని, మూడేళ్ల క్రితం తన 60వ జన్మదినోత్సవం సందర్భంగా అదానీ ప్రకటించిన సంగతి విదితమే. ఇందులో భాగంగానే అత్యాధునిక సదుపాయాలతో ఆసుపత్రులు నెలకొల్పుతున్నట్లు వివరించారు.

ఈ రంగంలో విప్లవమే తెస్తాం: 'ఆరోగ్యసంరక్షణ రంగంలో వృద్ధి సరైన స్థాయిలో లేదనే మేం వస్తున్నామ'ని గౌతమ్ అదానీ అన్నారు. 'భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఇందులో వేగాన్ని తీసుకురావడమే మా పని. ఆరోగ్యసంరక్షణ వ్యవస్థకు ప్రస్తుత నవీకరణ సరిపోదు. వ్యవస్థ మొత్తాన్ని మార్చాల్సి ఉంది. ఇందులో ఒక విప్లవమే తీసుకురావాల్సి ఉంద'ని పేర్కొన్నారు.

డాక్టర్లకు ఏఐలోనూ శిక్షణ: అహ్మదాబాద్, ముంబయిలలో ఏర్పాటు చేసే ఏకీకృత 1000 పడకల క్యాంపస్‌లు క్లినికల్ కేర్, రీసెర్చ్ అండ్ అకడమిక్ ట్రైనింగ్‌కి 'సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా పనిచేస్తాయన్నారు. డాక్టర్లు రోబోటిక్స్, ఏఐ (కృత్రిమమేధ), సిస్టమ్స్ థింకింగ్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లోనూ నైపుణ్యం సాధించేలా చేస్తామన్నారు.

# విద్యుత్తు ట్రక్కు కొంటే రూ.9.6 లక్షల ప్రోత్సాహం

దిల్లీ: విద్యుత్తు ట్రక్కు కొనుగోలు చేసేవారికి రూ.9.6 లక్షల వరకు ప్రోత్సాహకాలు ఇచ్చే తొలి పథకాన్ని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి శుక్రవారం ఆవిష్కరించారు. విద్యుత్తు వాహనాల తయారీ, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన పీఎమ్ ఇ-డ్రైవ్ పథకానికి రూ.10,900 కోట్ల కేటాయింపులుండగా.. అందులో రూ.500 కోట్లు విద్యుత్తు ట్రక్కుల విభాగానికి అందించనున్నారు.



ఎవరికి ప్రయోజనం

పోర్టులు, లాజిస్టిక్స్, సిమెంటు, ఉక్కు తదితర రంగాలు ఈ పథకం నుంచి ప్రయోజనం పొందొచ్చు. తొలి 5,600 విద్యుత్తు ట్రక్కుల వరకు ఈ మద్దతు ఉంటుంది.

ఎందుకంటే

దేశీయంగా ఉన్న మొత్తం వాహనాల సంఖ్యలో డీజిల్ టక్కుల వాటా 3 శాతమే అయినా.. రవాణా సంబంధిత ఉద్గారాల్లో 42% వాటా వీటిదే. ఇది వాయు కాలుష్యానికి దారి తీస్తోంది. 2047 కల్లా 'వికసిత్ భారత్' దిశగా, స్వచ్ఛమైన భవిష్యత్తు దిశగా దేశం అడుగులు వేసేందుకు ఈ కొత్త పథకాన్ని కేంద్రం తీసుకొచ్చినట్లు కుమారస్వామి పేర్కొన్నారు. రవాణా ఉద్గారాలను 2070 కల్లా సున్నాకు చేర్చాలన్నది లక్ష్యం.

దిల్లీకే ప్రాధాన్యత

దిల్లీలో రిజిస్టర్ అయిన 1,100 ఇ ట్రక్కులకు రూ.100 కోట్ల వరకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. దిల్లీలో ప్రమాదకరంగా మారిన వాయు నాణ్యతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

10,900 ఇ- బస్సులు

పీఎమ్ ఇ- డ్రైవ్ పథకం కింద బెంగళూరుకు 4500, దిల్లీకి 2800, హైదరాబాద్‌కు 2000, అహ్మదాబాద్‌కు 1000, సూరత్‌కు 600 చొప్పున ఇ-బస్సులను మంత్రిత్వ శాఖ మంజూరు చేసినట్లు కుమారస్వామి తెలిపారు.

పాత ట్రక్కులను తుక్కు కిందకు చేస్తేనే ఈ ప్రోత్సాహకాలు ఇస్తారు. పీఎమ్ ఇ-డ్రైవ్ పోర్టల్‌లో ముందు ఎవరు నమోదు చేసుకుంటే వారికే ఇవి అందుతాయి.

## అరుదైన భూఅయస్కాంతాల ఉత్పత్తికి రూ.1,345 కోట్ల ప్రోత్సాహక పథకం!

దిల్లీ: మనదేశంలో అరుదైన భూఅయస్కాంతాల (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్) ఉత్పత్తికి సబ్సిడీ ఇచ్చేందుకు రూ.1,345 కోట్ల ప్రత్యేక పథకాన్ని తీసుకువచ్చేందుకు అంతర్ మంత్రిత్వ శాఖలు చర్చలు జరుపుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు తయారీదార్లకు ఈ ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతిపాదించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. భూఅయస్కాంతాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో, దేశీయంగా వాహన - ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాలు ఇబ్బంది పడుతుండటం ఇందుకు నేపథ్యం. ఈ ప్రోత్సాహక పథకం కింద, అరుదైన భూ ఆక్సైడ్‌లను మ్యాగ్నెట్లుగా మార్చే ప్రక్రియ మొత్తానికి మద్దతు ఇవ్వనున్నారు. చర్చలు పూర్తయ్యాక, ఈ ప్రతిపాదనలను మంత్రిమండలి అనుమతికి తీసుకెళ్లొచ్చని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

# ఏటీఎం ఆలోచన ఎలా పురుడుపోసుకుందో తెలుసా?



ఆటోమేటెడ్ టెల్లర్ మెషిన్ .. దీని గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అంతగా మన రోజువారీ జీవితాల్లో భాగమైపోయింది. డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరిగిన ఈ కాలంలోనూ.. ఇవి లేని రోజుల్ని ఊహించడం కష్టం. బ్యాంకు లైన్‌లో గంటల తరబడి క్యూలో నిల్చొనే అవసరం లేకుండా చేసిన ఈ యంత్రం ఆవిష్కరణ నిజంగా మానవాళికి దొరికిన వరమనే చెప్పాలి. అలాంటి ఈ మెషీన్ రూపొందించాలన్న ఆలోచన ఎలా పురుడుపోసుకుందన్నదీ ఆసక్తికరమే. దాని వెనుకా ఓ కథ దాగుంది.

1967లో లండన్‌లో తొలి ఏటీఎం ఏర్పాటైంది. బార్‌క్లేస్ బ్యాంక్ బ్రాంచ్ బయట దీన్ని ఏర్పాటు చేశారు. బ్రిటిష్ టీవీ నటుడు రెగ్ వార్నీ అప్పట్లో ప్రారంభించారు. తొలినాళ్లలో ఈ ఏటీఎం నుంచి గరిష్ఠంగా 10 పౌండ్లు మాత్రమే ఉపసంహరించుకోవడానికి వీలుండేది. క్యూలో గంటలు గంటలు నిల్చుని బ్యాంకులో నగదు ఉపసంహరించుకోవడంతో పోలిస్తే ఇది పెద్ద మొత్తమనే చెప్పాలి. అలా బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చిన ఏటీఎంలు.. నేడు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి.

సెలవు రోజు మాటేంటి?

జాన్ షెఫర్డ్ బారన్ అనే వ్యక్తి ఈ ఏటీఎంను రూపొందించారు. లండన్‌లోని ఓ బ్యాంకు వద్ద నగదు కోసం ప్రజలు పోటీపడడాన్ని షెఫర్డ్ గమనించారు. నగదు అవసరమైనప్పుడు తాను వ్యక్తిగతంగా ఇబ్బంది ఎదుర్కొన్నారు. తన స్వీయ అనుభవం బ్యాంకు గంటలకు మించి నగదును అందుబాటులో ఉంచే యంత్రం గురించి ఆలోచించేలా చేసింది. ఈ క్రమంలో చాక్లెట్ బార్‌లను విక్రయించే వెండింగ్ మెషీన్ ఆయనకు గుర్తొకొచ్చింది. చాక్లెట్ల స్థానంలో నగదు ఎందుకు ఉండకూడదన్న ఆలోచన చేశారు. ఈ ఆలోచనతో 24/7 నగదు ఉపసంహరణకు అనుమతించే ఒక యంత్రాన్ని రూపొందించారు. అలా రూపుదిద్దుకున్న క్యాష్ మెషీనే.. నేడు ఏటీఎంగా మారింది.

ఇంకో విషయం ఏంటటే స్కాట్‌లాండ్‌కు చెందిన జాన్ షెఫర్డ్ బారన్ పుట్టింది భారత్‌లోనే. ఆయన తల్లిదండ్రులు బ్రిటిషర్లు. ఉద్యోగరీత్యా ఆయన తండ్రి బ్రిటిష్ ఇండియాలో విధులు నిర్వర్తించారు. 1925 జూన్ 23న నేటి మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో షెఫర్డ్ జన్మించారు. ఆయన జ్ఞాపకార్థం ఆస్పత్రి వెలుపల 2021 ఆగస్టులో ఎస్‌బీఐ ఓ ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

భారత్‌లో ఇక్కడే..

భారత్‌లో ఏటీఎం ప్రస్థానం 1987లో ప్రారంభమైంది. ముంబయిలో హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు శాఖలో తొలి ఏటీఎం ఏర్పాటైంది. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయం ఇక్కడే ప్రారంభమైంది. తర్వాతి కాలంలో దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించాయి. 1999 నాటికి దేశంలో కేవలం 800 ఏటీఎంలు ఉండగా.. 2024 నాటికి ఆ సంఖ్య 2 లక్షల పైమాటే. తొలినాళ్లలో కేవలం నగదు విత్‌డ్రాకు మాత్రమే పనికొచ్చిన ఈ ఏటీఎంలు అకౌంట్ బ్యాలెన్స్ తెలుసుకోవడం, స్టేట్‌మెంట్, పిన్ జనరేషన్, కార్డు లెస్ విత్‌డ్రా వంటి సేవలను అందిస్తున్నాయి.

# ఆన్‌లైన్ సీఓపీపీ తప్పనిసరి చేయడం నష్టదాయకం

హైదరాబాద్: మందులు ఎగుమతి చేసే ఫార్మా కంపెనీలు సీఓపీపీ (సర్టిఫికేట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రోడక్ట్) దరఖాస్తులను ఓఎన్‌డీఎల్ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్లో మాత్రమే దాఖలు చేయాలని (ఆన్‌లైన్ సీఓపీపీ) నిర్ణయించడంపై ఫార్మెగ్జిల్ (ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్) ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల మందుల ఎగుమతులపై వ్యతిరేక ప్రభావం పడుతుందని ఫార్మెగ్జిల్ డైరెక్టర్ జనరల్ కె.రాజా భాను ఆందోళన వెలిబుచ్చారు. రెస్ట్ ఆఫ్ ద వరల్డ్ (ఆర్ఓడబ్ల్యూ) దేశాలకు ఎగుమతులు తగ్గే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మనదేశం ఎగుమతి చేస్తున్న మందుల్లో ఆర్ఓడబ్ల్యూ దేశాల వాటా 45% కావడం గమనార్హం. ఔషధ నియంత్రణ కార్యకలాపాలను డిజిటల్ పద్ధతిలో నిర్వహించాలని, ఆధునికీకరించాలని నిర్ణయించడం సరైనదే అయినా.. ఇప్పటికిప్పుడు దీన్ని అమలు చేయడం కష్టసాధ్యమని వివరించారు. దీనివల్ల ఎగుమతిదార్లపై పెనుభారం పడుతుందని అన్నారు. ఈ నిబంధన అమలుకు కొంత గడువు ఇవ్వాలని సీడీఎస్‌సీఓ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్)ను, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖను కోరినట్లు తెలిపారు. ఒకేసారి కాకుండా, దశల వారీగా దీన్ని అమల్లోకి తీసుకురావాలని సూచించారు. మరికొన్ని సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. ఎన్నో ఏళ్లుగా దేశీయ మార్కెట్లో అందుబాటులో ఉన్న ఔషధాల డోసేజీ మార్చి, 'కొత్త ఔషధాలు'గా గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనివల్ల సీఓపీపీ జారీ ఆలస్యం అవుతోందని, తత్ఫలితంగా ఎగుమతులు నిలిచిపోతున్నాయని అన్నారు.

# అదే భారత్‌లో జరిగి ఉంటేనా..?: డ్యూక్స్ బంతుల వివాదంపై గావస్కర్

: ఇంగ్లాండ్ – భారత జట్ల ( మధ్య టెస్టు సిరీస్‌లో ఇప్పుడు బంతులపై చర్చ జరుగుతోంది. డ్యూక్స్ బంతులు త్వరగా తమ ఆకారాన్ని కోల్పోతున్నాయని ఇరుజట్ల ఆటగాళ్లు గగ్గోలు పెట్టారు. తాజాగా లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. రెండోరోజు కొత్త బంతి కేవలం పది ఓవర్లలోపే ఆకారం మారిపోవడం గమనార్హం. బంతిని మార్చే క్రమంలో అంపైర్లు సరిగ్గా వ్యవహరించలేదని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్ సిరాజ్ అసహనం వ్యక్తంచేశారు. దీనిపై టీమ్‌ఇండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఒకవేళ ఇదే పరిస్థితి ఎదురై ఉంటే బ్రిటన్ మీడియా పెద్ద రాద్ధాంతం చేసి ఉండేదని వ్యాఖ్యానించాడు. ఇంగ్లాండ్ మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ కూడా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు.



“మార్చిన బంతిని చూస్తే అదేమీ 10 ఓవర్లు ఆడిన బాల్ మాదిరిగా లేదు. 20 ఓవర్ల కంటే ఎక్కువే అయి ఉండొచ్చు. ఒకవేళ ఇదే బంతి మార్పు అంశం భారత్‌లో జరిగిఉంటే.. కనీసం బంతిని మార్చేంత కూడా లేదా అని బ్రిటీష్ మీడియా దీనిపై పెద్ద రాద్ధాంతం చేసేసేది” అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

## ఇది ఆమోదయోగ్యం కాదు: బ్రాడ్

“క్రికెట్ బంతి ఇలా త్వరగా ఆకారం మారిపోవడం ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు. గతంలో లేనివిధంగా ఇప్పుడు ఎక్కువగా ఈ బాల్స్ గురించి మాట్లాడుతున్నామంటే సమస్య ఉన్నట్లేగా. ప్రతి ఇన్నింగ్స్‌లోనూ బంతిని మారుస్తున్నట్లు కనిపిస్తోంది. డ్యూక్స్ బంతుల్లో ప్రాబ్లమ్ ఉంది. త్వరగా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. బంతి కనీసం 80 ఓవర్ల వరకూ మార్చకుండా ఉండేలా చూడాలి. అంతేకానీ, 10 - 15 ఓవర్లకే మార్చుకుంటూ పోతే ఎలా?” అని స్టువర్ట్ బ్రాడ్ ఎక్స్‌వేదికగా పోస్టు చేశాడు.

## సంస్థ యజమాని ఏమన్నారంటే?

డ్యూక్స్ బంతుల తయారీ సంస్థ యజమాని దిలీప్ జగోడియా మాత్రం విభిన్నంగా స్పందించారు. ‘క్రికెట్ సూపర్‌స్టార్లకు కాస్త ఓపిక అవసరం. వివాదాస్పదమైన అంశం విషయంలో చర్యలు తీసుకొంటాం. మాది 18వ శతాబ్దం నుంచి వస్తోన్న కంపెనీ. ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూనే వస్తున్నాం. ప్రస్తుతం యూకేలో అసాధారణమైన వేడి వాతావరణం కూడా బంతి ఇలా మారిపోవడానికి కారణమై ఉండొచ్చు. ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్లు బరువైన బ్యాట్‌లను వాడుతున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి’’ అని వెల్లడించారు.

# మనం నియంత్రించలేం.. నా మ్యాచ్ ఫీజును పోగొట్టుకోలేను: బుమ్రా

ఇప్పుడందరి నోళ్లల్లో ‘బంతి మార్పు’ అంశమే నానుతోంది. మాజీ క్రికెటర్ల నుంచి ప్రస్తుతం ఇంగ్లాండ్ – భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న ఆటగాళ్ల వరకూ అందరూ దీని పైనే కామెంట్లు చేస్తున్నారు. మరి లార్డ్స్‌లో ఐదు వికెట్లు తీసిన జస్‌ప్రీత్ బుమ్రా (ఎదుట కూడా ఇదే ప్రశ్న ఎదురుకాకుండా ఉంటుందా? ఈవిషయాన్నే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విలేకర్లు అడిగేశారు. అయితే, బుమ్రా ఇచ్చిన సమాధానం హాస్యభరితంగా ఉండటం గమనార్హం.



‘‘బంతిలో మార్పులను నియంత్రించడం కష్టమే. అయితే, ఈ అంశంపై మాట్లాడి నేను నా సొమ్మును పోగొట్టుకోవాలని అనుకోవడం లేదు. చాలా కష్టపడి ఆడా. చాలా ఓవర్లు బౌలింగ్ వేశా. కాబట్టి, ఎలాంటి వివాదాస్పద స్టేట్‌మెంట్లు ఇవ్వదల్చుకోలేదు. అలాగే మ్యాచ్ ఫీజును కోల్పోదల్చుకోలేదు. మనం మార్చలేం. అలాగే పోరాడలేం. కొన్నిసార్లు మనకు అనుకూలంగా నిర్ణయాలు రావు. మరికొన్నిసార్లు వస్తుంటాయి’’ అని వ్యాఖ్యానించాడు. అదే సమయంలో ఓ రిపోర్టర్ ఫోన్ మోగడంతో స్పందించిన బుమ్రా ‘ఎవరి భార్యో ఫోన్ చేస్తున్నారు’ అనడంతో అంతా నవ్వేశారు.

## నితీశ్ సమాధానమే తప్పు: బుమ్రా సరదా రిప్లయ్

మేమంతా బుమ్రా ఏం చెబితే అదే ఫాలో అవుతామని తొలిరోజు అనంతరం యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పాడు. ఆ మాటలను బుమ్రా ఎదుట ప్రస్తావించగా.. సరదాగా స్పందించాడు. “అసలు నితీశ్ చెప్పిన ఆన్సర్ తప్పు. అతడు నన్నేమీ అడగలేదు. అయితే, ఈ యువ క్రికెటర్ చాలా ఆత్మవిశ్వాసంతో ఉంటాడు. మా నుంచి ఇలాంటి కుర్రాళ్లకు మరింత గైడెన్స్ అవసరం లేదు. నా అవసరం ఎప్పుడు ఉన్నా వారికి తప్పకుండా అందుబాటులో ఉంటా. నా అనుభవాలను పంచుకుంటా. ఇక్కడ గత పర్యటనల్లో నేర్చుకున్న అంశాలను వారికి చెబుతా. సింపుల్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తా. అదే వారికీ చెబుతుంటా. ప్రతి విషయంలోనూ కలగజేసుకొని వారికి మరీ ఎక్కువగా చెప్పేయను. నా టెక్నిక్, నా బౌలింగ్ విధానం వారితో పోలిస్తే విభిన్నం. కాబట్టి నేను ఇచ్చే సూచనలు ఒక్కోసారి వర్కౌట్ కాకపోవచ్చు” అని బుమ్రా వ్యాఖ్యానించాడు.

## ఆనర్స్ బోర్డుపై..

“లార్డ్స్ ఆనర్స్ బోర్డులో పేరు ఎక్కడం చాలా సంతోషంగా ఉంది. ప్రతిసారీ కెమెరాలు మనపైనే ఉంటాయి. ప్రాక్టీస్ చేస్తున్నా చుట్టూ ఓ కన్నేసి ఉంటాయి. ఇప్పుడున్న వ్యూస్, సబ్‌స్క్రైబర్ల తరంలో ప్రతిఒక్కరూ తమకంటూ సంచలనం సృష్టించాలని కోరుకుంటారు. వాటిని ఆపడం నా చేతుల్లో లేదు. భారత జెర్సీ వేసుకున్నా, లేకపోయినా మనల్ని జడ్జ్ చేసేవాళ్లు ఉంటారు. ప్రతి క్రికెటర్‌కు ఇది తప్పదు. నేను టీవీల్లో కనిపిస్తున్నంత కాలం గమనించేవాళ్లూ ఉంటారు. సచిన్ తెందూల్కర్ 200 టెస్టులు ఆడినా.. ఇప్పటికీ ఆయనపై చాలామంది తమ అభిప్రాయాలను చెబుతూనే ఉంటారు” అని భారత పేసర్ తెలిపాడు.

# జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు: సిరాజ్

లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్ మహ్మద్ సిరాజ్ రెండు వికెట్లు తీశాడు. ఈసందర్భంగా పోర్చుగల్ ఫుట్‌బాల్ ఆటగాడు డియోగో జోటాకు అంకితమిస్తున్నట్లు హావభావాలు ప్రదర్శించిన సంగతి తెలిసిందే. దానిపై ఇప్పటికే సిరాజ్ స్పందించాడు. దానికి కారణాలేంటో తాజాగా బీసీసీఐ షేర్ చేసిన ఓ వీడియోలో వెల్లడించాడు.



“గత మ్యాచ్ సమయంలో డియోగో జోటా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచినట్లు తెలిసింది. నేను పోర్చుగల్ జట్టు అభిమానిని. అక్కడ క్రిస్టియానో రొనాల్డో ఉన్నాడు. దీంతో నేను కాస్త భావోద్వేగానికి గురయ్యా. జీవితం అంచనాలకు అందనిది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. చాలా వాటి గురించి ఫైట్ చేస్తాం. కానీ, రేపు ఏమవుతుందో ఎవరికీ తెలియదు. లైఫ్‌కు ఎప్పుడూ గ్యారంటీ ఉండదు. నేను రోడ్డు ప్రమాదం గురించి వినగానే షాక్‌కు గురయ్యా. దీంతో లార్డ్స్‌లో వికెట్లు తీసిన తర్వాత అలా అంకితం ఇచ్చా’’ అని వీడియోలో సిరాజ్ పేర్కొన్నాడు. జులై 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో డియోగోతోపాటు అతడి సోదరుడు కూడా ప్రాణాలు కోల్పోయారు.

# ధోనీ ‘వీడ్కోలు’ టెస్టులో ఆసీస్ నుంచి అరంగేట్రం.. ఇప్పుడు ఇటలీకి సారథ్యం

2014 డిసెంబర్ 26.. ఆస్ట్రేలియా – భారత జట్ల మధ్య మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా బాక్సింగ్ డే టెస్టు. కానీ,



అదే ఓ క్రికెట్ దిగ్గజానికి చివరిదని అస్సలు ఊహించలేదు. ఆ మ్యాచ్ ముగియగానే ‘కెప్టెన్ కూల్’ ఎంఎస్ ధోనీ తన సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పేశాడు. ఆ తర్వాత వన్డేలు, టీ20లకు సారథ్యం వహించిన సంగతి తెలిసిందే.

అదే టెస్టు.. భారత క్రికెటర్ కేఎల్ రాహుల్‌కు అరంగేట్ర మ్యాచ్. అతడితోపాటు మరొకరు కూడా డెబ్యూ చేశాడు. కానీ, అతడు ఆస్ట్రేలియా తరపున ఆడాడు. పేరు జో బర్న్స్. కట్ చేస్తే.. 11 ఏళ్ల తర్వాత కేఎల్ రాహుల్ భారత్ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. కానీ, ‘ఆసీస్’ ప్లేయర్ మాత్రం ఆరేళ్లకే టీమ్‌లో చోటు కోల్పోయి ఆటకు గుడ్‌బై చెప్పేశాడు. అప్పుడు కేవలం 23 టెస్టులు మాత్రమే ఆడాడు. ఇక అక్కడ కష్టమని మరో దేశానికి వలస వెళ్లిపోయాడు. ఇప్పుడు ఇవన్నీ ఎందుకంటారా? క్రికెట్‌లో ఇటలీ సరికొత్త చరిత్రకు అతడి సారథ్యంలోనే నాంది పడింది. జో బర్న్స్ 2020లో ఆసీస్ జట్టుకు వీడ్కోలు పలికి.. 2025లో ఇటలీ సారథిగా ఆ జట్టును టీ20 ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించేలా చేశాడు.

## గతేడాది సారథ్యం తీసుకుని..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ యూరప్ రీజియన్ నుంచి ఇటలీ బరిలోకి దిగింది. కనీస పోటీ అయినా ఇస్తుందా? అన్న అనుమానాలు. గతేడాది గెరెత్ బెర్గ్ నుంచి బర్న్స్ జట్టు పగ్గాలు అందుకొన్నప్పుడు ఇటలీ పరిస్థితి ఇదీ. పాయింట్ల పట్టికలో టాప్‌లోకి రాకపోయినా.. కొన్ని విజయాలైనా సాధిస్తే చాలని అక్కడి అభిమానులు సంబరపడ్డారు. తమ చివరి లీగ్ స్టేజ్ మ్యాచ్‌కు వచ్చేసరికి అవకాశాలు బాగానే ఉన్నప్పటికీ.. నెదర్లాండ్స్, జెర్సీతో కలిసి ఇటలీ పోటీపడాల్సి వచ్చింది. టీ20ల్లో నెదర్లాండ్స్‌కు ఎంతో అనుభవం ఉంది. చివరి లీగ్ మ్యాచ్‌లో తాము నిర్దేశించిన 135 పరుగుల టార్గెట్‌ను నెదర్లాండ్స్ 15 ఓవర్లలోనే ఛేదిస్తే ఇటలీకి బదులు జెర్సీ క్వాలిఫై అయ్యేది. అయితే, నెదర్లాండ్స్ 16.2 ఓవర్లలో విజయం సాధించింది. దీంతో ఐదేసి పాయింట్లతో ఉన్నప్పటికీ.. జెర్సీ (ం0.306) కంటే ఇటలీ (0ం612) నెట్ రన్‌రేట్‌లో ముందు ఉండటంతో తొలిసారి పొట్టి కప్ టోర్నీకి అర్హత సాధించింది.

## జెర్సీ 85 వెనక ఇదీ కథ..

ఆస్ట్రేలియా నుంచి ఇటలీకి మారిన తర్వాత బర్న్స్ తన జెర్సీ నెంబర్‌ను 85గా తీసుకున్నాడు. ఈ నెంబర్ వెనక క్రికెట్‌కు సంబంధించే కాకుండా.. వ్యక్తిగత అంశాలూ ఉన్నాయి. ఈ లోకం నుంచి వెళ్లిపోయిన తన సోదరుడు డొమినిక్‌కు గుర్తుగా ఈ నెంబర్‌ను తీసుకున్నట్లు పలు సందర్భాల్లో వెల్లడించాడు. గతేడాది ఫిబ్రవరిలో డొమినిక్ ప్రాణాలు విడిచాడు. అతడు ఆస్ట్రేలియాలో సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి క్రికెటర్. బర్న్స్ బర్త్‌డే కూడా ఇదే సంవత్సరం కావడంతో మరింత అనుబంధం ముడిపడి ఉంది.

## ఇప్పుడు క్రికెట్‌లోనూ..

ఇటలీ అనగానే ఫుట్‌బాల్, టెన్నిస్ గుర్తుకొస్తుంది. పోలో మాల్దిని, రాబర్టో బెగ్గియో.. ఇలా చాలామంది స్టార్లు ఉన్నారు. టెన్నిస్‌లో ప్రస్తుతం టాప్ ఆటగాడు యోనిక్ సినర్, జాస్మైన్ పావోలిని అదరగొట్టేస్తున్నారు. ఇప్పుడు క్రికెట్‌లోనూ తమ దేశం పేరు వినిపించేందుకు అక్కడి క్రికెటర్లు సిద్ధమయ్యారు. అయితే, వారికి ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఓవైపు ఉద్యోగాలు చేసుకుంటూనే మ్యాచులు ఆడుతున్నవారూ లేకపోలేదు. ఇప్పుడీ 35 ఏళ్ల బర్న్స్ నాయకత్వంలో ఇటలీ ప్రపంచ క్రికెట్ వేదికపై పోటీపడేందుకు సిద్ధపడుతున్న వేళ.. అక్కడి ప్రజల నుంచీ భారీగానే మద్దతు దక్కడం ఖాయంగానే కనిపిస్తోంది.

# టెక్సాస్ సూపర్‌కింగ్స్‌పై విజయం.. మేజర్ లీగ్ ఫైనల్‌కు న్యూయార్క్

మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీ తుది దశకు చేరుకుంది. ఛాలెంజర్ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్‌పై ఎంఐ న్యూయార్క్ 7 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. దీంతో వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన టెక్సాస్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో న్యూయార్క్ 19 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. నికోలస్ పూరన్ (52లి) హాఫ్ సెంచరీ చేయగా.. మోనాంక్ పటేల్ (49), కీరన్ పొలార్డ్ (47లి) రాణించారు. కీలక సమయంలో ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా నిలిచిన కీరన్ పొలార్డ్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను జారవిడవడంతో టెక్సాస్‌కు ఓటమి తప్పలేదు. పొలార్డ్ – పూరన్ నాలుగో వికెట్‌కు 40 బంతుల్లో 89 పరుగులు జోడించారు. టెక్సాస్ బౌలర్లలో అకీల్, జియా ఉల్ హక్, నూర్ అహ్మద్ తలో వికెట్ తీశారు. జులై 13న (సోమవారం) వేకువజామున 5.30




గంటలకు వాషింగ్టన్ – న్యూయార్క్ మధ్య ఫైనల్ జరగనుంది.

## డుప్లెసిస్, అకీల్ హాఫ్ సెంచరీలు

తొలుత బ్యాటింగ్ చేసిన టెక్సాస్ ఇన్నింగ్స్ సాఫీగా సాగలేదు. ఓపెనర్లు స్మిత్ పటేల్ (9), డుప్లెసిస్ (59) మొదటి వికెట్‌కు 29 పరుగులు జోడించారు. కానీ, స్వల్ప వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. సాయితేజ (1), శుభ్‌మ్ (1), స్టొయినిస్ (6) విఫలమయ్యారు. ఓ వైపు వికెట్లు పడినా డుప్లెసిస్ మాత్రం హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, అకీల్ (55లి)తో కలిసి డొనొవన్ ఫెర్రీరా (32లి) ఆఖర్లో దూకుడుగా ఆడాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 81 పరుగులు జోడించి గౌరవప్రదమైన స్కోరును అందించారు. ఎంఐ బౌలర్లలో ట్రిస్టన్ ల్యూస్ 3, పొలార్డ్ 2 వికెట్లు తీశారు.

FONT SIZE

# రిటైర్‌మెంట్ తర్వాత ఆ పుస్తకం పూర్తి చేస్తా: రజనీకాంత్



: ఎస్.వెంకటేశన్ రచించిన 'వేల్పారి' పుస్తకానికి విశేష పాఠకాదరణ లభించిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం చెన్నైలో ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పుస్తక పఠనం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి కార్యక్రమానికి తనని ఆహ్వానించడంపై సరదాగా జోకులు వేశారు. ఇలాంటి కార్యక్రమాలకు కమల్‌హాసన్‌ను ఆహ్వానించాలన్నారు.

''మనం ఏం మాట్లాడాలనేది విజ్ఞానం.. ఎలా మాట్లాడాలనేది ప్రతిభ.. ఎంత మాట్లాడాలనేది స్టేజ్.. ఏం చెప్పాలి, ఏం చెప్పకూడదు అనేది అనుభవం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు. ఇటీవల ఓ కార్యక్రమంలో నేను చేసిన వ్యాఖ్యలు ఒకింత వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. అందుకే ఈసారి ఆచితూచి మాట్లాడాలనుకుంటున్నా. ఇలాంటి కార్యక్రమాలకు శివకుమార్ లేదా కమల్‌హాసన్ లాంటి వారిని పిలవాల్సింది. ఎందుకంటే వారందరూ ఎంతో మేధావులు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని నన్ను ఆహ్వానించినప్పుడు.. 75 ఏళ్ల వయసులో కూలింగ్ గ్లాసులు పెట్టుకొని స్లో మోషన్‌లో నడిచే నన్నెందుకు పిలిచారా? అని ఆశ్చర్యపోయా'' అంటూ రజనీకాంత్ నవ్వులు పూయించారు.

రామకృష్ణ ఆశ్రమం వల్ల తనకు పుస్తక పఠనం అలవాటుగా మారిందన్నారు. ఇప్పటివరకూ ఎన్నో గొప్ప పుస్తకాలు చదివానని ఆయన చెప్పారు. తనలో స్ఫూర్తినింపిన కొంతమంది రచయితల పేర్లను ఆయన గుర్తు చేసుకున్నారు. జయకంధన్ రచించిన ఓ పుస్తకం గురించి ఆయన మాట్లాడుతూ.. దానిని చదివి తాను కన్నీళ్లు పెట్టుకున్నానన్నారు. స్నేహితులు చెప్పడం వల్ల తాను 'వేల్పారి' పుస్తకాన్ని చదవడం ప్రారంభించానని ఇప్పటికే 25 శాతం పూర్తి చేశానన్నారు. సినిమా నుంచి రిటైర్‌మెంట్ తీసుకున్న తర్వాత ఆ పుస్తకం చదవడం పూర్తిచేస్తానని తెలిపారు. 'వేల్పారి' ఆధారంగా శంకర్ తెరకెక్కించనున్న సినిమా కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని వెల్లడించారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. రజనీకాంత్ ప్రస్తుతం 'కూలీ', 'జైలర్ 2' కోసం వర్క్ చేస్తున్నారు. ఆగస్టు 14న కూలీ విడుదల కానుంది.



# భగవద్గీతపై 5 నిమిషాల ఏఐ చిత్రం

ప్రస్తుతం ఇండస్ట్రీ మొత్తం పురాణాలు, ఇతిహాసాలపై ఆసక్తి చూపుతోంది. వీటి ఆధారంగా ఇప్పటికే కొన్ని సినిమాలు వచ్చి ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మరికొన్ని భారీ స్థాయిలో రూపొందుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరో సర్‌ప్రైజ్‌ను పంచుకున్నారు దర్శకుడు రామ్ మాధ్వాని (. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై ) షార్ట్‌ఫిల్మ్ రూపొందించినట్లు చెప్పారు.

రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. దీనికోసం వీఆర్ (వర్చువల్ రియాలిటీ), ఏఐ (కృత్రిమ మేధస్సు)లను ఉపయోగించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ షార్ట్ ఫిల్మ్‌ను ప్రైవేట్ ప్రివ్యూలలో ప్రదర్శించినట్లు వెల్లడించారు. ఇది కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ ఇందులో భగవద్గీతలోని 18 అధ్యాయాలను చూపినట్లు తెలిపారు. ''వీఆర్‌తో కథలోని పవిత్రతను పునరుద్ధరించడానికి మనకు అవకాశం ఉంది. కొన్ని శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాలు, గ్రంథాల కంటే మించిన కథలు ఏం ఉంటాయి' అని ఆయన అన్నారు. కేవలం పౌరాణిక కంటెంట్‌ను చూపించడం మాత్రమే కాదు.. ప్రేక్షకులను ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని చెప్పారు. 'లెట్స్ టాక్' చిత్రంతో దర్శకుడిగా మారిన రామ్ మధ్వానీ ఆ తర్వాత 'నీర్జా', 'ధమాకా' వంటి చిత్రాలతో పాటు, 'ఆర్య', 'ది వాకింగ్ ఆఫ్ ఏ నేషన్' వంటి వెబ్‌సిరీస్‌లను తెరకెక్కించారు.

ఇతిహాసాల ఆధారంగా వరుస ప్రాజెక్ట్‌లు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. తాజాగా విడుదలైన 'రామాయణ' గ్లింప్స్‌నకు భారీ స్పందన లభించింది. రామాయణం ఆధారంగా రూపొందుతోన్న ఈ సినిమా రెండు భాగాలుగా రానుంది. మొదటి పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి విడుదల కానుంది. అలాగే ప్రముఖ నిర్మాణసంస్థ హొంబలే ఫిల్మ్స్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలను నిర్మించనున్నట్లు ఇటీవల ప్రకటించింది.

# 33 సెకన్ల ముద్దు సీన్ తొలగింపు.. సెన్సార్ తీరుపై నటి ఆగ్రహం




డేవిడ్ కొరెన్స్‌వెట్, రెచెల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సూపర్ మ్యాన్' శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ సూపర్‌హీరో చిత్రానికి సంబంధించిన ఇండియన్ వెర్షన్ సెన్సార్‌పై బాలీవుడ్ నటి శ్రేయా ధన్వంతరి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ సినిమాలో 33 సెకన్ల ముద్దు సన్నివేశాన్ని తొలగించడాన్ని ఆమె తప్పుపట్టారు. ఇదొక అర్థం పర్థం లేని చర్య అని వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యల వల్ల సినిమాలు చూడాలనే ఆలోచనను ప్రేక్షకులు మానుకుంటారన్నారు.

''సూపర్‌మ్యాన్'లో 33 సెకన్ల సన్నివేశాన్ని సెన్సార్ తొలగించింది. ఇదేం చర్య? మనం థియేటర్లకు వెళ్లి సినిమాలు చూడాలని సెన్సార్ వాళ్లు కోరుకుంటారు. పైరసీలను ప్రోత్సహించవద్దని అడుగుతారు. కానీ వాళ్లు మాత్రం ఇలాంటి పనులు చేస్తారు. వాళ్ల ఉద్దేశమేంటో నాకు ఏమాత్రం అర్థంకావడం లేదు. ఇలాంటి చర్యలతో థియేటర్ అనుభూతిని దారుణంగా దెబ్బతీస్తున్నారెందుకు? మా డబ్బు, సమయంతో మేము ఏం చూడాలనుకుంటున్నామో మమ్మల్నే నిర్ణయించుకోనివ్వండి. ఇదొక హాస్యాస్పదమైన పని. సినిమా చూడటానికి థియేటర్ ఉత్తమ మార్గం. ప్రేక్షకులను చిన్న పిల్లల్లా భావించి.. థియేటర్ అనుభూతిని పూర్తిగా ఆస్వాదించకుండా చేస్తున్నారు'' అని ఆమె ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్ట్ పెట్టారు.

ఈ చిత్రానికి సంబంధించి హీరో డైలాగ్స్ విషయంలో సెన్సార్ టీమ్ అభ్యంతరం వ్యక్తంచేసింది. కొన్ని సన్నివేశాల్లో హీరో వాడే పదాలను తొలగించాలని ఆదేశించింది. ఆయా మార్పుల అనంతరం సెన్సార్ బృందం యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. 2.10 గంటల నిడివితో ఇది ప్రేక్షకుల ముందుకువచ్చింది. బాలీవుడ్‌లో తెరకెక్కిన పలు చిత్రాల్లో శ్రేయా ధన్వంతరి నటించారు. 'ఫ్యామిలీ మ్యాన్', 'చుప్', 'స్కామ్ 1992' వంటి ప్రాజెక్ట్‌లు ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. తెలుగులో ఆమె 'జోష్', 'స్నేహ గీతం' సినిమాల్లో నటించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానున్న 'ఫ్యామిలీ మ్యాన్ 3'లోనూ ఆమె కీలక పాత్ర పోషించారు.

# ప్రేమిస్తే కచ్చితంగా మారతారు: రష్మిక



వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక ( ఆమె నటించిన 'యానిమల్' ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో.. అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు ఆ సినిమాలో హీరో పాత్ర లాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు.

నిజ జీవితంలో 'యానిమల్'లో హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకురాగలరా? అని అడిగిన ప్రశ్నకు రష్మిక ఆసక్తికర సమాధానమిచ్చారు. ''మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే.. మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతాను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక.. అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారు'' అని చెప్పారు. తాను అర్థంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు.

ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు 'ది గర్ల్‌ఫ్రెండ్'తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు ). అలాగే అట్లీ– అల్లు అర్జున్‌ల సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# ఆ సమయంలో తినడానికి కూడా డబ్బుల్లేవు: 'జై లవకుశ' విలన్ కంటతడి

ముంబయి: 'జై లవకుశ'లో విలన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు నటుడు రోనిత్ రాయ్ ). ప్రస్తుతం ముంబయిలో సెక్యూరిటీ ఏజెన్సీ నడుపుతున్న ఆయన ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సినిమాల్లో తన కెరీర్ గురించి పలు విషయాలు పంచుకున్నారు. ముఖ్యంగా ఇండస్ట్రీలోకి రాకముందు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. తినడానికి కూడా డబ్బుల్లేక ఇబ్బందిపడ్డానని చెప్పారు. ఆ సమయంలో చోటు చేసుకున్న ఒక సంఘటనను గుర్తు చేసుకుని ఇంటర్వ్యూలో కన్నీళ్లు పెట్టుకున్నారు.



# ఆ రక్తం పారేది ఒంట్లో కాదు

%'కేడీ ది డెవిల్'గా ( తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనున్నారు ధృవ సర్జా ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని ప్రేమ్ తెరకెక్కించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. రీష్మా కథానాయిక. సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో టీజర్‌ని విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రం ఆద్యంతం భారీ యాక్షన్ హంగామాతో ఆసక్తికరంగా సాగింది.

''వాళ్లిద్దరిదీ రక్త సంబంధం సర్. కానీ, ఆ రక్తం పారేది ఒంట్లో కాదు'' అంటూ టీజర్‌లో ధృవ – సంజయ్ దత్‌ల శత్రుత్వాన్ని వర్ణించిన తీరు ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ధృవ సర్జా మాట్లాడుతూ.. ''ఇది భారీ యాక్షన్ సినిమా. తప్పకుండా అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. నాకు సంజయ్ దత్ అంటే చాలా ఇష్టం. ఆయనతో కలిసి పని చేయడం ఆనందాన్నిచ్చింది'' అన్నారు. ''ఈ చిత్ర టీజర్‌కు దక్కుతున్న ఆదరణ నాకెంతో ఆనందాన్నిస్తోంది. నేను కన్నడలో తీసిన 'జోగి' చిత్రాన్ని తెలుగులో 'యోగి'గా తీశారు. దాన్ని నేనే తెరకెక్కించాల్సింది. కానీ, నాకు తెలుగు భాష తెలియదని చేయలేనని చెప్పా. ధృవ ఈ సినిమాలో కాళిదాసుగా కనిపిస్తారు. ఆ పాత్రలో బలమైన భావోద్వేగాలున్నాయి'' అన్నారు దర్శకుడు ప్రేమ్. నటుడు సంజయ్ దత్ మాట్లాడుతూ.. ''ధృవ నాకు తమ్ముడు లాంటి వాడు. ఈ చిత్రంతో తను చాలా ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నా. నాకు 1980ల నుంచి హైదరాబాద్‌తో మంచి అనుబంధం ఉంది. చిరంజీవి, నాగార్జున నాకు చాలా ఇష్టం. వాళ్లతో చక్కటి అనుబంధం ఉంది. ప్రస్తుతం ప్రభాస్‌తో 'ది రాజాసాబ్'లో నటిస్తున్నా. తను అద్భుతమైన నటుడు. ఇప్పుడు నేనూ తెలుగు నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నా'' అన్నారు.

# నోరూరించే పింక్ పనీర్ టిక్కా

పనీర్ టిక్కా అంటే పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఇష్టంగా తింటారు. ఈ టేస్టీ వెజిటేరియన్ డిష్ దేశ క్యూజిన్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. పనీర్ టిక్కా టేస్టీగా ఉండటమే కాకుండా తయారుచేయడం కూడా చాలా సులభం కావడంతో మహిళలు ఏ సందర్భమైనా దీన్ని ఇట్టే చేసేస్తుంటారు.

ఇక ఇటీవల చెఫ్ నటాషా గాంధీ పింక్ పనీర్ టిక్కాను ఇంట్లో ఎలా తయారుచేసుకోవచ్చో వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేయగా ఇప్పుడా క్లిప్ నెట్టింట తెగ వైరలవుతోంది. ఈ పనీర్ టిక్కా రెసిపీ అందంగా




కనిపించడమే కాదు ఎంతో రుచికరంగా, అద్భుతమైన స్టార్టర్ డిష్‌గా ఆకట్టుకుంటుందని ఈ వీడియోకు క్యాప్షన్ ఇచ్చారు.

# మధుమేహులకు మేలైన స్నాక్స్ ఇవే..!

దేశీ స్నాక్స్ మంచి ఫ్లేవర్‌తో పాటు పలు వెరైటీల్లో కోరుకున్న రుచుల్లో లభిస్తాయి. రకరకాల ఫుడ్ ఆప్షన్లు ఉన్నా ఆరోగ్యానికి మేలు చేసే స్నాక్స్‌ను ఎంపికచేసుకోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా మధుమేహులకు సరైన స్నాక్స్ ఎంచుకోవడం కష్టం. అయితే ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగకుండా ఉండే ఆహార పదార్ధాలను మధుమేహులు తీసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను నియంత్రిస్తూనే శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఆహార పదార్ధాలను ఎంపిక చేసుకోవాలి. బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను నియంత్రిస్తూ, సరైన పోషకాలతో కూడిన ఐదు సులభమైన స్నాక్స్‌ను పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ముఖ్యంగా చిక్‌పీ ఛాట్ ఎంతో టేస్టీగా ఉండటంతో పాటు ఆరోగ్యానికీ మేలు



చేస్తుంది.


శనగలతో చాట్ మసాలా తీసుకోవడం ద్వారా రక్తంలో షుగర్ లెవెల్స్ నిలకడగా ఉండటంతో పాటు ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంటుంది. ఇందులో ఆనియన్స్, టమాట, కీరా దోస, స్వీట్ కార్న్ వంటివి అవసరమైన పోషకాలను, యాంటీఆక్సిడెంట్స్‌ను అందించడమే కాకుండా చాట్‌ను లో గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండేలా చేస్తాయి. ఇక వెజిటబుల్ ఉప్మా, స్ప్రౌటెడ్ మూంగ్ సలాడ్, స్టఫ్డ్ బెల్‌పెప్పర్స్, ఫ్లాక్స్ సీడ్స్‌తో కుకుంబర్ రైతా వంటి స్నాక్స్‌ను తీసుకోవచ్చు.

# వ్యాయామంతో నిద్రలేమికి చెక్ :

## వారానికి ఎన్ని గంటలు వ్యాయామం చేయాలంటే..!

శారీరకంగా చురుకుగా ఉండే వారు మెరుగ్గా నిద్రిస్తారని నూతన అధ్యయనం వెల్లడించింది. వారానికి రెండు, మూడు సార్లు కనీసం గంట పాటు వ్యాయామం చేస్తే చాలు కంటి నిండా కునుకుతీసేందుకు సరిపోతుందని పరిశోధకులు తెలిపారు. శారీరకంగా చురుకుగా లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక జనాభాను ఇన్‌సోమ్నియా పట్టిపీడిస్తోందని, ఇదే నిద్ర లేమికి ప్రధాన కారణమని పరిశోధకులు చెబుతున్నారు.

ఇన్‌సోమ్నియాతో ఇతర ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయని పేర్కొన్నారు. ఇక నిద్రలేమితో గుండె పోటు, స్ట్రోక్, ఊబకాయం, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలు వెంటాడతాయి. శారీరకంగా చురుకుగా ఉండేవారిలో నిద్రలేమి సమస్య ఉండదని పలు సర్వేలు వెల్లడించినా అయితే ఎంతమేర



వ్యాయామం సరైన నిద్రకు అవసరమనే దానిపై తాజా అధ్యయనం దృష్టి సారించింది.

ఈ సర్వేలో భాగంగా ఐస్‌ల్యాండ్‌లోని రెజవిక్ యూనివర్సిటీ నేతృత్వంలో యూరప్‌కు చెందిన పరిశోధకులు 4,399 మందికి సంబంధించిన డేటాను విశ్లేషించారు. శారీరకంగా చురుకుగా ఉండే వారిలో ఇన్‌సోమ్నియా లక్షణాలతో పాటు నిద్రలేమి సమస్యలు తక్కువగా ఉండే అవకాశం ఉందని ఈ అధ్యయనం గుర్తించింది. పలు ఐరోపా దేశాలకు చెందిన వీరిని పదేండ్ల పాటు పరిశీలించిన అనంతరం ఈ నిర్ధారణకు వచ్చారు.

# నిద్రలేమితో హైబీపీ ముప్పు

రోజుకు ఏడు గంటల కన్నా తక్కువ నిద్రిస్తే క్రమంగా అధిక రక్తపోటుకు దారితీసే ముప్పు పొంచిఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ వార్షిక శాస్త్రీయ సెషన్‌లో పరిశోధకులు తమ నివేదికను సమర్పించారు. 2000 జనవరి నుంచి 2023 మే మధ్య చేపట్టిన 16 అధ్యయనాల గణాంకాలను విశ్లేషించి ఈ వివరాలను నిగ్గుతేల్చారు.

గతంలో హైబీపీ నేపధ్యంలేని ఆరు దేశాలకు చెందిన 10,44,035 మందిలో హైపర్‌టెన్షన్‌ను గుర్తించారు. వయసు, లింగబేధం, విద్యార్హతలు, బీఎంఐ, స్మోకింగ్ వంటి అంశాలతో సంబంధం లేకుండా నిద్రలేమి బీపీకి కారణమవుతుందని ఈ అధ్యయనంలో కనుగొన్నారు. రోజుకు ఐదు గంటల కన్నా తక్కువ నిద్రించే వారిలో బీపీ ముప్పు 11 శాతం అధికంగా ఉండగా, రోజుకు ఏడు గంటల కన్నా తక్కువ నిద్రపోయేవారిలో బీపీ ముప్పు 7 శాతం పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు.



రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్ర అవసరమని నిపుణులు సూచిస్తున్నారని, ఇలా చేయడం మీ గుండెకు కూడా మేలు చేస్తుందని అధ్యయన పరిశోధకులు, ఇరాన్‌లోని టెహ్రాన్ హార్ట్ సెంటర్ కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కవే హొసెని చెప్పారు. మధుమేహం, స్మోకింగ్ అలవాటున్న వారిలో మధుమేహ ముప్పు 20 శాఈతం అధికమని వివరించారు.

# వేసవిలో దాహార్తి తీరేందుకు

# ఈ సూపర్ ఫ్రూట్స్ బెస్ట్

మండే ఎండల్లో ఎంత నీరు తాగినా దాహార్తి తీరదు. వేసవిలో శరీరం హైడ్రేషన్ కోల్పోకుండా చూసుకోవడం కీలకం. నీరు అధికంగా ఉండే పండ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు డీహైడ్రేషన్ బారినపడకుండా ఉండవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

అధికంగా నీరు ఉండే పండ్ల రసాలు, స్మూతీలు, స్నాక్స్ ను ఎంచుకోవడం మేలని సూచిస్తున్నారు. వేసవిలో సూపర్‌ఫ్రూట్‌గా వాటర్‌మెలన్ తీసుకోవచ్చు. ఇందులో దాదాపు 90 శాతం నీరు ఉండటంతో వేసవిలో ఈ పండును తీసుకోవడం పోషకాల పరంగా, వివిధ వ్యాధుల ముప్పును నివారించేందుకూ ఉపకరిస్తుంది. వాటర్‌మెలన్‌లో ఉండే అమినో యాసిడ్ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఇక ఫ్లేవనాయిడ్స్,



ఫైటోన్యూట్రియంట్స్, ఫైబర్, విటమిన్ సీ, మాంగనీస్, ఫోలేట్, పొటాషియం వంటి ఎన్నో పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే స్ట్రాబెర్రీస్‌ను కూడా సమ్మర్ ఫ్రూట్స్‌లో భాగంగా తీసుకోవచ్చు. ఇవి చర్మ ఆరోగ్యాన్ని సంరక్షించడంతో పాటు జీర్ణక్రియ సాఫీగా సాగేందుకు ఉపకరిస్తాయి. ఇక సమ్మర్‌లో తీసుకోవాల్సిన ఐదు ఫ్రూట్స్‌ను పరిశీలిస్తే..

# సెంచరీ కొట్టాలంటే.

వయసు సెంచరీ కొట్టాలంటే.. ఏజ్ యాభైదాటాక కొన్ని ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి. యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు అలవాటైన ఆహార నియమాలే కొనసాగిస్తానంటే.. అరవైలోనే ఆస్పత్రిపాలు కావాల్సి వస్తుంది. డెబ్బయ్ దాటకుండానే రనౌట్ అయ్యే ప్రమాదమూ ఉంది. యాభై ఏండ్లు దాటాక జీర్ణశక్తి కాస్త మందగిస్తుంది. శరీర పోషక అవసరాలూ మారుతుంటాయి. మలివయసులో ఆరోగ్యంగా ఉండాలంటే.. కొన్ని రకాల ఆహార పదార్థాలను దూరంగా ఉంచడం ఎంతైనా మంచిది. అవేంటంటే..

%వేపుళ్లు వద్దు: వయసులో హాఫ్ సెంచరీ కొట్టాక.. రోజువారీ ఆహారంలో వేపుళ్ల కోసం వేయించుకు తినడం మానేయాల్సిందే! పండుగకో పబ్బానికో రుచి చూడొచ్చు కానీ, ప్రతిరోజూ కరకరలాడే వేపుళ్లు తింటే ప్రమాదమే! వాటిలో ఉండే నూనె శరీరానికి మంచిది కాదు. పైగా పొట్టలో కొలెస్ట్రాల్ కూడా పేరుకుపోతుంది. అంతగా తినాలి అనుకుంటే.. ఎయిర్ ఫ్రయిర్‌లో గానీ, ఓవెన్‌లో గానీ తయారుచేసుకుంటే కాస్త మంచిది!

చక్కెరకు చెక్: జ్యూస్, గ్రీన్ టీ, బలవర్ధకం.. లాంటి లేబుల్స్ చూసి అవి ఆరోగ్యవంతమైనవి అనుకొని మోసపోతుంటాం. నిజానికి చూడాల్సింది అందులోని చక్కెర శాతం. అవి



నడివయసుకు మంచివి కావు. చక్కెరకు చెక్ పెడితే గానీ, కొలెస్ట్రాల్‌కు కామా పడదు!

చాపల్యం చాలు: యాభై ఏండ్లు వచ్చే వరకు ఆస్వాదించిన రుచులు చాలు. జిహ్వ చాపల్యాన్ని ఎంత వదులుకుంటే అంత ఆరోగ్యం. రుచుల కోసం ప్యాకేజ్డ్ ఫుడ్‌కు అలవాటుపడితే చేటు తప్పదు. వీటిలో కనిపించకుండా చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. దీనిని హిడెన్ షుగర్ అంటారు. వీటి బదులు తాజా పండ్లు తినడం మంచిది.

మందుకు నో: వయసు పెరుగుతున్న కొద్దీ.. మద్యం వల్ల కలిగే దుష్ఫలితాలూ పెరుగుతాయి. మద్యంతో కాలేయం మీద ఒత్తిడి పెరుగుతుంది. యాభయ్యో పుట్టినరోజు నాడు డ్రింకింగ్ హ్యాబిట్‌కు స్వస్తి పలకండి.

ఉప్పు ముప్పు: రోజువారీ ఆహారంలో 2300 మిల్లీగ్రాములకు మించి ఉప్పు ఉండకూడదన్నది నిపుణుల మాట. కానీ, మనం అంతకు ఎన్నో రెట్లు లాగించేస్తుంటాం. నడివయసులో వచ్చే అధిక రక్తపోటు లాంటి సమస్యలను ఉప్పు తీవ్రతరం చేస్తుంది. వీలైనంత వరకు ఉప్పు తగ్గించడం అత్యవసరం అని గుర్తించండి.

# ఈ ఆహారంతో కిడ్నీలు పదిలం

కిడ్నీలను దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకునేందుకు పోషకాలతో నిండిన సమతులాహారం కీలకం. ఆహార



నియమాల్లో చిన్నపాటి మార్పులతో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. సోడియం, పాస్ఫరస్, పొటాషియంతో కూడిన ఆహారం అధికంగా తీసుకోవడం కిడ్నీలపై అదనపు భారం మోపుతుంది. ఇతర కాంప్లికేషన్స్ తలెత్తకుండా ఈ తరహా ఆహారాన్ని తగిన మోతాదు మించకుండా చూసుకోవాలి.

అధిక ప్రొటీన్ ఆహారం కూడా కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో మూత్రపిండాలపై పనిభారం పెంచుతుంది. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు తీసుకుంటే వాటిలో ఉండే పోషకాలు, యాంటీఆక్సిడెంట్ల కిడ్నీ పనితీరుకు ఊతమిస్తాయి. పండ్లు, కూరగాయలతో పాటు తృణధాన్యాలను తీసుకోవడం, బీపీ, శరీర బరువును అదుపులో ఉంచుకోవడంతో కిడ్నీ పనితీరు మెరుగవుతుంది.

విటమిన్స్, మినరల్స్‌తో కూడిన ఆహారం కిడ్నీలకు మేలు చేయడంతో పాటు రోజంతా ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉండేందుకు ఉపకరిస్తాయి. ఇవి వాపు ప్రక్రియ నివారించి, రోగ నిరోధక వ్యవస్థను ఉత్తేజితం చేస్తాయి. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు పోషకాహారంతో పాటు సమతులాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీల ఆరోగ్యానికి పండ్లలో ముఖ్యంగా జామ, యాపిల్, పియర్, పపాయ, పైనాపిల్ తీసుకోవాలని చెబుతున్నారు. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ కిడ్నీలు దెబ్బతినకుండా కాపాడతాయి. ఇక ఐరన్, విటమిన్ కే వంటి కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పాలకూర, కేల్ వంటి ఆకుకూరలు తీసుకోవాలి. ఫైబర్ అధికంగా ఉండే బ్రౌన్ రైస్, క్వినోవా కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఫిష్, తోఫు వంటి లీన్ ప్రొటీన్ కిడ్నీ ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# ఈ ఆహారంతో అల్జీమర్స్ రిస్క్‌కు చెక్..!

వయసు పెరిగే కొద్దీ జ్ఞాపక శక్తి తగ్గడం, అల్జీమర్స్ సహా పలు వ్యాధుల ముప్పు పెరగడం ఆందోళన రేకెత్తిస్తుంటుంది. అయితే ఆరోగ్యకర జీవనశైలి, సమతులాహారంతో అల్జీమర్స్ సహా పలు వ్యాధుల ముప్పును నివారించవచ్చు. ఆరోగ్యకర ఆహారం మెదడు ఆరోగ్యాన్నీ పదిలంగా ఉంచుతుంది.

కచ్చితంగా ఈ ఆహారంతో వ్యాధులను నియంత్రించవచ్చనే హామీ లేకుననా నిర్ధిష్ట ఆహార పదార్ధాలతో అల్జీమర్స్ ముప్పును తగ్గించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక అల్జీమర్స్‌తో పాటు శారీరక ఆరోగ్యానికి ఈ ఆహార పదార్ధాలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకుంటే వయసు మీద పడే సమస్యను జాప్యం చేయడంతో పాటు దీర్ఘాయువు సొంతమవుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇ

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy